

ప్లే-ఆఫ్స్ రేసుకు సన్‌రైజర్స్ దూరం

- కీలక పోరులో గుజరాత్ చేతిలో 38 పరుగుల తేడాతో ఓటమి

8

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 270 | విజయవాడ, శనివారం 3 మే 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 3 May 2025 | Rs



ప్రధాని ఆవిష్కరించిన రాజధాని పునఃనిర్మాణ శిలాఫలకం

అమరావతి పున:ప్రారంభ సభలో

ఆర్థిక సాయం ఊసెత్తని ప్రధాని

- నిర్మాణానికి భుజం కాస్తా
- సంపూర్ణ సహకారానికి కట్టుబడి ఉన్నా అన్న మాటలకే పరిమితం



హాజరైన జనం (ఇన్‌సెట్‌లో అభివాదం చేస్తున్న నరేంద్ర మోడీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్)

- రాజధానికి చట్టబద్ధత ప్రస్తావన లేదు
- అట్టహాసంగా పలు మౌలిక సదుపాయాల పనులకు వర్చువల్‌గా మోడీ శంకుస్థాపన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పనులను శుక్రవారం అట్టహాసంగా పున:ప్రారంభించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎంత ఆర్థిక సహాయం అందిస్తారో చెప్పకుండా దాటవేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్రానికి చెందిన కూటమి నేతలు సైతం ప్రధానిని నిర్దిష్టంగా రాజధానికి నిధులు, చట్టబద్ధత అడగలేదు. అమరావతికి తమ సంపూర్ణ సహకారం అందిస్తామని మాత్రం మోడీ హామీ ఇచ్చారు. రాజధాని నిర్మాణానికి, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మీ భుజాలకు తన భుజం కలుపుతానని, అందుకు కట్టుబడి ఉంటానని తెలిపారు. కాగా ఎపికి అమరావతిని రాజధానిగా పేర్కొంటూ పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పిస్తామని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు భూములిచ్చిన రైతుల సమక్షంలో ప్రకటించగా ఆ ఊసే ప్రధాని నోటివెంట రాలేదు. అమరావతి పున:ప్రారంభ కార్యక్రమాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న తాత్కాలిక సచివాలయ సముదాయం వెనుకవైపున భారీ స్థాయిలో నిర్వహించింది. రూ.41 వేల కోట్ల విలువైన అమరావతి పున:ప్రారంభ పనులకు, రాష్ట్రంలోని రైల్వే, జాతీయ రహదారులు, మౌలిక సదుపాయాలు, కృష్ణా జిల్లా నాగాయలంకలో నెలకొల్పదల్చిన క్షిపణి పరీక్షా కేంద్రాలకు వర్చువల్‌గా ప్రధాని శంకుస్థాపన చేశారు. సభ యావత్తూ కూటమి నేతల మధ్య పరస్పర పొగడ్తలతో సరిపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ మోడీ నుద్దేశించి 'నమో..' మంత్రంతో స్తుతించారు. అంతే తీరుగా మోడీ సైతం చంద్రబాబును, పవన్‌ను ఆకాశానికెత్తారు. సభా వేదికపై గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కె రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు.

పదేళ్లల్లో ఎంతో చేశాం

2015లో ప్రజల రాజధానిగా అమరావతికి తానే శంకుస్థాపన చేశానని, మిగతా 7లో

మోడీ మాటలు మోసపూరితం
- వి. శ్రీనివాసరావు

మరిన్ని వార్తలు 2

దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించాలి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించాలని సిపిఎం రాష్ట్రకమిటీ డిమాండ్ చేసింది.దళితులు క్రిస్టియన్ మతంలోకి మారిన మరుక్షణం ఎస్సీ హోదా కోల్పోతారంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు దురదృష్టకరమని ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఏ మతంలోకి మారినా దళితులు అంటరానితనానికి, వివక్షతకు గురవుతూనే ఉన్నారని పేర్కొన్నారు. క్రిస్టియానిటీ కులాన్ని గుర్తించకపోయినా కులవివక్ష కొనసాగుతుందని అనేక నివేదికలు వెల్లడించాయని తెలిపారు. దేశంలో కులం మతంపై ఆధారపడి లేదని, వ్యవస్థీకృతమై ఉందని పేర్కొన్నారు. కులం పునాదుల్ని తొలగించడానికి అవసరమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక చర్యల్ని తీసుకోవాలని పేర్కొన్నారు. దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించాలని, అందుకు అవసరమైన చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాని ఆయన డిమాండ్ చేశారు.

హైకోర్టు తీర్పు బాధాకరం : కెవిపిఎస్

క్రిస్టియన్ మతంలోకి దళితులు మారిన మరుక్షణమే ఎస్‌సి హోదా కోల్పోతారని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు బాధాకరమని కెవిపిఎస్ పేర్కొంది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏ మతంలోకి మారినా దళితులు అంటరానితనానికి, వివక్షకు గరవుతూనే ఉన్నారని అన్నారు. దళిత క్రిస్టియన్లను ఎస్‌సిలుగా గుర్తించేందుకు అవసరమైన చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేటి నుంచి గ్రూప్-1 మెయిన్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రూప్-1 మెయిన్ పరీక్షలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) శనివారం నుంచి నిర్వహించనుంది. మొత్తం 89 పోస్టుల భర్తీకి ఈ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా 13 కేంద్రాల్లో జరగనున్నాయి. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన 4496 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. విశాఖపట్నంలో 2, విజయవాడలో 6, తిరుపతిలో 3, అనంతపురంలో 2 చొప్పున పరీక్ష కేంద్రాలను ఎపిపిఎస్‌సి ఏర్పాటు చేసింది. 3న తెలుగు క్వాలిఫైయింగ్ నేచర్ (తెలుగు), 4న క్వాలిఫైయింగ్ నేచర్(ఇంగ్లీష్), 5న పేపర్-1, 6న పేపర్-2, 7న పేపర్-3, 8న పేపర్-4, 9న పేపర్-5 పరీక్షలు జరుగుతాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలను నిర్వహించనున్నారు.

మన్యం బంద్ సక్సెస్

- దుకాణాలను మూసివేసి వ్యాపారుల స్వచ్ఛంద మద్దతు
- ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రకటించాలని ఎక్కడికక్కడ గిరిజనుల ఆందోళన
- నిలిచిన ఆర్‌టిసి బస్సులు, ప్రయివేటు వాహనాలు
- ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం, ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి సాధన కమిటీ, ఇతర గిరిజన ఉద్యోగ, నిరుద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్ విజయవంతమైంది. నిరుద్యోగులు, యువత నుంచే కాకుండా యావత్తు ఆదివాసీ సమాజం నుంచి మంచి స్పందన లభించింది. జిఒ 3కు ఆర్డినెన్స్ జారీ చేయాలని, స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలంటూ నినాదాలు హోరెత్తాయి. తమ దుకాణాలను మూసివేసి ఏజెన్సీలోని వ్యాపారులు బంద్‌కు స్వచ్ఛందంగా మద్దతు తెలిపారు. ప్రయివేట్ వాహనాలు మధ్యాహ్నం వరకూ నిల్చిపోయాయి. బంద్‌లో భాగంగా ఎక్కడికక్కడ ఆందోళనలు, నిరసనలు, మానవహారాలు, బైకు ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని నాయకుల హెచ్చరించారు. బంద్ విజయవంతానికి సిపిఎం, సిపిఐ,, వైసిపి, కాంగ్రెస్ మద్దతు తెలిపాయి.

అల్లూరి జిల్లాలో మూతబడిన పర్యాటక కేంద్రాలు

అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు, రంపచోడవరం డివిజన్లలోని అన్ని మండలాల్లో బంద్ ప్రభావం స్పష్టంగా కనిపించింది. పాడేరు ఏజెన్సీలో రవాణా వ్యవస్థ స్తంభించింది. ఆర్‌టిసి బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ప్రయివేటు వాహనాలు రోడ్డెక్కలేదు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు నామమాత్రంగా పనిచేశాయి. ప్రముఖ పర్యాటక కేంద్రాలైన గిరిజన సాంస్కృతిక మ్యూజియం, కాఫీ మ్యూజియం, పద్మావతి ఉద్యానవన కేంద్రం, చాపరాయి జలపాతం, బొర్రా గుహలు మూతపడ్డాయి. ప్రైవేటు కార్యాలయాలు తెరుచుకోలేదు. పాడేరులో ప్రతి శుక్రవారం నిర్వహించే 'మీ కోసం' పరిష్కార వేదిక



అల్లూరి జిల్లా పాడేరులో నిరసన తెలుపుతున్న ఆదివాసీలు, పలు సంఘాల, పార్టీల నాయకులు

కార్యక్రమానికి ఎవ్వరూ రాలేదు. బంద్ కారణంగా వారపు సంతలు బోసిపోయాయి. దుకాణదారులు, వ్యాపార సముదాయాల నిర్వాహకులు, హోటళ్ల యజమానులు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించారు. బంద్‌తో రోడ్లు నిర్మానుష్యంగా కనిపించాయి. వేకువజాము నుంచి సాయంత్రం వరకూ ఉద్యమ స్ఫూర్తితో ఈ బంద్ సాగింది. సిపిఎం నాయకులు ప్రత్యక్షంగా ఈ బంద్‌లో పాల్గొన్నారు. సిపిఐ, వైసిపి, కాంగ్రెస్ నేతలు మద్దతు తెలిపారు. ఆందోళనకారులు పలుచోట్ల రోడ్లపైనే బైఠాయించి, మధ్యాహ్నం వేళ అక్కడే సామూహిక భోజనాలు చేశారు. పాడేరులో జరిగిన కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, నాయకులు పి.అప్పలనర్స, గిరిజన సమాఖ్య నాయకులు కూడా రాధాకృష్ణ, రంపచోడవరం నియోజకవర్గ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, సిపిఎం ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, ఆదివాసీ చైతన్య సంఘం జిల్లా అధ్యక్షులు వెదుర్ల లచ్చిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ఆర్డినెన్స్ తీసుకొచ్చి స్పెషల్ డిఎస్‌సి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిఒ నెంబర్ 3కి ప్రత్యామ్నాయ చట్టం తెచ్చి గిరిజన ప్రాంతంలో ఉద్యోగాలు వంద శాతం గిరిజనులకే ఇవ్వాలన్నారు. తాజాగా ప్రకటించిన మెగా డిఎస్‌సిలో ఏజెన్సీ ప్రాంతంలో మొత్తం 766 టీచర్ పోస్టులకుగాను ఆదివాసీలకు దక్కేవి కేవలం 42 మాత్రమేనని తెలిపారు. పాడేరులో స్థానిక ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, అరకులోయలో స్థానిక ఎమ్మెల్యే మత్స్యలింగం, ముంచంగిపుట్టులో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర బంద్‌కు మద్దతు తెలిపారు.

రాజవొమ్మంగిలో అరెస్టులు

రాజవొమ్మంగిలో ఆందోళనకారులు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. సమస్యను పరిష్కరించే వరకూ కదిలేది లేదని తేల్చిచెప్పారు. ఈ క్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం, ఆదివాసీ జెఎసి నాయకులు కొండ్ల సూరిబాబు, కుంజం జగన్నాథం, తాము సూరిబాబు, జి.నాగరాజు, ఎంపిపి గోము వెంకటలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు వడుగుల జ్యోతిలను పోలీసులు అరెస్టు చేసి కొద్దిసేపటి తరువాత విడిచిపెట్టారు.

పార్వతీపురం మన్యంలో....

పార్వతీపురం మన్యం జిల్లాలో బంద్ విజయవంతమైంది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, కొమరాడ, సాలూరు, పాచిపెంట, మిగతా 7లో

అన్నదాతలకు అప్పుల తిప్పలు

- పంట రుణాల రెన్యువల్‌కు కొత్త షరతులు
- అసలు, వడ్డీ కట్టాల్సిందేనంటూ బ్యాంకుల నిబంధన



పాలకొండ యూనియన్ బ్యాంకులో రెన్యువల్ చేసేందుకు వచ్చిన రైతులు


ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

ఖరీఫ్ ప్రారంభం కాక ముందే అన్నదాతలకు కష్టాలు మొదలయ్యాయి. పంట రుణాల కోసం బ్యాంకులకు వెళ్తున్న రైతులకు ఊహించని షాక్‌లు ఎదురవుతున్నాయి. ప్రతి ఏడాది మాదిరిగానే తీసుకున్న అప్పుకు వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకుందామని బ్యాంకులకు వెళ్లిన రైతులకు అలా కుదరదంటూ బ్యాంకర్లు చెప్తున్నారు. అసలు, వడ్డీ రెండూ కడితేనే రెన్యువల్ చేస్తామంటూ తేల్చి చెప్తున్నారు. దీంతో, ఉసూరుమంటూ రైతులు ఇంటి ముఖం పడుతున్నారు. గ్రామాల్లో వడ్డీ వ్యాపారులను కలిసి అప్పు కోసం ప్రాధేయపడుతున్నారు. వారం, పది రోజులకు నూటికి రూ.3 నుంచి రూ.5 వరకు వడ్డీకి తీసుకుని ఆ సొమ్మును బ్యాంకులకు కడుతున్నారు. పోనీ కట్టిన వెంటనే డబ్బులు ఇస్తున్నారా అంటే అదీ లేదు. బ్యాంకుల్లో ఆ సొమ్ము ఒక రోజు క్రెడిట్‌గా ఉంచాల్సి ఉంటుందని, డబ్బుల కోసం మరుసటి రోజు రావాలని బ్యాంకర్లు సూచిస్తున్నారు. డబ్బులు తీసుకోవడానికీ పలు నిబంధనలను అమలు చేస్తున్నారు. రుణం డబ్బులు విత్‌డ్రా చేయడానికి చెక్‌బుక్ ఉండాలని చెప్తుండడంతో దానికోసం దరఖాస్తులను నింపుతూ అవస్థలు పడుతున్నారు. బ్యాంకుల నుంచి రూ.49 వేలు పైబడి డబ్బులు తీసుకోవడానికి పాన్ కార్డు కూడా ఉండాలని చెప్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.3.06 లక్షల కోట్లను పంట రుణాలుగా అందించాలని గత నెల 29న అమరావతిలో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయించింది. రాష్ట్ర లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా స్థాయిలో బ్యాంకులు పంట రుణాలు అందించే పని మొదలు పెట్టాయి. రుణాల రెన్యువల్ విషయంలో ఈ ఏడాది నుంచి కొత్త నిబంధనలను అమలు చేస్తున్నారు. గతంలో తీసుకున్న రుణానికి రెన్యువల్ చేయడానికి వడ్డీ మాత్రమే కడితే సరిపోయేది. ఇప్పుడు మారిన ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం అసలు, వడ్డీ రెండూ రైతులతో కట్టించుకుంటున్నారు. అదీ ఒక రోజు క్రెడిట్‌లో ఉంచి మరుసటి రోజు చెల్లిస్తున్నారు.

వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు

అసలు, వడ్డీ చెల్లించేందుకు రైతుల వద్ద డబ్బులు లేకపోవడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీకి అప్పులు తెచ్చి బ్యాంకులకు కడుతున్నారు. రాష్ట్రంలో ఆరు జిల్లాలోని 51 మండలాలను మిగతా 7లో

అప్పు కోసం తిరుగుతున్నాను



పెట్టుబడుల కోసం నేను రెండు తులాల బంగారాన్ని తాకట్టు పెట్టి పాలకొండలోని యూనియన్ బ్యాంకు నుంచి రూ.94 వేలు అప్పు తీసుకున్నాను. వడ్డీ రూ.7,200 అయిందని, అసలు, వడ్డీ కలిపి రూ.1,01,000 కట్టమన్నారు. రుణం రెన్యువల్ కోసం బ్యాంకుకు వెళ్తే అసలుతో పాటు వడ్డీ సొమ్ము కూడా కట్టాలని చెప్తున్నారు. ఇప్పటికిప్పుడు అంత మొత్తంలో డబ్బులు లేకపోవడంతో అప్పు కోసం తిరుగుతున్నాను.

-పెంకి రమణ, అల్లెన (శ్రీకాకుళం జిల్లా)



బొలేరో వాహనం బోల్తా

- నంద్యాల జిల్లా ఆత్మకూరులో నలుగురు మృతి
- 15 మందికి తీవ్ర గాయాలు

3

ప్రపంచస్థాయి నగరంగా అమరావతి

- ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తాం
- ఉగ్రదాడి విషయంలో కేంద్ర నిర్ణయాలకు సంపూర్ణ మద్దతు
- రాజధాని పనుల పున:ప్రారంభ సభలో చంద్రబాబు



సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



హాజరైన జనం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రపంచ స్థాయి నగరంగా అమరావతిని నిర్మించి, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రాజధాని పనుల పున:ప్రారంభం సందర్భంగా వెలగపూడిలో శుక్రవారం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అమరావతి కేవలం రాజధాని మాత్రమే కాదని, ఐదుకోట్ల ఆంధ్ర ప్రజల సెంటిమెంటు, ఆత్మగౌరవానికి, విశ్వాసానికి, ఆశలకు, ఆకాంక్షలకు ప్రతీకని చెప్పారు. రాజధాని పనులను పున:ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ చేతే మూడు సంవత్సరాల తరువాత అమరావతి నగరాన్ని ప్రారంభింపచేస్తామని అన్నారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా రైతులు 34 వేల ఎకరాల భూమిని రాజధాని కోసం స్వచ్ఛందంగా ఇచ్చారని చెప్పారు. తమ తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రాజధానిని ధ్వంసం చేసిందన్నారు. ఆ ప్రభుత్వ వైఖరికి నిరసనగా రైతులు, మహిళలు తిరుగులేని పోరాటం చేశారని చెప్పారు. 2024 ఎన్నికల్లో మళ్లీ అమరావతి ఊపిరి పోసుకుందని, 10 నెలల్లో కేంద్ర సాయంతో, మోడీ ఆశీస్సులతో రాజధానిని తిరిగి పట్టాలెక్కించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిపౌరుడు అమరావతి నా రాజధాని అని చెప్పుకునేలా చేస్తామని పేర్కొన్నారు. 30 శాతం పచ్చదనంతో, జలవనరులతో ఆధునిక రాజధానిని తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ప్రపంచస్థాయి సంస్థలతో హెల్త్, ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని చెప్పారు. ప్రధాని మోడీ చేసిన సూచన మేరకు జపాన్ మియావాకీ తరహా పచ్చదనం పెంచే విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. రాజధానితోపాటు 26 జిల్లాలనూ అభివృద్ధి చేస్తామని వివరించారు.

ఊపిరిపోసుకుంటున్నాం....

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, కేంద్రం నుండి అందుతున్న సహాయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ' వెంటిలేటర్ మీద నుండి బయటపడ్డాం. ఆక్సిజన్‌తో ఇప్పుడిప్పుడే ఊపిరిపోసుకుంటున్నాం.' అని ఆయన చెప్పారు. ఇదే సహకారం కొనసాగితే అమరావతి రాజధానిని ప్రపంచస్థాయి నగరంగా తయారు చేస్తామని అన్నారు. కేంద్రం సహకారంతో 2027 నాటికి పోలవరం పూర్తి చేస్తామని, నాలెడ్జ్, ఫైనాన్షియల్ సిటీగా విశాఖపట్నాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. విశాఖ స్టీలును నిలబెట్టేందుకు రూ.11 వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించారని, గూగుల్, టిసిఎస్ వంటి ఐటి కంపెనీలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చడంతోపాటు, డిఫెన్స్ సంస్థలు ఏర్పాటవుతున్నాయని, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని, దీనికోసం కేంద్ర మద్దతు కోరుతున్నామని పేర్కొన్నారు. రామాయపట్నం బిపిసిఎస్ రిఫైనరీ, ఆధ్యాత్మిక కేంద్రంగా తిరుపతి ఉంటుందని తెలిపారు. రాయలసీమలో కొత్తగా ఏర్పాటు చేసే ప్రాజెక్టులను కూడా ప్రధాని మొదలుపెట్టాలని కోరారు. శుక్రవారం ఒక్కరోజే 57,962 కోట్ల విలువైన పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసినట్లు వెల్లడించారు.

ప్రధాని కళ్లలో ఆవేదన కనపడింది

మోడీని తాను ఎప్పుడు కలిసినా ఆప్యాయంగా గడిపేవారని, పెహల్గాం ఉగ్రదాడి అనంతరం గంభీరంగా కనబడ్డారని తెలిపారు. తొలిసారి ఆయనలో బాధ చూశానని పేర్కొన్నారు. మన దేశ ప్రజలు ప్రాణాలు కోల్పోయారనే ఆవేదన కనబడిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉగ్రవాదాన్ని అణచివేయడానికి ప్రధాని మోడీ, కేంద్రం తీసుకునే చర్యలకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. అనంతరం కొద్దిసేపు హిందీలో మాట్లాడిన చంద్రబాబు వందేమాతరం, భారత్‌మాతాకీ జై అంటూ ప్రసంగాన్ని ముగించారు.



ప్రధాని మోడికి జ్ఞాపికను అందజేస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్



ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి స్వాగతం పలుకుతున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్

ఘన స్వాగతం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఘనస్వాగతం లభించింది.

వెలగపూడిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రధానికి స్వాగతం పలికారు. సభావేదిక వద్ద మంత్రులు నారా లోకేష్, సత్యకుమార్, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అంతకుముందు గన్నవరం ఎయిర్‌పోర్టులో పలువురు అధికారులు, ఎమ్మెల్సీలు, ఎంపిలు స్వాగతం పలికారు. సభ అనంతరం గన్నవరం విమానాశ్రయంలో సిఎం చంద్రబాబునాయుడు, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఫైర్ సర్వీసెస్ డిజి అంజనీకుమార్ తదితరులు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

మోడీ మాటలు మోసపూరితం

- వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రధాన మంత్రి నరేంద్రమోడీ రాష్ట్రప్రజలను మరోసారి మాటలతో మోసం చేశారని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శించారు. రాజధాని పనుల పున:ప్రారంభం సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగం ముగిసిన అనంతరం శుక్రవారం సాయంత్రం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధాని చేసిన ప్రసంగం రాష్ట్రాభివృద్ధిపై ఏమాత్రం విశ్వాసం కలిగించేదిగా లేదని ఈ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. పదేళ్లల్లో అమరావతి నిర్మాణానికి సహకరించానని చెప్పడం ఎంతటి దగానో ప్రజలందరికీ తెలుసన్నారు. అమరావతిలో కేంద్రప్రభుత్వ కార్యాలయం ఒక్కదానిని కూడా నిర్మించలేదని విమర్శించారు. పదేళ్లల్లో పూర్తికాని అమరావతి నిర్మాణం మూడు సంవత్సరాల్లో పూర్తిచేయాలంటే కేంద్రం ఎంత నిధులు ఇస్తుందో చెప్పలేదని వెల్లడించారు.రాష్ట్రంలో రూ.60వేల కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశానని చెప్పిన ప్రధాని రాజధాని నిర్మాణానికి ఎంత ఇస్తున్నారో తెలపలేదన్నారు. అప్పులు తెచ్చి రాజధాని నిర్మిస్తే ఆ భారం తిరిగి ప్రజలపైనే పడుతుందని ఆందోళనను ఆయన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి మనకు హక్కుగా రావాల్సిన నిధుల్ని రాబట్టడానికి రాష్ట్రప్రభుత్వం అఖిలపక్షం వేయాలని కోరారు.

నిధుల్ని కేంద్రం నుంచి రాబట్టాలి

అంతకుముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు శుక్రవారం ఉదయం రాసిన లేఖలో రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధుల్ని కేంద్రప్రభుత్వం నుంచి రాబట్టాలని వి శ్రీనివాసరావు సూచించారు. అమరావతి పున:నిర్మాణ ప్రారంభ కార్యక్రమానికి హాజరు కావాలంటూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన ఆహ్వానంపై ఈ లేఖలో స్పందించిన ఆయన రాజధాని నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేస్తారన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. అవసరమైన నిధుల్ని కేంద్రప్రభుత్వం నుంచి రాబట్టాలని, దానికి అవసరమైన సహకారాన్ని తమ పార్టీ అందిస్తుందని తెలిపారు. రాష్ట్రరాజధాని మరోసారి వివాదం కాకుండా చట్టాన్ని తీసుకొచ్చే అంశాన్ని పరిశీలించాలని కోరారు.

అమరావతి ప్రజల విజయం : పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



వైసిపి ప్రభుత్వం రాజధానికి చేసిన అన్యాయంపై సాగించిన ధర్మయుద్ధంలో అమరావతి ప్రజలు విజయం సాధించారని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. 'పోరాటం సాగించిన మహిళలకు రైతులకు శిరస్సువంచి నమస్కరిస్తున్నా' అని చెప్పారు. రాజధాని రైతులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ప్రజలు అంత త్యాగం చేశారు కాబట్టే, కాశ్మీర్ ఉగ్రదాడి నేపథ్యంలో ఎంతో బాధతో ఉండి కూడా ప్రధానమంత్రి నరేంద్రమోడీ అమరావతికి వచ్చారని చెప్పారు.

గత ప్రభుత్వం అమరావతిని అంథకారం చేసిందని, గత ఐదేళ్లలో అమరావతి రైతులు ఎంతో నలిగిపోయారని అన్నారు. వారి త్యాగాలకు జవాబుదారీగా ఉంటామని తెలిపారు. ప్రపంచస్థాయిలో తొలి ఐదు నగరాల్లో అమరావతి ఉంటుందన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం భూములిచ్చిన రైతులను మర్చిపోలేమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులు ఉద్యోగాల కోసం బెంగుళూరు, హైదరాబాద్ వలస వెళ్లాల్సిన పని ఉండదని అన్నారు.

అమరావతి అన్‌స్టాపబుల్ : నారా లోకేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



అమరావతి ఇక అన్‌స్టాపబుల్‌గా జెట్ స్పీడ్‌తో ముందుకు పోతుందని రాష్ట్ర మంత్రి లోకేష్ అన్నారు. రాజధాని నిర్మించాలని కోరిన మహిళలు, రైతులపై వైసిపి పాలకులు కేసులు పెట్టి వేధించారని తెలిపారు. ఈ పోరాటంలో 270 మంది రైతులు చనిపోయారని, ఎన్ని కుట్రలు చేసినా అమరావతిని ఆపలేకపోయారని తెలిపారు. 'పీకిపారేయడానికి అమరావతి పెరటి మొక్క కాదు' అని అన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళతామని తెలిపారు.కులగణన చేయాలని కేంద్రం తీసుకున్న నిర్ణయం ఒక సంచలనమని లోకేష్ అన్నారు. ఇతరులు దశాబ్దాలుగా సంకోచించిన అంశంపై మోడీ ధైర్యంగా నిర్ణయం తీసుకున్నారు. అణగారిన వర్గాలకు సాధికారత కల్పించాలనే నిబద్ధతకు లోబడి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని వివరించారు. కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ప్రస్తావిస్తూ పాకిస్తాన్ గీత దాటిందని, ఆమాయకులను చంపి పెద్ద తప్పు చేసిందని లోకేష్ తెలిపారు. పహల్గాం దాడిలో చనిపోయిన వారికి నివాళులర్పించారు.

ప్రపంచ అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా... : నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రపంచంలో టాప్ 5 అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా అమరావతిని నిలుపుతామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ అన్నారు. అమరావతి పున:ప్రారంభం సభలో మంత్రి స్వాగతోపన్యాసం చేసిన ఆయన పదేళ్ల క్రితం మోడీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసుకన్నామని, మరలా ఆయన చేతులమీదుగానే పున: ప్రారంభం జరుగుతోందని అన్నారు.

రాజధాని నిర్మాణం కోసం రైతులు చేసిన త్యాగం వెలకట్టలేనిదని తెలిపారు. గత ప్రభుత్వ నిర్వాకంతో గడిచిన ఐదేళ్లలో రాజధాని నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రధాని మోడీ ఆశీస్సులతో చంద్రబాబు సారథ్యంలో అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని పేర్కొన్నారు.



సభలో ప్రదర్శించిన అమరావతి ఊహాచిత్రం

మళ్లీ నిరాశే...!

అమరావతిపై ప్రధాని నోట నాటి మాటలే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని పనులు పున:ప్రారంభం విషయంలో ప్రధాని స్పష్టమైన హామీ ఇస్తారని, ఆర్థికపరమైన అంశాల్లో స్పష్టత ఇస్తారని, ముఖ్యంగా రాజధానికి చట్టబద్ధత కల్పించే అంశంపై స్పందిస్తారని ఆశగా ఎదురుచూసిన అమరావతి ప్రజానీకానికి మళ్లీ నిరాశే ఎదురైంది. రాజధాని పనుల పున:ప్రారంభం సందర్భంగా ప్రధాని చేసిన ప్రసంగంలో ఎక్కడా ఎటువంటి హామీ ఇవ్వలేదు. సంపూర్ణ సహకారం ఇస్తామంటూ 2015 అక్టోబర్లో జరిగిన శంకుస్థాపన సభ సమయంలో చెప్పిన మాటలనే మరలా చెప్పారు. అప్పటి సభలో రాజధాని నిర్మాణానికి సహకరిస్తామని, అందరం కలిసి పని చేద్దామని మోడీ తెలిపారు. దాదాపుగా అవే మాటలను తాజా సభలోనూ ప్రస్తావించారు. ఆర్థిక అంశాల్లో స్పష్టమైన హామీ ఇవ్వలేదు. అమరావతి రైతులు కూడా ఏదైనా హామీ ఇస్తారేమోననే ఆశతో సభకు వచ్చారు. ప్రసంగం ఆద్యంతం ఏదో చెబుతారని ఎదురుచూసిన రైతులకు నిరాశే మిగిలింది. ఆర్థికపరమైన ఒక్క విషయంలోనూ స్పష్టత ఇవ్వలేదు.ప్రస్తుతం అమరావతికి ప్రపంచ బ్యాంకు నుండి రూ.15 వేలకోట్లు, హడ్కో నుండి రూ.11 వేల కోట్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. వీటిల్లో ప్రపంచ బ్యాంకు, ఎడిబి నుండి రుణం తీసుకునేందుకు కేంద్రం సహకరించింది. విభజన చట్టం ప్రకారం అమరావతి నిర్మాణ బాధ్యత కేంద్రమే తీసుకోవాలి. కానీ ఇప్పటి వరకూ అలా చేయలేదు.

పరస్పరం పొగడ్తలు

మరోవైపు ప్రధాని మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరస్పరం పొగుడుకోవడం సభకు వచ్చిన వారిలో చర్చకు దారి తీసింది. చంద్రబాబు నుండి తాను ఐటి అంశాలపై అనేక విషయాలు తెలుసుకున్నానని ప్రధాని చెప్పగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క శక్తిమంతమైన నాయకుడి చేతిలో దేశం అన్ని రంగాల్లోనూ ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. పెహల్గాం దాడి విషయాన్ని ప్రస్తావించిన చంద్రబాబు, ఆ తరువాత మోడీపై పొగడ్తల వర్షం కురిపించారు. అయితే, , నిధులు ఇవ్వాలని గానీ, ఆర్థిక ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో రుణాన్ని కేంద్రమే భరించాలని గానీ ఎక్కడా ప్రస్తావించలేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం సహకారం కావాలన్న విషయాన్ని మాత్రం ఆయన ప్రస్తావించారు. ఇవే ఆంశాలను రాజధాని రైతులు పలువురు సోషియల్ మీడియా ఖాతాల్లో ప్రస్తావించడం విశేషం.

రైతుల భూములు డొల్ల కంపెనీలకు కట్టబెట్టడమే అభివృద్ధా?

- ఆమ్ ఆద్మీ జోన్-సి కో-ఆర్డినేటర్ ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అభివృద్ధి అంటే రైతుల భూములు డొల్ల కంపెనీలకు కట్టబెట్టడమేనా? అని ఆమ్ ఆద్మీ పార్టీ జోన్-సి కో-ఆర్డినేటర్ నేతి ఉమామహేశ్వరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం ఉండాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రామాయపట్నం పోర్టుకు సమీపంలోని రైతుల భూములను ఇండోసోల్ సంస్థలకు కట్టబెట్టేందుకు భూసేకరణ చేయడాన్ని తప్పుబట్టారు. సోలార్ ప్రాజెక్టు పంటలు పండని వర్షాభావం ఉన్న ప్రాంతాల్లో పెట్టాలే తప్ప మూడు పంటలు పండే కారేడు గ్రామంలో ఏర్పాటు చేయడానికి కారణం వెల్లడించాలని కోరారు. అమరావతి రైతులకు భూ సమీకరణ అమలు చేస్తూ, వెనుకబడిన ప్రకాశం జిల్లా రైతులకు బలవంతపు భూసేకరణ అమలు చేయడమేమిటని ప్రశ్నించారు. రూ.లక్షలు పెట్టుబడితో ప్రారంభించిన సంస్థలకు రూ.వేల కోట్ల భూములను ఎలా కేటాయిస్తారన్నారు. జగన్‌కు సంబంధించిన సంస్థలకు ఇచ్చిన భూములను వెనక్కి తీసుకుని రైతులకు ఇవ్వాల్సింది పోయి, ఆ సంస్థ కోసం మరింత భూమిని సేకరించి ఇవ్వడం దుర్మార్గమన్నారు.

జనవరి 1న క్వాంటమ్ వ్యాలీ

- ఐబిఎం, టిసిఎస్, ఎల్‌అండ్‌టితో ప్రభుత్వం ఎంఒయు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వచ్చే ఏడాది జనవరి ఒకటిన అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి ఉండవల్లిలోని సిఎం చంద్రబాబు నివాసంలో శుక్రవారం ఐబిఎం, టిసిఎస్, ఎల్‌అండ్‌టితో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 1990లో దేశంలో ఐటి విప్లవానికి రాష్ట్రం కీలకంగా నిలిచిందని, నేడు దేశంలో క్వాంటమ్ విప్లవానికి కూడా మన రాష్ట్రమే నాయకత్వం వహిస్తుందన్నారు. ఐబిఎం, టిసిఎస్, ఎల్‌అండ్‌టితో జరిగిన ఒప్పందం మన రాష్ట్రానికే కాదు, దేశానికి కూడా చారిత్రక అవసరమన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ భవిష్యత్తు పాలనకు, ఆవిష్కరణకు పునాది అవుతుందన్నారు. సాంకేతిక రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి కొత్త అవకాశాలు వస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకోవడం ముఖ్యమని సిఎం చంద్రబాబు అన్నారు. భవిష్యత్తు అవసరాలన్నీ క్వాంటమ్ కంప్యూటింగ్‌పైనే ఆధారపడి ఉంటాయని, అందుకే అమరావతిని క్వాంటమ్ వ్యాలీ చేయాలనుకున్నట్లు సిఎం తెలిపారు. సిలికాన్ వ్యాలీ తరహాలో క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దాలని ఐబిఎం, టిసిఎస్ సంస్థల ప్రతినిధులకు సిఎం సూచించారు. హైటెక్ సిటీని 15 నెలల్లో నిర్మించిన అనుభవాన్ని ఆయన గుర్తు చేస్తూ క్వాంటమ్ వ్యాలీ తక్కువ సమయంలోనే నిర్మించవచ్చన్నారు. ఇప్పటికే ఎల్‌అండ్‌టికి స్థలాన్ని కేటాయించామని, మౌలిక వసతులను అత్యంత వేగంగా అభివృద్ధి చేయాలని అధికారులకు సిఎం ఆదేశించారు. ఇందుకోసం రెండు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి త్వరలోనే ఈ ప్రాజెక్టు గురించి పూర్తి స్థాయిలో వివరంగా తెలపనున్నట్లు పేర్కొన్నారు.

ఐబిఎం క్వాంటమ్ వైస్ ప్రెసిడెంట్ జె గాంబెట్టా మాట్లాడుతూ.. దేశంలో ఐబిఎం క్వాంటమ్ సిస్టం-2 స్థాపన, దేశ క్వాంటమ్ ప్రయాణానికి కీలక మలుపు కానుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, టిసిఎస్‌తో కలిసి పనిచేయడంతో క్వాంటమ్ అల్గోరిథం అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. క్వాంటం కంప్యూటింగ్ అనేది రెండో క్వాంటమ్ విప్లవమని, ఇవి బ్యాటరీల నుంచి ఆర్థిక వ్యవస్థ వరకు ఉపయోగాలు విస్తృతంగా ఉంటాయని ఐబిఎం వైస్ ప్రెసిడెంట్ స్కాట్‌క్రౌడర్ అన్నారు. తాజా ఒప్పందంతో అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుకు తొలి అడుగు పడినట్లయ్యిందన్నారు. టిసిఎస్ సిటిఒ హారిక్‌విన్ మాట్లాడుతూ.. క్వాంటమ్, క్లాసికల్ సిస్టమ్‌లను కలిపిన హైబ్రీడ్ కంప్యూటింగ్ ద్వారా జీవశాస్త్రం, మెటీరియల్స్, క్రిప్టోగ్రఫీ వంటి రంగాల్లో విప్లవాత్మక ఫలితాలు సాధించవచ్చని, ఇది ఒక కీలక ఘట్టమన్నారు. కాయిన్ నెట్‌వర్క్ ద్వారా 17 రాష్ట్రాల్లో 43 కేంద్రాలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరుతుందన్నారు.

పలు సవరణలతో జిఓ 139 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేవాదాయశాఖకు చెందిన వ్యవసాయ భూములు, స్థిరాస్తులు, లీజులు, లైసెన్సులు నియామకాలు-2003కు సవరణలు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం జిఓ ఎంఎస్ నెంబరు 139ని విడుదల చేసింది. 20 ఏళ్ల ఏ సంస్థ, సేవా ట్రస్టులు ఆయా ఆలయాలకు సేవలందిస్తున్నట్లు గుర్తిస్తే ఆయా సంస్థలకు భూములు వేలం పాట ద్వారా కాకుండా ప్రభుత్వం నేరుగా లీజుకు ఇచ్చే అవకాశం ఈ సవరణ ద్వారా కలుగుతుంది.

ఇప్పటి వరకు మూడేళ్ల పాటు దేవాదాయశాఖ తమ ఆస్తులను లీజుకు ఇచ్చే అవకాశం ఉండేది. ప్రభుత్వం ప్రస్తుతం తీసుకొచ్చిన సవరణ ద్వారా 20 ఏళ్ల సేవ పేరుతో ఆయా ఆస్తులను వేలం పాట ద్వారా కాకుండా, నేరుగా లీజుకు ఇవ్వనుంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

నిర్లక్ష్యం.. అంతటా వైఫల్యం

- 'సింహాచలం' ఘటనపై త్రిసభ్య కమిటీ విచారణ పూర్తి
- ఆగమ శాస్త్ర పండితులను విచారించిన కమిటీ
- నివేదికతో అమరావతికి పయనం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్నస్వామి చందనోత్సవంలో రూ.300 క్యూ లైన్‌పై గత నెల 30న గోడ కూలి ఏడుగురు మృత్యువాత పడిన విషయంపై ప్రభుత్వం వేసిన త్రిసభ్య కమిటీ విచారణ శుక్రవారంతో పూర్తయింది. త్రిసభ్య కమిటీకి నేతృత్వం వహిస్తున్న మున్సిపల్ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, సభ్యులు రాష్ట్ర ఈగల్ విభాగాధిపతి ఐజి ఆకె రవికృష్ణ, రాష్ట్ర జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీరు ఎం.వెంకటేశ్వరరావు నివేదికను సిద్ధం చేసుకుని అమరావతికి బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. వారు శుక్రవారం సింహాచలం కొండపైగల ఆగమ శాస్త్ర పండితులను పలు విషయాలపై ప్రశ్నించారు. 'అంతా నోటిమాట... పనుల్లో హడావుడి' తప్ప మాస్టర్ ప్లాన్‌ను ఏ మాత్రమూ అమలు చేయడానికి ఇంజనీరింగ్ అధికారులు ప్రయత్నించలేదని స్పష్టంగా విచారణలో తేలింది. ముఖ్యంగా గోడ నిర్మాణానికి ఎలాంటి అనుమతులూ లేవనికమిటీ దృష్టికి పండితులు, యాత్రికులు తెచ్చారు. ఈ పనులన్నీ 2024 మేలోనే పూర్తి కావాల్సి ఉండగా జాప్యం జరిగిందని తెలిసింది. పూర్తి నివేదికను ప్రభుత్వానికి ఇచ్చే ముందు భవిష్యత్తులో ఇలాంటి ఘోర ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నివేదికలో పలు విషయాలను పొందుపరచనున్నారు.

రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా విచారణ జరపాలి : సిపిఎం

రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా.. నిష్పక్షపాతంగా విచారణ జరపాలని త్రిసభ్య కమిటీని సిపిఎం కోరింది. ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ చైర్మన్‌కు ఈ మేరకు విశాఖలోని సర్క్యూట్ హౌస్‌లో ఆ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చందనోత్సవ నిర్వహణ, ఏర్పాట్ల పరిశీలనకు మంత్రుల కమిటీని నియమించిందని, ఆ మంత్రుల కమిటీ తగిన పర్యవేక్షణ, నూతన నిర్మాణాల తనిఖీలు, కట్టుదిట్టమైన ఏర్పాట్లు, అన్నిరకాల భద్రతా చర్యలు తీసుకొని ఉన్నట్లయితే ఈ దుర్ఘటన జరిగుండేది కాదని తెలిపారు. చందనోత్సవానికి కేవలం కొన్ని రోజులకు ముందు అతిపెద్ద గోడ నిర్మాణం చేయడం, అదికూడా తగిన ప్లాన్ లేకుండా కాంక్రీట్ పునాది, పిల్లర్లు వేయకుండా చేపట్టడం, నాసిరకమైన మెటీరియల్ వాడడం తదితర కారణాలతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని కమిటీకి తెలియజేశారు.

పెద్దఎత్తున అవినీతి జరిగిందనేది స్పష్టంగా తెలుస్తోందన్నారు. దీనికి కాంట్రాక్టర్‌తోపాటు ఇంజనీర్లు, దేవాలయ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీ బాధ్యతా రాహిత్యమూ ప్రమాదానికి ముఖ్య కారణమని తెలిపారు. అందువల్ల వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చందనోత్సవం ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు సమీక్ష చేయడంలో విఫలమైందన్నారు.

ఘటనలో చనిపోయిన వారికి ఒక్కొక్కరికీ రూ.కోటి పరిహారం చెల్లించాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.మణి, బి.జగన్, సీనియర్ నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు ఉన్నారు.



భారీ ఎత్తున ఎగిసి పడుతున్న అగ్నికీలలు

రాజధానిలో భారీ అగ్నిప్రమాదం

ప్రజాశక్తి- తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని అమరావతిలో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ప్రధాని మోడీ రాజధాని నిర్మాణ పనుల ప్రారంభానికి వచ్చిన సమయంలో ఈ సంఘటన జరగడంతో అధికారులు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. మందడం టిడ్కో గృహ సముదాయాలకు ఉత్తరం వైపు సీడ్ యాక్సెస్ రహదారికి సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఎల్ అండ్ టి సంస్థకు చెందిన పైపులు దగ్ధమయ్యాయి. రాజధాని నిర్మాణానికి వినియోగించే నిమిత్తం ఈ పైపులైన్లను ఇక్కడ నిల్వ ఉంచారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీస్, రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డిఎస్‌పి మురళీకృష్ణ, తహశీల్దార్ సుజాత ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది 11 ఫైర్ ఇంజన్లతో మంటలను ఆర్పివేశారు. అగ్ని ప్రమాదానికి కారణాలపై విచారణ చేపట్టారు. నిజంగా అగ్నిప్రమాదమేనా?. లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తగులబెట్టాం? అనే కోణంలోనూ విచారిస్తున్నారు. అగ్నిప్రమాదం జరిగిన స్థలం ప్రధాని మోడీ సభా వేదికకు సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంది.

ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

- 'సెట్స్' విద్యార్థులకు ఉన్నత విద్యామండలి ఆదేశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సెట్స్)కు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష సమయం దాటి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించబోమని ఉన్నత విద్యామండలి వెల్లడించింది. ఈ నెల 6న ఇసెట్, 7న ఐసెట్, 19 నుంచి 27 వరకు ఇఏపిసెట్ జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని మార్గదర్శకాలను ఉన్నత విద్యామండలి కార్యదర్శి టివి కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటన ద్వారా విడుదల చేశారు. విద్యార్థులు మెహిందీ పెట్టుకోవద్దని, ఇంక్ వంటి మరకలను కూడా ఉంచుకోవద్దని తెలిపారు. దీనివల్ల పరీక్ష రాసే సమయంలో, బయోమెట్రిక్ వేసే సమయంలో ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు, ఒరిజినల్ గుర్తింపు కార్డు ఉంటేనే అనుమతి ఉంటుందని వెల్లడించారు. బ్లాక్/బ్లూ బాల్ పాయింట్ పెన్ వెంటతెచ్చుకోవాలని సూచించారు.

కనీస వేతనం చెల్లించాలి

- ప్రమాదబీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి
- రాష్ట్ర వ్యాప్తంగా తల్లీ బిడ్డ సంరక్షణ డ్రైవర్ల ఆందోళన



కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న తల్లీ బిడ్డల సంరక్షణ డ్రైవర్లు

ప్రజాశక్తి-యంత్రాంగం

తల్లీ బిడ్డల సంరక్షణ డ్రైవర్లు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగారు. తల్లీబిడ్డల సంరక్షణ కోసం నిరంతరాయంగా శ్రమిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ (102) ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన ధర్నా చేశారు. బకాయి వేతనాలు ఇవ్వాలని, వాహనాలను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, ప్రమాదబీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, ఇఎస్‌ఐ, పిఎఫ్ వాటా యాజమాన్యం చెల్లించాలని నినదించారు. వీక్లీ ఆఫ్‌లు, పండగలు, జాతీయ సెలవులు అమలు చేయాలని కోరారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందించారు.

కర్నూలు కలెక్టరేట్ వద్ద ధర్నాలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర సలహాదారుడు శ్రీనివాసులు మాట్లాడుతూ.. గర్భిణి, బాలింతల ఇంట్లో వెలుగులు నింపే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది కంట కన్నీళ్లే మిగులుతున్నాయన్నారు. అరబిందో యాజమాన్యం వాహన డ్రైవర్లకు వేతనం రూ.8,800 మాత్రమే చెల్లిస్తోందని, యాజమాన్యం వాటాగా చెల్లించాల్సిన పిఎఫ్ డబ్బులను సైతనం ఉద్యోగుల దగ్గర నుండే వసూలు చేస్తోందని తెలిపారు. చాలీచాలని జీతంతో కుటుంబాన్ని పోషించలేక ఆర్థిక ఇబ్బందులతో అల్లాడిపోతున్నారని వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని కోరారు. కడప కలెక్టరేట్ వద్ద ధర్నాలో ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 500 మంది తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కింద పని చేస్తున్నారని తెలిపారు. వీరంతా ప్రస్తుతం అరబిందో (ఎఇఎంఎస్) సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్య శాఖకు సేవలందిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విశాఖ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు నిర్వహించారు. అనంతరం ఆయా జిల్లాల్లో కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేశారు. తల్లీబిడ్డల సంరక్షణ కోసం నిరంతరాయంగా శ్రమిస్తున్న తమకు మాత్రం సంరక్షణ లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాలలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి జెసికి వినతిపత్రం అందించారు.

పిడుగుపాటుకు రైతు మృతి

ప్రజాశక్తి- యర్రావారిపాలెం



తిరుపతి జిల్లా యర్రావారిపాలెం మండలంలో పిడుగుపాటుకు బోడేవాండ్లపల్లి పంచాయతీ వడ్డిపల్లికి చెందిన రైతు కోటకొండ రమణ (55) శుక్రవారం మృతి చెందారు. ఆయన పొలంలో పనిచేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. రమణ భార్య గతంలోనే మృతి చెందారు. ఆయనకు ఒక కుమార్తె ఉన్నారు. రమణ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

పెండింగ్‌లో 22 లక్షల ఆధార్ అప్‌డేట్స్

- గ్రామ,వార్డు సచివాలయాల శాఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 22 లక్షల ఆధార్ అప్‌డేట్స్ పెండింగ్‌లో ఉన్నాయని, బయోమెట్రిక్ పెండింగ్‌లో ఉన్న వారందరూ తమ శాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక శిబిరాల్లో తమ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాలశాఖ పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం, పిల్లలు 5, 15 ఏళ్ల వయసులో వారి బయోమెట్రిక్ డేటాను అప్‌డేట్ చేయడం తప్పనిసరి అని పేర్కొంది. అప్‌డేట్ కోసం 5 నుంచి 7 ఏళ్ల మధ్య ఒకసారి చేస్తే ఉచితమని, 15 నుంచి 17 ఏళ్ల మధ్య అప్‌డేట్ ఒకసారి చేస్తే ఉచితమని, 17 ఏళ్ల పైబడిన పిల్లలుంటే రూ.100 చెల్లించి అప్‌డేట్ చేసుకోవాలని పేర్కొంది.

'బర్డ్' డైరెక్టర్‌గా డాక్టర్ జి జగదీశ్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న బర్డ్ ఆస్పత్రి డైరెక్టర్‌గా ప్రముఖ ఆర్థోపెడిషన్ డాక్టర్ జి జగదీష్ మరోసారి నియమితులయ్యారు. ఈ మేరకు టిటిడి ఇఒ శ్యామలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జగదీష్ డైరెక్టర్‌గా పనిచేసి బర్డ్ ఆస్పత్రికి జాతీయ స్థాయి గుర్తింపు తీసుకొచ్చారు. దీంతో దేశ నలుమూలల నుంచి ఆర్థో వైద్యసేవల కోసం రోగులు బర్డ్‌కు వచ్చి చికిత్సలు పొందేవారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బర్డ్ ఆస్పత్రి అభివృద్ధి కోసం డాక్టర్ జగదీష్‌ను మళ్లీ తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. ఈ నేపథ్యంలో ఆయనకు మరోసారి డైరెక్టర్ పదవి వరించింది. త్వరలోనే ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

'క్యూఆర్' కోడ్‌తో అభిప్రాయ సేకరణ

- నూతన విధానాన్ని ప్రవేశపెట్టిన టిటిడి

ప్రజాశక్తి- తిరుమల

యాత్రికులకు మెరుగైన సేవలందించేందుకు టిటిడి ఓ కొత్త ఫీడ్‌బ్యాక్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇకపై యాత్రకులు తమ అభిప్రాయాన్ని వాట్సాప్ ద్వారా సులభంగా తెలియజేయవచ్చు. తిరుమల, తిరుపతిలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌లను మొబైల్‌తో స్కాన్ చేస్తే వాట్సాప్‌లో టిటిడి అభిప్రాయ సేకరణ పేజీ ఓపెన్ అవుతుంది. ఇక్కడ యాత్రికులు తమ పేరు, విభాగాన్ని (అన్నప్రసాదం, శుభ్రత, కల్యాణకట్ట, లడ్డూ ప్రసాదం, లగేజీ, దర్శన అనుభవం, క్యూలైన్, గదులు మొదలైనవి) ఎంచుకోవాలి. అనంతరం అభిప్రాయం తెలిపేందుకు టెక్స్ట్ లేదా వీడియో ఫార్మేట్‌ను ఎంచుకోవచ్చు. సేవా ప్రమాణాన్ని ఉత్తమం, సగటు/మరింత మెరుగుదల అవసరం, లేదా బాగాలేదుగా గుర్తించాల్సి ఉంటుంది. యాత్రికులు తమ అభిప్రాయాన్ని గరిష్టంగా 600 అక్షరాల పరిమితిలో టైప్ చేయవచ్చు. లేదా వీడియోగా అప్‌లోడ్ చేయవచ్చు. అభిప్రాయం సమర్పించిన వెంటనే, 'మీ అభిప్రాయం విజయవంతంగా నమోదు చేయబడింది. మీ విలువైన ఫీడ్‌బ్యాక్‌కు ధన్యవాదాలు"అనే ధ్రువీకరణ సందేశం వస్తుంది. ఈ విధానం శుక్రవారం నుంచి అమలులోకి వచ్చిందని, యాత్రికుల నుండి అందిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సేవల ప్రమాణాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని టిటిడి పేర్కొంది.

ఆర్‌టిసి ఎమ్‌డికి సమ్మె నోటీసు అందజేత

- ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జాతీయ సమ్మెలో భాగంగా ఈ నెల 20న రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలో తాము పాల్గొంటున్నట్లు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) ప్రకటించింది. కార్యాచరణలో భాగంగా శుక్రవారం ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు ఎస్‌డబ్ల్యుఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎం అయ్యప్పరెడ్డి సమ్మె నోటీస్‌ను అందజేశారు. దేశంలోని రవాణారంగ కార్మికులు, ఎస్‌టియుల ఉద్యోగ కార్మికులు పాల్గొనాలని జాతీయ రోడ్డు రవాణా కార్మికుల కో-ఆర్డినేషన్ కమిటీ నిర్ణయించి పిలుపునిచ్చాయన్నారు. సమ్మెకు సంబంధించిన ప్రధాన డిమాండ్లను ఆయన మీడియాకు వివరించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఎలక్ట్రిక్ బస్సుల సేకరణ, ఆపరేషన్ ఆర్‌టిసిలకు కేటాయించాలని, 11వ పిఆర్‌సి కమిషన్ వెంటనే నియమించి, పిఆర్‌సి ప్రక్రియను ప్రారంభించాలని, ఈలోగా 30 శాతం ఇంటీరియమ్ రిలీఫ్ ఇవ్వాలన్నారు. ఆర్‌టిసిలో సహజ న్యాయ సూత్రాలను, న్యాయ ప్రమాణాలను అమలు చేయించాలని, ఉద్యోగ భద్రతకు తోడ్పడే 1/2019 సర్క్యులర్ అమలు కోసం నిర్దిష్ట ఆదేశాలివ్వాలని, ఆర్‌టిసి ఉద్యోగులందరికీ ఒపిఎస్ వర్తింపజేయాలని, సంస్థ ఉద్యోగుల విలీనం పేరుతో రద్దు చేసిన స్టాఫ్ రిటైర్‌మెంట్ బెనిఫిట్ స్కీమ్‌లను పునరుద్ధరించాలని, హయ్యర్ పెన్షన్‌పై సుప్రీంకోర్టు తీర్పును విధిగా అమలు చేయాలన్నారు. ఎపిఎస్‌ఆర్‌టిసిలో ఉన్న విధంగానే కేడర్ స్ట్రెంత్ కొనసాగించాలని, ఇంటి అద్దె అలవెన్స్‌లోని అన్యాయాన్ని సవరించాలన్నారు. రాష్ట్ర, జిల్లా, డిపో స్థాయిల్లో అసోసియేషన్లకు జాయింట్ మీటింగ్‌లు నిర్వహించాలని, గుర్తింపు ఎన్నికలు జరపాలని, ఆర్‌టిసి ఉద్యోగ కార్మికులకు కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసిల చట్టం 1950 ప్రకారం ఆర్‌టిసిలకు మూలధన సహకారాన్ని పునరుద్ధరించాలన్నారు.



అంబేద్కర్ సర్కిల్ ఎదుట సిపిఎం నాయకులు నిరసన

కడప 'ఉక్కు'పై మోడీ ప్రకటన చేయాలి

- సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

అమరావతి పర్యటన సందర్భంగా వెలగపూడికి వస్తోన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణంపై స్పందించాలని సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం కడప జిల్లా అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి ఎ రామ్మోహన్ మాట్లాడుతూ విభజన చట్టంలో స్పష్టంగా కడప ఉక్కు నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్న విషయం గుర్తుంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. అటు కేంద్రంలోనూ, ఇటు రాష్టంలోనూ సంకీర్ణ ప్రభుత్వాలే అధికారంలో కొనసాగుతున్న నేపథ్యంలో కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టడం పెద్ద కష్టమేమీ కాదని తెలిపారు. గతంలో కడప జిల్లా పరిషత్ ఆవరణలో టిడిపి నేతలు ఉక్కు దీక్ష చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాటం చేసిన టిడిపి కూటమి నేతలు అధికారంలోకి వచ్చి ఏడాది గడిస్తున్నా ఇంకా స్పష్టమైన వైఖరి తీసుకోకపోవడం సరైంది కాదన్నారు. రాయలసీమ ప్రాంతంలో నిరుద్యోగం, కరువు విలయతాండవం చేస్తున్న పరిస్థితుల్లో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వివరించారు. ఈ సమస్య పరిష్కారానికి కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం కీలకమైందని పేర్కొన్నారు. ఉక్కు పరిశ్రమ నిర్మాణం వల్ల ప్రత్యక్షంగా 25 వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కడప జిల్లాలో శంకుస్థాపనల ఉక్కు పరిశ్రమ కావాలనుకోవడం లేదని, నిర్మాణం పూర్తి చేసిన ఉక్కు పరిశ్రమ ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రరెడ్డి, కుమారస్వామిరెడ్డి, నారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకట సుబ్బయ్య, హరిచంద్రరెడ్డి, సాంబ శివారెడ్డి, నరసింహ, గోవిందు, తిమ్మయ్య, సరిత, జార్జి, శేఖర్, రసూల్, ఉదయ్, సురేంద్ర పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కార్మికుని మృతి

ప్రజాశక్తి-గంట్యాడ (విజయనగరం జిల్లా)



రామారావును ఆటోలో ఆస్పత్రికి తరలిస్తున్న కూలీలు

ఉపాధి హామీ కార్మికుడు పని ప్రాంతంలో గుండెపోటుతో మృతి చెందిన ఘటన విజయనగరం జిల్లా గంట్యాడ మండలం నరవ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. తోటి వేతనదారులు తెలిపిన వివరాల మేరకు... నరవ గ్రామానికి చెందిన గేదెల రామారావు (64) శుక్రవారం ఉదయం డెంకాడ చెరువులో ఉపాధి హామీ పనికి వెళ్లారు. పని చేస్తున్న సమయంలో అక్కడికక్కడే కుప్ప కూలిపోయారు. తోటి వేతనదారులు హుటాహుటిన ఆటోలో ఆయనను విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఉపాధి హామీ ఎపిఒ సుందరరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రామారావుకు భార్య రామచంద్రమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సమస్య పరిష్కారమయ్యే వరకు తోడుంటాం

- పాలకోడేరు బాధితులకు అఖిలపక్షం భరోసా



కూల్చిన ఇళ్లను పరిశీలిస్తున్న అఖిలపక్షం నేతలు

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

'నిరుపేదలు మనుషులు కాదా.. ఇంత దారుణంగా ఇళ్లు కూల్చేస్తారా.. అడ్డుకుంటే పోలీసులతో నెట్టేస్తారా.. ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. రాచరిక పాలనలో ఉన్నామా' అని ప్రభుత్వాన్ని అఖిలపక్షం ప్రశ్నించింది. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరులోని ఎఎస్‌ఆర్ నగర్‌లో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీల నేతలతోపాటు ప్రజాసంఘాల నేతలతో కూడిన అఖిలపక్షం శుక్రవారం పర్యటించింది. కూలగొట్టిన ఇళ్లను పరిశీలించింది. శిథిలాల మధ్య నివశిస్తున్న బాధితులతో మాట్లాడింది. ఈ సందర్భంగా ఇళ్ల నిర్వాసితులు తమ సమస్యలను అఖిలపక్షం నాయకులకు విన్నివించుకున్నారు. అధైర్య పడొద్దు.. సమస్య పరిష్కారమయ్యే వరకూ తాము తోడుంటామని నిర్వాసితులకు నేతలు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు, సిపిఐ జిల్లా నాయకులు మల్లుల సీతారాం ప్రసాద్, బ్రహ్మం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోర్ర శ్రీనివాస యాదవ్, పుచ్చకాయల రత్నంరాజు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా నాయకులు దండు శ్రీనివాసరాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.పూర్ణ మాట్లాడుతూ.. చట్ట ప్రకారమే పేదల ఇళ్లు తొలగిస్తున్నామని బహిరంగంగా చెబుతున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు మహిళలను మగ పోలీసులతో ఈడ్చేయొచ్చని ఏ చట్టంలో ఉందో చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా జరిగిన నష్టాన్ని గుర్తించి ప్రజలకు ఇళ్లు నిర్మించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష నేతలు ఎఎస్‌ఆర్ నగర్‌లో పర్యటిస్తున్న సందర్భంలో ఎగువ భాగాన ఉన్న రొయ్యల చెరువులో నీటిని మోటార్లతో రాజు కాల్వలోకి వదులుతుండడాన్ని గమనించారు. దీంతో, సంబంధిత చెరువు యజమానులు మోటార్లను ఆపి తనకేమీ తెలియనట్లు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇక్కడ నివాసాలే కాలుష్యానికి కారణమని చెబుతున్న డిప్యూటీ స్పీకర్ బహిరంగంగా కాలువలోకి ఆక్వా చెరువుల నీటిని వదిలేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నాయకులు నిలదీశారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



భారత ఎగుమతుల్లో 6 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత మొత్తం ఎగుమతులు 6.01 శాతం పెరిగి 824.9 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.69 లక్షల కోట్లు)తో ఆల్‌టైం గరిష్ట స్థాయికి చేరాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇంతక్రితం ఏడాదిలో 778.1 బిలియన్ల ఎగుమతులు జరిగాయి. 2024-25లో సర్వీసు ఎగుమతులు 13.6 శాతం పెరిగి 387.5 బిలియన్లుగా నమోదయ్యాయి. పెట్రోలియం యేతర సరుకుల ఎగుమతులు 6 శాతం పెరిగి 374.1 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. కాగా.. 2024-25లో సరుకుల ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉండటంతో 282.82 బిలియన్లకు పెరిగాయి. ఇంతక్రితం ఏడాది ఈ లోటు 241.14 బిలియన్లుగా నమోదయ్యింది.

ఎయిండియాకు పాక్ ఆంక్షల నష్టం

న్యూఢిల్లీ : పాకిస్థాన్ తన గగనతలంపై భారత విమానాల రాకపోకలపై నిషేధం ప్రకటించడంతో భారత్‌కు చెందిన విమానయాన సంస్థలపై భారం పడుతోంది. ఈ క్రమంలోనే టాటా గ్రూపునకు చెందిన ఎయిరిండియా భారీ నష్టాన్ని ఎదుర్కోనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పెహల్‌గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఆందోళన వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. పాక్ తీసుకున్న నిర్ణయంతో ఏడాదికి దాదాపు రూ.5,000 కోట్ల నష్టం వాటిల్లనుందని ఎయిరిండియా అంచనా వేసినట్లు జాతీయ మీడియాలో రిపోర్టులు వస్తోన్నాయి. ఈ నష్టం నుంచి బయటపడేందుకు ప్రభుత్వం రాయితీ ఇవ్వాలని కోరుతూ విమానయాన శాఖకు ఎయిరిండియా యాజమాన్యం లేఖ రాసినట్లు సమాచారం. ఎయిర్ ఇండియా సహా, ఇండిగో, స్పైస్‌జెట్ వంటి విమానయాన సంస్థలు తమకు పరిష్కార మార్గం చూపాలని కోరాయని తెలుస్తోంది.

హార్పిక్‌కు ఇక షారుఖ్ ప్రచారం..



న్యూఢిల్లీ : బాత్‌రూమ్ క్లీనర్ హార్పిక్‌కు ఇకపై బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ ప్రచారం చేయనున్నారు. షారుఖ్‌ను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంచుకున్నట్లు హార్పిక్‌కు చెందిన రెకిట్ సంస్థ వెల్లడించింది. షారుఖ్‌తో జట్టు తమ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని రెకిట్ దక్షిణాసియా మార్కెటింగ్ డైరెక్టర్ గౌతమ్ రిషి పేర్కొన్నారు.

రెఫరల్ ఫీజుల రద్దుతో విక్రేతలకు మద్దతు

- అమెజాన్ డైరెక్టర్ సేల్స్ గౌరవ్ వెల్లడి

హైదరాబాద్ : రెఫరల్ ఫీజుల రద్దుతో విక్రేతల అమ్మకాలు పెరిగాయని అమెజాన్ ఇండియా డైరెక్టర్ సేల్స్ గౌరవ్ భట్నాగర్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో గౌరవ్ మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల తమ సంస్థ రూ.300 కంటే తక్కువ ధర ఉన్న ఉత్పత్తులపై జీరో రెఫరల్ ఫీజులను అమల్లోకి తెచ్చిందన్నారు. దీంతో తక్కువ ధర కలిగిన వస్తువులపై విక్రేతలకు, కొనుగోలుదారులకు సొమ్ము ఆదా అవుతుందన్నారు.



దుస్తులు, బూట్లు, ఫ్యాషన్ నగలు, కిరాణా, గృహాలంకరణ, ఫర్నిషింగ్‌లు, అందం, బొమ్మలు, వంటగది ఉత్పత్తులు, ఆటోమోటివ్, పెంపుడు జంతువుల ఉత్పత్తులు వంటి 135 విభాగాల ఉత్పత్తులపై జీరో రెఫరల్ ఫీజును వర్తింపజేస్తున్నామన్నారు. తెలంగాణలో తమ సంస్థ వేదికలో 50,000 పైగా విక్రేతలు ఉన్నారన్నారు. ఏప్రిల్ 7 నుంచి రూ.300 కంటే తక్కువ ధర కలిగి ఉన్న 1.2 కోట్లకు పైగా ఉత్పత్తులపై జీరో రెఫరల్ ఫీజులను అమలు చేసిందన్నారు. జాతీయ షిప్పింగ్ రేట్లను రూ.77 నుంచి రూ.65కు తగ్గించామన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - భీమునిపట్నం (విశాఖపట్నం)

సగం దేహం కాలపోయి ఓ మహిళ మృతి చెంది ఉండడం విశాఖ జిల్లాలో శుక్రవారం కలకలం రేపింది. భీమునిపట్నం మండలం దాకమర్రి గ్రామ శివారులోని ఫార్చ్యున్ హిల్స్ వుడా లేఅవుట్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. పెట్రోల్ పోసి గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

భీమిలి పోలీసుల కథనం ప్రకారం.. శుక్ర వారం ఉదయం లేఅవుట్ వద్ద సుమారు 25 ఏళ్ల వివాహిత మృతదేహం ఉన్నట్టు అందిన సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. సుమారు ఐదు అడుగుల ఎత్తు, చామన ఛాయ రంగు కలిగిన మహిళ ముఖ భాగం, మెడ, కుడి చేయి భాగాలు కాలిపోయి ఉన్నట్టు గుర్తించారు. ఆమెను పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేసి ఉంటారని భావించి ఆ దిశగా విచారణ సాగిస్తున్నారు. జొన్నాడ టోల్‌గేట్ వద్ద సిసి పుటేజీలను పరిశీలిస్తున్నారు. మృతురాలి మెడపై కత్తిగాట్లు ఉన్నట్టు తెలుస్తోంది. సంఘటనా స్థలాన్ని నార్త్ సబ్ డివిజన్ ఎసిపి అప్పలరాజు, స్థానిక సిఐ బి తిరుమలరావు, ఎస్ఐ జి హరీష్ తదితరులు పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తులో చేస్తున్నారు.



బొలేరో వాహనం బోల్తా

- నలుగురు మృతి
- 15 మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ఆత్మకూరు (నంద్యాల జిల్లా)

నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం ఎస్ఎన్ తండా సిద్దాపురం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మరో 15 మంది తీవ్ర గాయాలు పాలయ్యారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కర్నూలు జిల్లా ఆదోని పట్టణం ఇందిరానగర్ కాలనీకి చెందిన ఎవి రాములమ్మ కుటుంబంలో 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన తమ పిల్లలతో కుటుంబ సభ్యులు, బంధువులు మొత్తం 25 మంది బొలేరో వాహనంలో శ్రీశైలం దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం సాయంత్రం ఆత్మకూరు మండలం సిద్దాపురం చెరువు దగ్గరకు రాగానే బొలేరో వాహన డ్రైవర్ సడన్‌గా బ్రేకులు వేయడంతో వాహనం బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న చంద్రమ్మ (35), శశికళ (40), గిడ్డయ్య (42), లక్ష్మి (28) సంఘటన స్థలంలో మృతి చెందారు. ప్రసన్న, కీర్తి, ప్రవీణ్ తేజ, రవిరాజు, వీణ, రంగస్వామి, గిరిధర్ కుమార్, హరి, గోపీచంద్, శిల్ప, హాసిని, వీరేష్ సహా మొత్తం 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఐదు సంవత్సరాలు చిన్న పిల్లలు సైతం ఉన్నారు. పరిస్థితి విషయంగా ఉండడంతో గిరిధర్ కుమార్‌ను మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు. సిఐ రాము, ఎస్ఐ నారాయణరెడ్డి, తమ సిబ్బందితో వెళ్లి క్షతగాత్రులను హుటాహుటిన ప్రత్యేక వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. స్థానిక వైద్యశాలలో డాక్టర్ ఖాదర్ గోకవరం పిహెచ్‌సికి చెందిన డాక్టర్ కలిసి గాయపడ్డ వారికి వైద్యం చేశారు.

జగన్ సంతాపం

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడం పట్ల వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం తెలిపారు. వారి కుటుంబసభ్యులకు తన సానుభూతి తెలియజేశారు.

బెయిల్ ఇవ్వలేం

- వల్లభనేని వంశీ పిటిషన్‌పై హైకోర్టు


ప్రజాశక్తి-అమరావతి

గన్నవరం టిడిపి ఆఫీసుపై దాడి కేసులో నిందితుడైన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. దాడి ఘటనలో ఫిర్యాదుదారు సత్యవర్ధన్‌ను బెదిరించారని, కులం పేరుతో ధూషించారనే కేసును కొట్టివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. వల్లభనేని వంశీ పాత్ర ఉన్నదనే ప్రాథమిక ఆధారాలు ఉన్నందున కింది కోర్టు కూడా ఉత్తర్వులు ఇవ్వలేదని చెప్పింది. దర్యాప్తు దశలో బెయిల్ మంజూరు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. బెయిల్ ఇస్తే పిటిషనర్ సాక్ష్యాలను తారుమారు చేస్తారా, ఫిర్యాదుదారుకు ప్రాణహాని ఉందా అనే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని చెప్పింది. సాక్షులను ప్రభావితం చేయడమే కాక తారుమారు చేసే అవకాశం కూడా ఉందన్న పోలీసుల వాదనను సమర్థిస్తూ జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు శుక్రవారం తీర్పు చెప్పారు.

మద్యం కేసులో ముందస్తు బెయిల్‌కు నిరాకరణ

ప్రజాశక్తి-అమరావతి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా పనిచేసిన కార్యదర్శి కె ధనంజయరెడ్డి, ఒఎస్‌డి పి కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్పకు మద్యం కేసులో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. తమను పోలీసులు అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పించాలన్న వాళ్ల అభ్యర్థనను తిరస్కరించింది. సమగ్ర వివరాలు ఇచ్చేందుకు గడువు కావాలని సిఐడి తరపున పిపి లక్ష్మీనారాయణ కోరారు. ఇందుకు హైకోర్టు అనుమతించడంతో ఈలోగా తమను అరెస్టు చేయరాదని మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరగా జస్టిస్ టి మల్లికార్జునరావు నిరాకరిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను ఈ నెల 7కు వాయిదా వేశారు. ఈలోగా సిఐడి కేసు వివరాలు అందజేయాలని ఆదేశించారు. మద్యం కేసులో నిందితులు రాజ్ కెసిరెడ్డి, చాణక్య రిమాండ్ రిపోర్టుల్లో తమ పాత్ర గురించి ప్రస్తావించారని, తమను అరెస్టు చేసే అవకాశాలు ఉన్నందున ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని వారంతా హైకోర్టును ఆశ్రయించారు.



త్వరలో ఎంజి విండ్సర్ ప్రో ఆవిష్కరణ

న్యూఢిల్లీ: జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ త్వరలో విండ్సర్ ఇవిలో కొత్త వేరియంట్ విండ్సర్ ప్రోను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. కొత్త బ్యాటరీ ప్యాక్‌తో, మరిన్ని కొత్త టెక్ ఫీచర్లతో ప్రో రానుందని పేర్కొంది. విండ్సర్‌లో ఇప్పటి వరకు ఈ సంస్థ 20,000 యూనిట్లను విక్రయించింది. విండ్సర్ ప్రోపై మరిన్ని ఆశలు పెట్టుకుంది. మే6న విండ్సర్ ప్రోను ఆవిష్కరించే అవకాశం ఉందని తెలుస్తోంది.

సంపాదకీయం


పారిశ్రామిక తిరోగతి!

గత నాలుగేళ్ళలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పారిశ్రామిక ఉత్పత్తిలో తగ్గుదల నమోదు కావటం భారత ఆర్థిక వ్యవస్థకు ఒక ప్రమాద ఘంటిక. సామాన్య ప్రజల కొనుగోలు శక్తి నానాటికీ తగ్గుతున్న దాని పర్యవసానమే ఈ పరిస్థితి! భారత ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా పురోగమిస్తున్నదని గత కొంతకాలంగా ఢంకా భజాయిస్తున్న మోడీ సర్కారు పనితీరుకు ఇది అక్షరాలా ప్రతికూల నివేదిక. ప్రజల ఆర్థిక స్థితి రోజురోజుకూ దిగజారుతున్నదని, గత్యంతరం లేని పరిస్థితుల్లో- ప్రజలు తమ రోజువారీ జీవన వ్యయాన్ని కూడా తగ్గించుకుంటున్నారని కేంద్ర గణాంకాల శాఖ విడుదల చేసిన పారిశ్రామిక ఉత్పత్తి సూచి (ఐఐపి) తేటతెల్లం చేస్తోంది. గడిచిన ఆర్థిక సంవత్సరం ప్రధాన పారిశ్రామిక రంగాలన్నీ ఉత్పత్తిలో గణనీయంగా తగ్గుదలను నమోదు చేశాయి. కోవిడ్ ఉత్పాతం తరువాత ఇంత తక్కువ వృద్ధి రేటు నమోదు కావడం ఇదే మొదటిసారి. 2021 -22లో 11.4 శాతంగా నమోదైన వృద్ధి రేటు ఈ ఏడాది 4 శాతానికే పరిమితం అయింది. 2023 - 24 ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూసినా ఇది 1.9 శాతం తక్కువగా ఉంది. మేకిన్ ఇండియా పేరిట కేంద్ర ప్రభుత్వం హడావిడి చేస్తున్నప్పటికీ- అంకెల్లో వ్యక్తమవుతున్న వాస్తవ దృశ్యం ఇదీ!

ప్రజల ఆదాయాన్ని పెంచే చర్యలు చేపట్టకుండా పాలకులు ఎన్ని ప్రగల్భాలు పలికినా ఫలితం ఉండదు అనటానికి ఐఐపి నివేదిక నిదర్శనం. మోడీ ప్రభుత్వం కార్పొరేటు అనుకూల విధానాలను నెత్తిన వేసుకొని, ప్రైవేటీకరణను పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. అంబానీ, అదానీ తదితరులకు లాభాలను దోచిపెట్టేలా పనిగట్టుకొని ప్రభుత్వరంగ సంస్థలను దెబ్బ తీస్తోంది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని దేశ యువతకు ఆశ కల్పించి, గద్దెనెక్కాక ఆ మాటనే పూర్తిగా మర్చిపోయింది. ప్రజలు దానిని గుర్తు చేస్తుంటే- జీవన ప్రమాణాల మెరుగుదలకు ఏవిధంగానూ దోహదపడని ఉన్మాదం, ఉద్రేకాల వైపు యువతీ యువకులను మళ్లిస్తోంది. ఉదార ఆర్థిక విధానాల్లో భాగంగా శాశ్వత నియామకాలకు స్వస్తి చెప్పి, అన్నింటా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగు పద్ధతుల్లోనే ఉద్యోగులను నియమిస్తోంది. ఆఖరికి దేశభద్రతకు అత్యంత కీలకమైన రక్షణరంగంలోనూ లక్షలాది పోస్టులూ ఖాళీగా ఉన్నా- అగ్నివీర్ పేరిట తాత్కాలిక నియామకాలతోనే కాలయాపన చేస్తోంది. గ్రామీణ ప్రజలకు కాస్త ఆదాయాన్ని గ్యారంటీ చేసే ఉపాధి హామీ చట్టాన్ని ఏటేటా నిధులు తగ్గించటం ద్వారా నిర్వీర్యం చేస్తూ వస్తోంది. గ్రామీణ భారతానికి వెన్నెముకలా ఉన్న వ్యవసాయరంగం రాయితీల తగ్గింపు, అరకొర మద్దతు ధరతో నానాటికీ కుదేలవుతోంది. సాఫ్ట్‌వేర్ మొదలుకొని ప్రతి ప్రైవేటు, కార్పొరేటు రంగంలోనూ ఉద్యోగులపై పనిభారం పెంచటం, నిజవేతనాలు తగ్గించటం కొన్నేళ్లుగా సాగుతోంది. వీటన్నింటి పర్యవసానంగా ప్రజల ఆదాయాలు తగ్గి, కొనుగోలు శక్తి క్షీణించిపోతోంది. ఆహారం, బట్టలు తదితర రోజువారీ వినియోగ వస్తువులపై ప్రజల ఖర్చు గతేడాదితో పోలిస్తే 4.7 శాతం తగ్గినట్టు కన్జూమర్ నాన్ డ్యూరబుల్ పద్దు స్పష్టం చేస్తోంది. రోజువారీ అవసరాలను తీర్చుకోలేని స్థితిలో ప్రజలున్నారని చెప్పటానికి ఇది సూచిక. వాహనాలు, గృహోపకరణాలు వంటి వినిమయ వస్తువుల ఉత్పత్తి కూడా మందగించింది. నెలవారీ చెల్లింపుల (ఇఎంఐ) పద్ధతిని కంపెనీలు ప్రోత్సహిస్తున్నాయి కాబట్టే- ఈ రంగంలో ఈపాటి కొనుగోళ్ళు అయినా జరుగుతున్నాయి.

ఆర్థికమాంద్యం ఆవరిస్తున్న పరిస్థితుల్లో రానున్న కాలంలో పారిశ్రామిక ఉత్పత్తి మరింత క్షీణించే ప్రమాదముందని ఆర్థికవేత్తల హెచ్చరిక. అమెరికా విధిస్తున్న పన్నుల భారం కూడా మన ఎగుమతులపై తీవ్రంగా ఉంటుంది. ఆక్వా తదితర రంగాలపై ఆ ప్రభావం ఇప్పటికే పడింది. ఈ నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి గురించి కబుర్లతోనే కాలక్షేపం చేయకుండా- క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలకు అనుగుణంగా వ్యవహరించాలి. ప్రజల నిజ వేతనాలను పెంచే ముమ్మర చర్యలు చేపట్టాలి. పైకి ఆడంబరంగా కనిపించే ఉదార ఆర్థిక విధానాలు కార్పొరేట్లకు లాభాలు కురిపించి, సామాన్యులకు అంతకుమించిన కష్టనష్టాలను చవిచూపిస్తాయన్న వాస్తవం ఇప్పటికే ఆచరణలో తేలిపోయింది. వ్యవసాయ రంగాన్ని, ప్రభుత్వరంగాన్ని బలోపేతం చేయడం ద్వారా ప్రజల కొనుగోలుశక్తిని పెంచాలి. తద్వారా పారిశ్రామిక, ఆర్థిక రంగాలను మెరుగుపరచాలి.

మహనీయుల మాట



అన్వేషణ నుంచి నిరంతరాన్వేషణ
నుంచి జ్ఞానం పుట్టుకొస్తుంది!
దానికి కావలసింది మానవుడి
అవిశ్రాంత ఆశావహ శోధన!
ప్రపంచంలో జీవిస్తూ
ప్రపంచంతోనూ పరస్పరంగానూ
జరిపే అలుపెరుగని శోధన!

- పాలో ఫెయిరీ,
బ్రెజిలియన్ విద్యావేత్త,
తత్వవేత్త.

పహల్గాం టెర్రరిస్టు ఘాతుకం...ఆ తర్వాత?

వ్యాఖ్య

పహల్గాంలో 26 మంది పర్యాటకులను బలిగొన్న టెర్రరిస్టు ఘాతుకాన్ని ఖండించడం లోనూ, విచారించడం లోనూ దేశం ఒక్కతాటిపై నిలిచింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 25 కుటుంబాలు, నేపాల్‌కు చెందిన ఒక కుటుంబం ఈ అమానుష హత్యాకాండలో ప్రియమైన కుటుంబ సభ్యులను కోల్పోయాయి. మనుషులను వారి మతం ఏమిటో నిర్ధారించుకొని మరీ హత్య చేయడం ద్వారా ఉగ్రవాదులు దేశంలో మతపరమైన విభజన తీసుకురావాలని, మత విద్వేషాలు రెచ్చగొట్టాలని పథకం పన్నారు. అయితే కులం, జాతి తేడాలు లేకుండా సమాజంలో అన్ని తరగతుల ప్రజలు ఈ ఘాతుకంపై అప్పటికప్పుడే తీవ్ర ఆగ్రహంతో స్పందించారు. రాజకీయ స్థాయిలో అన్ని రాజకీయ పార్టీలు ఈ రాక్షస దాడిని ఏకోన్ముఖంగా ఎదుర్కోవాలనే సంకల్పాన్ని ప్రకటించాయి.

ఈ సమయంలో కాశ్మీర్ ప్రజల ప్రతిస్పందన మరింత కీలకమైంది. ఎలాంటి మినహాయింపు లేకుండా వారు ఈ సామూహిక హత్యాకాండను ఖండించారు, నిరసన తెలిపారు. జమ్ముకాశ్మీర్ లోని పట్టణాలన్నింట్లో హర్తాళ్లు జరిపి, దుకాణాలను మూసివేశారు. జమ్ముకాశ్మీర్ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. మనోభావాలలో, రాజకీయ వ్యక్తీకరణలో వచ్చిన పెద్ద మార్పును ఇది ప్రతిబింబిస్తుంది.

సైనిక ప్రతీకారమేనా?

ఈ దారుణమైన దాడికి ఎలా ప్రతిస్పందించాలన్నది ఇప్పుడు ప్రభుత్వం ముందు, దేశం ముందు ఉన్న ప్రశ్న. మొదట తీసుకోవాల్సిన చర్య ఈ ఘాతుకానికి పాల్పడిన దోషులను చట్టం ముందు నిలబెట్టడం. ఇప్పటికే గుర్తించిన టెర్రరిస్ట్ ముఠాల సభ్యులను వెంటాడి ఏరివేసే పనిలో భద్రతా దళాలు ముమ్మర గాలింపు సాగిస్తున్నాయి. ఈ ఆపరేషన్ జయప్రదంగా ముగించాలి. అయితే మరింత కీలకమైన సమస్య మిగిలే ఉంటుంది. ఎడతెగని ఈ ఉగ్రవాద ముప్పును ఎదుర్కోవటానికి ఇంకేం చేయాలి? ఈ టెర్రరిస్టు దళాలకు ఆశ్రయం కల్పిస్తూ పెంచి పోషించే పాకిస్తాన్ సైన్యాన్ని, రక్షణ యంత్రాంగాన్ని ఎలా ఎదుర్కోవాలి? పాకిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకోవాలంటూ ఎలక్ట్రానిక్ మీడియాలో కథనాలు వెల్లువెత్తుతున్నాయి. పుల్వామా దాడి, అంతకు ముందు పఠాన్ కోట సందర్భాల్లోనూ ఇలాగే జరిగింది. పాకిస్తాన్‌లో ఉగ్రవాద యంత్రాంగం పునాదిని పూర్తిగా నిర్మూలించే స్థాయిలో ఇండియా సైనిక దాడి చేయాలని ఇప్పుడు అంటున్నారు. అప్పుడే భవిష్యత్తులో దాడులు జరగకుండా అడ్డుకోగలమని చెప్తున్నారు. భావోద్వేగాల తీవ్రతలో ఆత్మగౌరవంగల ఒక దేశం ప్రతీకారం తీర్చుకోవాలన్నది ఒక్కటే మార్గంగా కనిపించవచ్చు. అయితే దానివల్ల ఉగ్రవాదాన్ని నలిపివేయాలన్న ప్రకటిత లక్ష్యం నెరవేరుతుందా?



కాశ్మీర్ ప్రజల భాగస్వామ్యం

జమ్ముకాశ్మీర్‌లో భద్రతా వ్యవస్థ లోపాలను పూరించుకోవడం ఇక్కడ ప్రాధాన్యతగా ఉండాలి. తీవ్ర భద్రతా వైఫల్యం వల్లనే పహల్గాం దాడి జరిగింది. టెర్రరిస్టు హింసాకాండను తిప్పికొట్టడానికి ప్రజలను సమీకరించే సానుకూల వాతావరణం ఇప్పుడు కాశ్మీర్‌లో ఉంది. సుదీర్ఘ కాలం పాటు పాలనా యంత్రాంగం సైనికీకరణ, సాధారణ నిర్బంధం కూడా అక్కడ ఉగ్రవాద హింసకాండను అడ్డుకోవడానికి ప్రధాన ప్రతిబంధకాలుగా ఉండేవి. ప్రజలను దూరం చేసే ధోరణులను తగ్గించే చర్యలను ఇప్పుడు అమలు చేయాలి. ఈ మార్గం నుంచి ఏ విధంగానూ వైదొలగరాదు. టెర్రరిస్టు గ్రూపుల్లో చేరిన వారికి సంబంధించిన పది గృహాలను ధ్వంసం చేయటం ఇందుకో ఉదాహరణ. అలాంటి సామూహిక శిక్ష పోకడలు ప్రజలను దూరం చేస్తాయి. లోయలో ప్రధాన పార్టీలన్నీ ఈ విధ్వంసాన్ని ఖండించాయి. జమ్ముకాశ్మీర్ రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించి ప్రజలు రాజకీయంగా భాగస్వామ్యం వహించే విధంగా చేయడం. వారి ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ ద్వారానే టెర్రరిస్టులను శక్తులను ఏకాకులను చేయడానికి భూమిక ఏర్పడుతుంది.

దౌత్యపరమైన చర్యలు

సరిహద్దుల ఆవల నుంచి చొచ్చుకువచ్చే సీమాంతర ఉగ్రవాద సమస్యను విస్తృతమైన పరిధిలో చర్చల ద్వారా రాజకీయ దౌత్య ఆర్థిక మార్గాలు, భద్రత పెంపు ద్వారా ఎదుర్కోవాల్సి ఉంటుంది. వెనువెంటనే ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంది. దౌత్య కార్యాలయాల స్థాయి తగ్గింపు, వీసాల రద్దు, సింధు జలాల ఒప్పందం 'స్తంభన'లో పెట్టడం వంటి చర్యలు తీసుకుంది. అయితే ఈ చివరి చర్య అమలు మాత్రం అనేక తీవ్రమైన చట్టపరమైన, దౌత్య సంబంధమైన ప్రభావాలు లేకుండా సాధ్యం కాదు.

భారత వైఖరికి మద్దతు కూడగట్టుకునేందుకు, పాకిస్తాన్‌ను ఏకాకిని చేసేందుకు ప్రస్తుతం నడుస్తున్న దౌత్యపరమైన ప్రయత్నాలు కొనసాగాలి. ఇది జరగాలంటే పహల్గాం దాడిలో పాల్గొన్న టెర్రరిస్టులకు పాకిస్తాన్‌తో గల సంబంధాలకు సాక్ష్యాధారాలు సేకరించాలి. ఆర్థిక కార్యాచరణ బృందం (ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్-ఎఫ్.ఎ.టి.ఎఫ్) దగ్గర భారతదేశం తన వాదన వినిపించి టెర్రరిస్టు గ్రూపులకు పాకిస్తాన్ సహాయం అందకుండా నిలుపు చేయగలగాలి. టెర్రరిస్ట్ గ్రూపులకు సహాయం చేసే విషయమై 2012 నుంచి 2022 వరకు ఒక అస్పష్ట జాబితాలో పాకిస్తాన్ పేరు ఉండేదని ఇక్కడ గుర్తు చేసుకోవాలి. ఈ కారణంగానే పాకిస్తాన్ హఫీజ్ సయీద్ వంటి లష్కర్ నాయకులపై కొన్ని పరిమిత చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. దీంతోపాటే మరికొన్ని ఆర్థిక చర్యలు కూడా తీసుకోవడంపై ఆలోచించవచ్చు.

పహల్గాంలో అమానుషమైన టెర్రరిస్ట్ దాడికి వ్యతిరేకంగా దేశం మొత్తం ఒక తాటిపైకి వచ్చిన ఈ సమయంలో కొన్ని ఆందోళనకరమైన ధోరణులు కూడా కనిపిస్తున్నాయి. ముస్లింలకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో విషపూరితమైన విద్వేష ప్రచారం సాగుతున్నది. కొన్ని రాష్ట్రాల్లో కాశ్మీరీ విద్యార్థుల పైన, వ్యాపారులపైన బెదిరింపులకు దిగి వెళ్ళగొట్టే ప్రయత్నాలు జరిగాయి. ఆగ్రాలోని ఒక రెస్టారెంట్లో బిర్యానీ అమ్ముతున్న ముస్లిం యువకుడ్ని కాల్చివేసిన ఘటన దిగ్భ్రాంతి కలిగిస్తుంది. పహల్గాం దాడికి ప్రతీకారంగా గోరక్షకులు ఈ పని చేశారని సోషల్ మీడియాలో గొప్పగా ప్రకటించుకున్నారు. ఈ విధమైన విద్వేష ప్రచారాన్ని ఏమాత్రం సహించినా టెర్రరిస్టుల పథకాలకే ఊతమిచ్చినట్టవుతుంది. ఈ విధమైన విచ్ఛిన్నకర చర్యలకు పాల్పడిన వారిపై సంబంధిత అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలి. ప్రజల ఐక్యతను దెబ్బతీసి పక్కదోవ పట్టించే వారి పట్ల ఏ విధమైన ఉదాసీనతకు ఆస్కారం లేదు, ఉండకూడదు.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

సర్జికల్ దాడుల ఫలితాలేంటి?

సైనిక పరంగా స్పందించడం విషయానికొస్తే ఏప్రిల్ 29న ప్రధానమంత్రి సాయుధ దళాల ప్రధాన అధికారులతో సమావేశమైన తర్వాత 'ఎలా ఎప్పుడు ఏ లక్ష్యంతో స్పందించాలో' వారికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్టు వార్తలు వచ్చాయి. ఏమైనా సైనిక చర్య ఎలా ఉండాలనేది దేశ రాజకీయ నాయకత్వమే నిర్ణయించాలి. ఉగ్రవాదాన్ని నిర్మూలించడం అనే లక్ష్యానికి ఏదైనా సైనిక చర్య ఉపయోగపడుతుందా అన్న అంశంపై స్పష్టత ఉండాలి. 2016 సర్జికల్ దాడులు, 2019 బాల్కోట్ వైమానిక దాడుల అనుభవం నుండి చూస్తే టెర్రరిస్ట్ గ్రూపులను దెబ్బ తీయటంలో అవేమీ పెద్ద సమర్థంగా పని చేయలేదని అర్థమైంది. కాకపోతే అవి సత్వర ప్రతీకారంతో చేశారనే విధంగా మోడీ ప్రభుత్వం చెప్పుకోవడానికి మాత్రం పనికి వచ్చాయి. అంతేకాని ఆ దాడులు ఉత్తరోత్తరా టెర్రరిస్టు హింసాకాండ జరగకుండా చేయలేకపోయాయి. ఇప్పుడు మరింత పెద్ద చర్య తీసుకోవాలని మరింత పెద్ద ఎత్తున ఆ దాడులు చేయాలనే మాట వినిపిస్తోంది. అలాంటి సైనిక చర్య వల్ల టెర్రరిస్ట్ గ్రూపులను లక్ష్యంగా చేసుకొని దెబ్బ తీయటం, నిర్మూలించటం సాధ్యమేనా అన్నది సందేహమే. వారికి పాకిస్తాన్ ఐఎస్ఐ సైనిక వ్యవస్థ వత్తాసు వున్నప్పుడు రాజ్యేతర పాత్రధారులను అలాంటి చర్యలతో అణచివేయటం సందేహాస్పదమే. సైనిక చర్య పర్యవసానాలు, ప్రతీకారాలు రెండు దేశాల మధ్య సాయుధ శత్రుత్వాల పరంపరకు దారితీసే పరిస్థితిని గమనంలోకి తీసుకోవాలి. పాకిస్తాన్‌తో సైనిక ఘర్షణ ఆ దేశంలో పాకిస్తాన్ సైన్యం పరిస్థితి మెరుగుపడటానికే దారితీస్తుంది. ఎందుకంటే ఇప్పుడు అది ప్రజల వ్యతిరేకత మూట కట్టుకుంటుంది. ఈ తరహా చర్య వల్ల పాకిస్తాన్ భద్రతా వ్యవస్థ భారతదేశం పైన పరోక్ష యుద్ధాన్ని మరింత గట్టిగా కొనసాగించేందుకు పాల్పడవచ్చు. సైనిక పరమైన నిర్ణయం తీసుకునే ముందు ప్రభుత్వం వీటన్నిటిని పరిగణలోకి తీసుకోవాలి.

ఆందోళనకరం

పహల్గాంలో అమానుషమైన టెర్రరిస్ట్ దాడికి వ్యతిరేకంగా దేశం మొత్తం ఒక తాటి పైకి వచ్చిన ఈ సమయంలో కొన్ని ఆందోళనకరమైన ధోరణులు కూడా కనిపిస్తున్నాయి. ముస్లింలకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో విషపూరితమైన విద్వేష ప్రచారం సాగుతున్నది. కొన్ని రాష్ట్రాల్లో కాశ్మీరీ విద్యార్థులపైన, వ్యాపారులపైన బెదిరింపులకు దిగి వెళ్ళగొట్టే ప్రయత్నాలు జరిగాయి. ఆగ్రాలోని ఒక రెస్టారెంట్లో బిర్యానీ అమ్ముతున్న ముస్లిం యువకుడ్ని కాల్చివేసిన ఘటన దిగ్భ్రాంతి కలిగిస్తుంది. పహల్గాం దాడికి ప్రతీకారంగా గోరక్షకులు ఈ పని చేశారని సోషల్ మీడియాలో గొప్పగా ప్రకటించుకున్నారు. ఈ విధమైన విద్వేష ప్రచారాన్ని ఏమాత్రం సహించినా టెర్రరిస్టుల పథకాలకే ఊతమిచ్చినట్టవుతుంది. ఈ విధమైన విచ్ఛిన్నకర చర్యలకు పాల్పడిన వారిపై సంబంధిత అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలి. ప్రజల ఐక్యతను దెబ్బతీసి పక్కదోవ పట్టించే వారి పట్ల ఏ విధమైన ఉదాసీనతకు ఆస్కారం లేదు, ఉండకూడదు.

టెర్రరిస్టుల హత్యాకాండకూ, వారి విద్వేషపూరిత భావజాలానికి వ్యతిరేకంగా జరిగే పోరాటం మెజారిటీ మతతత్వం పైన గాక ప్రజల సమైక్యత పైన, లౌకిక విలువలపైన ఆధారపడి సాగాలి. టెర్రరిస్టు శక్తులను ప్రయోగించేవారి కుటిల పన్నాగాలను ఓడించడంలో భారతదేశం జయప్రదమయ్యేలా ముందుకు నడిపించేది ఈ మార్గమే.

(ఏప్రిల్ 30 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

ఆర్‌డిటి సేవలకు కేంద్ర పాలకుల గ్రహణం

విశ్లేషణ

లెనిన్ అన్విత్

గత ఐదు దశాబ్దాలకు పైగా రాయలసీమ ప్రజలతో పెనవేసుకున్న పెద్ద సేవా సంస్థ 'రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు' (ఆర్‌డిటి). ఈ సంస్థ క్రమంగా రాయలసీమ జిల్లాలన్నిటితో పాటు, ఆంధ్ర, తెలంగాణలోని 21 జిల్లాలు 150 మండలాలకు తమ సేవా కార్యక్రమాలను విస్తరించి ప్రజల విశ్వసనీయతను పొందింది. ఇలాంటి సంస్థ కేంద్ర ప్రభుత్వ మతతత్వ విధానాల ఫలితంగా సంక్షోభంలో పడింది. గత ఐదు సంవత్సరాలుగా అనేక రూపాల్లో వేధింపులకు గురిచేసి ప్రస్తుతం రెన్యూవల్స్‌ను నిలిపివేయడమే కాకుండా, బ్యాంకుల్లో వున్న డబ్బులను ఫ్రీజ్ చేసింది. దీనివల్ల ఆర్‌డిటి ఉనికికే ప్రమాదం వచ్చింది. పి4 విధానం ద్వారా దాతల సహాయంతో పేదరికాన్ని నిర్మూలిస్తామని చెప్పుకుంటున్న రాష్ట్ర పాలకులు అలాంటి సేవలు అందించడంలో రాష్ట్రంలో అగ్ర భాగాన వున్న ఆర్‌డిటి ని కాపాడేందుకు సిద్ధపడడంలేదు. కేంద్ర ప్రభుత్వంలో తమకున్న సంఖ్యా బలాన్ని ఉపయోగించి ఆర్‌డిటి కొనసాగేలా చూడాల్సిన ముఖ్యమంత్రి, కేంద్ర పాలకుల మతతత్వ మనసెరిగి నడుచుకుంటున్నట్లు కనిపిస్తుంది. ఆర్‌డిటి మూతపడితే ప్రజల్లో వచ్చే వ్యతిరేకతను గుర్తించిన స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించినా అధినాయకుడి నుండి సరైన భరోసా రాలేదు.

గత ఐదు దశాబ్దాలకు పైగా రాయలసీమ ప్రజలతో పెనవేసుకున్న పెద్ద సేవా సంస్థ 'రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు' (ఆర్‌డిటి). అనంతపురం జిల్లా కేంద్రంగా ప్రారంభించిన ఈ సంస్థ క్రమంగా రాయలసీమ జిల్లాలన్నిటితో పాటు, ఆంధ్ర, తెలంగాణలోని 21 జిల్లాలు 150 మండలాలకు తమ సేవా కార్యక్రమాలను విస్తరించి ప్రజల విశ్వసనీయతను పొందింది. విద్య, వైద్యం, గృహ నిర్మాణం, వాటర్‌షెడ్లు, పండ్ల మొక్కలు, చెట్ల మొక్కలు, క్రీడలు, మానసిక, వికలాంగుల పాఠశాలలు, మహిళా సాధికారిత గ్రూపులు, సాంస్కృతిక కార్యక్రమాలు, పొదుపు సంఘాలు ఇలా అనేక విభాగాల్లో ఆర్‌డిటి సేవలు అందిస్తుంది. దళిత, గిరిజన ప్రజల జీవితాల్లో చాలా మార్పులకు కారణమైంది. పారా ఒలింపిక్స్‌లో, జాతీయ మహిళా క్రికెట్‌లో, స్కేటింగ్, టెన్నిస్ లాంటి అనేక పోటీలలో ఈ ప్రాంత పేద పిల్లలు పతకాలు సాధించడంలో ఈ సంస్థ పాత్ర చాలా ముఖ్యమైనది. డ్రిప్, స్ప్రింక్లర్ల విధానాన్ని మొదట ప్రారంభించింది ఆర్‌డిటి నే. ఇలాంటి సంస్థ కేంద్ర ప్రభుత్వ మతతత్వ విధానాల ఫలితంగా సంక్షోభంలో పడింది. గత ఐదు సంవత్సరాలుగా అనేక రూపాల్లో వేధింపులకు గురిచేసి ప్రస్తుతం రెన్యూవల్స్‌ను నిలిపివేయడమే కాకుండా, బ్యాంకుల్లో వున్న డబ్బులను ఫ్రీజ్ చేసింది. దీనివల్ల ఆర్‌డిటి ఉనికికే ప్రమాదం వచ్చింది. పి4 విధానం ద్వారా దాతల సహాయంతో పేదరికాన్ని నిర్మూలిస్తామని చెప్పుకుంటున్న రాష్ట్ర పాలకులు అలాంటి సేవలు అందించడంలో రాష్ట్రంలో అగ్ర భాగాన వున్న ఆర్‌డిటి ని కాపాడేందుకు సిద్ధపడడంలేదు. కేంద్ర ప్రభుత్వంలో తమకున్న సంఖ్యా బలాన్ని ఉపయోగించి ఆర్‌డిటి కొనసాగేలా చూడాల్సిన ముఖ్యమంత్రి, కేంద్ర పాలకుల మతతత్వ మనసెరిగి నడుచుకుంటున్నట్లు కనిపిస్తుంది. ఆర్‌డిటి మూతపడితే ప్రజల్లో వచ్చే వ్యతిరేకతను గుర్తించిన స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించినా అధినాయకుడి నుండి సరైన భరోసా రాలేదు.

ప్రజా ఉద్యమాలు-స్వచ్ఛంద సేవా సంస్థలు

భూమి కోసం తెలంగాణ రైతాంగం సాయుధ పోరాటం సాగిస్తున్నప్పుడు ప్రజా ఉద్యమాలను పక్కదారి పట్టించేందుకు 'సర్వోదయ ఉద్యమం' పేరుతో వినోభాబావే భూదానోద్యమాన్ని ప్రారంభించాడు. ప్రజలను పీడించుకొని దోచుకుంటున్న తెలంగాణ భూస్వాముల దగ్గరకు వినోభాబావే వచ్చి భూమి దానం ఇవ్వాలని అడగడం, విసునూరు దేశముఖ్ రామచంద్రారెడ్డి లాంటి వారు వెంటనే స్పందించి దానం చేయడం నాటకీయంగా ఆనాడు జరిగిపోయాయి. ప్రజా ఉద్యమాలు ఎక్కడ జరిగినా అక్కడ ఇలాంటి దాన, సేవా సంస్థలు పుట్టుకొచ్చాయి. ప్రజల్లో అక్షరాస్యతను సాధించేందుకు, మూఢనమ్మకాలను తొలగించేందుకు బ్రిటీష్ కాలంలోనే అనేకమంది సంఘసంస్కర్తలు నిస్వార్థంగా కృషి చేశారు. స్వచ్ఛంద సేవ పేరుతో విదేశీ నిధులతో నిర్వహించే కొన్ని సంస్థలు మత మార్పిళ్లకు, ప్రజా ఉద్యమాల నుండి మళ్ళించేందుకు పనిచేశాయి. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత స్వాతంత్ర్యం పొందిన మూడో ప్రపంచ దేశాల్లోకి ఏదో రూపంలో జొరబడేందుకు సామ్రాజ్యవాదం వివిధ ప్రయత్నాలు చేసింది. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, డబ్ల్యుటివో లాంటి ఆర్థిక సంస్థల ద్వారా ఆర్థిక కార్యకలాపాలను, సైనిక ఒప్పందాల ద్వారా రక్షణ విధానాలను, సేవల ద్వారా పేదల జీవితాలను ప్రభావితం చేస్తూనే వుంది. దాతృత్వ సిద్ధాంతాన్ని పాలకులే ప్రచారం చేశారు. విదేశీ నిధులతో సేవలు అందించే స్వచ్ఛంద సేవా సంస్థలను పాలకులే ప్రోత్సహించి తగిన ఏర్పాట్లు చేశారు. 1965-70 మధ్య వేల సంఖ్యలో ఇలాంటి సంస్థలు దేశంలోకి వచ్చాయి. విదేశాల్లో సేకరించిన కోట్ల రూపాయల విరాళాలతో గ్రామీణ ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

1950-67 మధ్య రాయలసీమ జిల్లాల్లో గ్రామీణ పేదలు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో భూమి కోసం, సామాజిక న్యాయం కోసం పెద్ద పోరాటాలు చేశారు. భూస్వామ్య వ్యవస్థ దుర్మార్గాలను తీవ్రంగా ప్రతిఘటించారు. వేల ఎకరాల భూములను సాధించుకున్నారు. ఈ పోరాటాలకు అనంతపురం జిల్లా ఒక ముఖ్య కేంద్రంగా వుండేది. ఆ తర్వాత కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన చీలిక నేపథ్యంలో ఆర్‌డిటి సేవా సంస్థ 1967-69 మధ్య జిల్లాలోకి వచ్చింది. స్పెయిన్‌కు చెందిన విన్సెంట్ ఫెర్రర్, ఆయన భార్య అన్నె ఫెర్రర్ ఆ నాడు జిల్లాలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితుల్లో రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్టు పేరుతో గంజి కేంద్రాలను మొదట ప్రారంభించారు. అప్పటికే ప్రభుత్వం నిర్వహిస్తున్న గంజి కేంద్రాల్లో జరుగుతున్న అక్రమాలను అడ్డుకునేందుకు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు వాలంటీర్లుగా పనిచేశారు. ఇలాంటి వారిపై తప్పుడు కేసులు పెట్టి జైళ్లలో నిర్బంధించారు. ఈ స్థితిలో ఆర్‌డిటి సంస్థ ఉచితంగా, నాణ్యమైన గంజిని ప్రజలకు అందించి ఆదరణ పొందింది. క్రమంగా జిల్లాలోని గ్రామీణ పేదలు ముఖ్యంగా దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల్లోని వృత్తిదారులను లక్ష్యంగా పెట్టుకుని విభిన్న రూపాల్లో ఆర్‌డిటి సేవా కార్యక్రమాలను చేపట్టింది. జిల్లాలో అనేక స్వచ్ఛంద సేవా సంస్థలు పనిచేసినా ఆర్‌డిటి పొందినంత విశ్వసనీయత, పేదల ఆదరణ ఇతర ఏ సంస్థలూ పొందలేక పోయాయి. దానికి కారణం విన్సెంట్ ఫెర్రర్ వ్యక్తిత్వం, పట్టుదల, దూరదృష్టి, పేదల పట్ల ఆయన అంకిత స్వభావం.

విస్తరించిన ఆర్‌డిటి సేవలు

ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో 3896 గ్రామల్లో 4,51,200 కుటుంబాలకు వివిధ రకాల సేవలను ఆర్‌డిటి అందిస్తుంది. ఈ సంస్థ చేపట్టే పనుల నాణ్యత ప్రజల ఆదరణ పొందడంలో కీలకంగా నిలిచింది. ప్రభుత్వం ఖర్చు చేసే రూపాయిలో 25 పైసలు మాత్రమే ప్రజలకు చేరితే, ఆర్‌డిటి చేసే ప్రతి రూపాయిలో 90 పైసలకు పైగా సద్వినియోగం అవుతుందని ప్రజలు నమ్ముతున్నారు. అనంతపురం జిల్లాలో ఆర్‌డిటి సంవత్సరానికి రూ.345 నుండి రూ.500 కోట్ల బడ్జెట్‌తో కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఇప్పటి వరకు 87,032 ఇళ్ళను పేదలకు నిర్మించారు. 1,25,000 మంది విద్యార్థులకు చదువు నేర్పించారు. 8,19,835 మందికి వీరి ఆసుపత్రుల్లో సేవలు అందించారు. బత్తలపల్లి, కల్యాణదుర్గం, కణేకల్లులో వీరు అందిస్తున్న వైద్య సేవలు పేదలకు పెద్ద ఉపశమనంగా వున్నాయి. ఈ ఆసుపత్రుల్లో చేరిన 87 శాతం గర్భిణీలకు సాధారణ కాన్పులు అవుతున్నాయి. ఎయిడ్స్ బాధిత కుటుంబాలకు మెరుగైన సేవలు అందించి, వారి పిల్లల సంరక్షణ బాధ్యతలు తీసుకున్నారు. కరోనా సమయంలో విశిష్టమైన వైద్య సేవలు అందించారు. బాలికలకు 40 వేల సైకిళ్లను పంపిణీ చేశారు. అనంతపురంలో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీకి కోటి రూపాయలు విరాళం ఇచ్చారు. వందలాది దళిత కాలనీలలో కమ్యూనిటీ హాళ్లు, పాఠశాలలు నిర్మించారు. 1,64,06,477 మొక్కలను, మరో కోటికి పైగా పండ్ల మొక్కలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. 25,355 మంది వికలాంగులకు సహాయం అందించారు. భూగర్భ జలాలను పెంచడం కోసం వాటర్‌షెడ్లను నిర్మించారు. 14 వేల మంది క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారు. మూగ, చెవిటి పిల్లలకు ఒక ప్రత్యేక పాఠశాలను నడుపుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా కర్నూలుతో పాటు, గుజరాత్, మహారాష్ట్ర, కేరళ లో అనేక సేవా కార్యక్రమాలను చేపట్టారు.

పాలకుల దృష్టి-సేవా సంస్థలు

మన దేశంలో విదేశీ విరాళాలతో నిర్వహిస్తున్న ఆర్‌డిటి లాంటి అనేక స్వచ్ఛంద సంస్థలు చాలా సుదీర్ఘ కాలం నుండి పనిచేస్తున్నాయి. ప్రజా ఉద్యమాల ఉధృతిని తగ్గించుకోవడానికి పాలకులు వీటిని ప్రోత్సహించారు. క్రమంగా సేవా సంస్థలే కాకుండా హక్కుల సంస్థలూ ఏర్పడ్డాయి. సమస్యలపై వీరు ప్రశ్నించడం పెరిగేకొద్దీ వీటిని నియంత్రించే చర్యలను పాలకులు అనుసరిస్తూ వచ్చారు. 1857 వరకు సంఘ సంస్కరణోద్యమాలను బలపరచిన బ్రిటీష్ పాలకులు దేశీయ రాజకుటుంబాలు, భూస్వామ్య వర్గాల నుండి వ్యతిరేకత రావడంతో వీటిని అడ్డుకున్నారు. 1860 సొసైటీ రిజిస్ట్రేషన్ చట్టం, 1882 ఇండియన్ ట్రస్టు చట్టాలకు 1976 ఎమర్జెన్సీ సమయంలో నాటి ప్రధాని ఇందిరా గాంధీ అనేక సవరణలు చేసి ఈ సంస్థలను నియంత్రించింది. చిదంబరం హోంమంత్రిగా వున్న యుపిఎ-2 సమయంలో విదేశీ నిధులు పొందుతున్న సంస్థలపై అనేక నిబంధనలు విధించారు. బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత మత ప్రాతిపదిక మీద ఈ సంస్థలపై ఆంక్షలు పెరిగాయి. మోడీ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే దేశంలోని 10,171 సంస్థలకు విదేశీ నిధులను అడ్డుకున్నారు. అనేక సంస్థలను నిషేధించారు. ఈ సంస్థలకు నిధులు ఇచ్చే విదేశీ సంస్థలను బ్లాక్ లిస్టులో పెడుతున్నారు. ఇదంతా దేశ భద్రత కోసం, మత మార్పిడుల నివారణ కోసం అని పైకి చెబుతున్నారు. మరోవైపు ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి లాంటి హిందూత్వ మత సంస్థలు మాత్రం ఈ పదకొండు సంవత్సరాల్లో భారీగా విదేశీ నిధులను పోగేసుకుని మతతత్వ భావాల వ్యాప్తికి, ఎన్నికల లబ్ధికి విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నారు. స్వచ్ఛంద సేవ పేరుతో ఏ సంస్థ అయినా ఆర్థిక అక్రమాలకు, అవినీతికి పాల్పడినా, భారత రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకోవలసిందే. అయితే సంస్థ నిర్వాహకుల మతాన్ని బట్టి సంస్థలను అడ్డుకోవడం పాలకుల మతతత్వంలో భాగమే అని గుర్తించాలి.

'పి4' విధానం ద్వారా పేదరికాన్ని నివారిస్తామని చెప్పే రాష్ట్ర ప్రభుత్వం, సుదీర్ఘ కాలం సేవలు అందిస్తూ ప్రజావిశ్వాసాన్ని పొందిన ఆర్‌డిటి ని కాపాడుకోకుండా కొత్త దాతలను, సేవా సంస్థలను ఎలా ఆకర్షించగలదు? విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయాభివృద్ధి, మహిళా సాధికారత, సామాజిక న్యాయం సాధించేందుకు గత ఏడు సంవత్సరాల క్రితం బిజెపి ప్రకటించిన రాయలసీమ డిక్లరేషన్ ఈ నాటికీ అమలుకు నోచుకోలేదు. తాము చేయక, మరొకరిని చేయనివ్వకపోతే ప్రజలు సహించరని పాలకులు గుర్తించాలి.



కవిత్వం



ఆకాంక్ష

జరిగింది మహా దారుణమే.
మనిషన్నవాడు
ఖండించాల్సిన దుశ్చర్యే.
అయితే సమస్యకు పరిష్కారం
యుద్ధమా?
అదేమీ చిన్న విషయం కాదు
దాని పర్యవసానాలు తెలుసుగా!
అశాంతి, విభేదాలు, విద్వేషాలు
అంతర్యుద్ధాలు...
ఇరువైపులా ఎన్నో నష్టాలు,
సమస్య మరింత జటిలం.
ఓ మనిషీ ఆలోచించు!
మనలో మనం గొడవలుపడే
పరిస్థితిని
విచక్షణతో తిప్పికొట్టు.
స్థైర్యం కోల్పోక మంచి
నిర్ణయంతో
మనిషిని మనిషిగా బతికించు.
ద్వేషాన్ని ప్రేమతో జయించు.
నా దేశమంటే
నాకు ఎనలేని ప్రేమ.
నా దేశమెన్నటికీ సుభిక్షంగా
ఉండాలన్నదే నా ఆకాంక్ష.

- వేమూరి శ్రీనివాస్
ఆంధ్రప్రదేశ్ అధికార
భాషాసంఘం వారి
గిడుగు పురస్కార గ్రహీత

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps@gmail.com

స్వాధీనతా ప్రకటన

ఏదైతే, దిగువసంతకందారు అయిన ఆర్సిల్-ట్రస్ట్-2024-001 ("ఆర్సిల్") యొక్క ట్రస్టీగా వ్యవహరిస్తున్న **అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 (2002 యొక్క 54) ("సదరు యాక్ట్") క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("సదరు యాక్ట్") యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని 23 ఏప్రిల్, 2019న డిమాండ్ నోటీసును జారీ చేయడమైనది. పిలువబడిన రుణగ్రహీతలు : మెసెర్స్.శ్రీ హసిత ఫిషరీస్ ప్రైవేట్ లిమిటెడ్, డో.నం.67-1-1, 5వ అంతస్తు, పెంట్‌హౌస్, వినాయక్ విహార్ అపార్టుమెంట్స్, ఎన్ఎస్ఎమ్ స్కూల్ ప్రక్కన, పటమట, విజయవాడ-520010, ఆంధ్రప్రదేశ్. శ్రీ. పొట్లూరి శ్రీనివాస్, డో.నం.67-1-1, 5వ అంతస్తు, పెంట్‌హౌస్, వినాయక్ విహార్ అపార్టుమెంట్స్, ఎన్ఎస్ఎమ్ స్కూల్ ప్రక్కన, పటమట, విజయవాడ-520010, ఆంధ్రప్రదేశ్. శ్రీమతి. పొట్లూరి సుహిత, డో.నం.67-1-1, 5వ అంతస్తు, పెంట్‌హౌస్, వినాయక్ విహార్ అపార్టుమెంట్స్, ఎన్ఎస్ఎమ్ స్కూల్ ప్రక్కన, పటమట, విజయవాడ-520010, ఆంధ్రప్రదేశ్, హామీదారులు మరియు తనఖాదారులు కాలమ్‌ను దిగువ పట్టికలో పేర్కొనబడిన లోన్ ఖాతా నంబర్ల వివరాల క్రింద మొత్తాన్ని తిరిగి చెల్లించమని కోరుతూ డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.
రుణగ్రహీత/హామీదారులు/తనఖాదారులు పేర్కొన్న మొత్తాలను చెల్లించడంలో విఫలమైనందున, క్రింద పేర్కొన్న తేదీలలో "ఎక్కడ ఉందో అది" మరియు "ఏది ఏమైనా ప్రాతిపదికన" రుణగ్రహీత/హామీదారులు/తనఖాదారులు మరియు మరింత ప్రత్యేకంగా సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (4) క్రింద అతను/ఆమెకు అందించిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద వివరించిన స్థిరాస్తిని దిగువసంతకందారులు స్వాధీనం చేసుకోవడమైనది.

రుణగ్రహీత హామీదారుల పేరు	డిమాండ్ నోటీసు	స్వాధీనతా తేది
మెసెర్స్.శ్రీ హసిత ఫిషరీస్ ప్రైవేట్ లిమిటెడ్, నమోదిత కార్యాలయం : డో.నం.67-1-1, 5వ అంతస్తు, పెంట్‌హౌస్, వినాయక విహార్ అపార్టుమెంట్స్, ఎన్ఎస్ఎమ్ స్కూల్ ప్రక్కన, పటమట, విజయవాడ-520010, ఆంధ్రప్రదేశ్. హామీదారులు : శ్రీ.పొట్లూరి శ్రీనివాస్, 2. శ్రీమతి. పొట్లూరి సుహిత	23 ఏప్రిల్, 2019 నాటికి రూ.7,61,51,058/- (ఏడు కోట్ల అరవై ఒక్క లక్షల యాభై ఒక్క వేల యాభై ఎనిమిది రూపాయలు మాత్రమే) క్యాష్ క్రెడిట్ సౌకర్యం విషయంలో 24.04.2019 నుండి మొత్తంపై వచ్చే వడ్డీతో పాటు యాదృచ్ఛిక ఖర్చులు, ఖర్చులు, ఛార్జీలు మొదలైనవి. నోటీసు తేది : 23 ఏప్రిల్, 2019	29/04/2025

ఆస్తి వివరణ : షెడ్యూల్ -ఎ :
ఎ.పి., విజయవాడ, పటమట, వెంకటేశ్వర స్వామి గుడి ప్రక్కన రోడ్డు, ఎన్ఎస్ఎమ్ స్కూల్ రోడ్డు, డో.నం.67-1-1, పటమట యొక్క ఆర్.ఎస్.నం.64/6 మరియు 64/7, పటమట వద్ద ఉన్న రెసిడెన్షియల్ సైట్ తో విస్తీర్ణం 1023 చ.గ.లు. మరియు **హద్దులు : తూర్పు** : [illegible]

[illegible]

ప్రదేశం : హైదరాబాద్
తేది : 03.05.2025

సం/- అధీకృత అధికారి
అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్
ఆర్సిల్-ట్రస్ట్-2024-001 యొక్క ట్రస్టీ

అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్
Arcil Premier ARC
నమోదిత కార్యాలయం : ది రూబీ, 10వ అంతస్తు, 29, సేనాపతి బాపట్ మార్గ్, దాదర్ (వెస్ట్), ముంబాయి-400028 టెలి: + 91 2266581300 www.arcil.co.in
శాఖ కార్యాలయం : 207, భువన టవర్స్, ఎస్.డి.రోడ్డు, పాట్నీ, సికింద్రాబాద్-03.
CIN-U65999MH2002PLC134884

భారత వృద్ధికి యుఎస్ టారిఫ్‌ల దెబ్బ

- ఈ ఏడాది వృద్ధి 6.3 శాతమే..!
- ఎస్అండ్‌పి గ్లోబల్ రేటింగ్స్ అంచనా



న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థపై అమెరికా టారిఫ్‌లు ప్రతికూల ప్రభావం చూపనున్నాయని ఎస్అండ్‌పి గ్లోబల్ రేటింగ్స్ తెలిపింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జిడిపి అంచనాలను 20 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.3 శాతానికి పరిమితం చేసింది. వచ్చే 2026-27లోనూ వృద్ధి 6.5 శాతంగానే ఉండొచ్చని విశ్లేషించింది. ఇంత క్రితం ఈ అంచనాలు వరుసగా 6.5 శాతం, 6.7 శాతంగా ఉన్నాయి. ఇటీవల ఆర్‌బిఐ కూడా 2025-26లో భారత వృద్ధి రేటు 6.7 శాతం నుంచి 6.5 శాతానికి కోత పెట్టింది. అమెరికా విధానాలతో నెలకొన్న వాణిజ్య అనిశ్చితుల నేపథ్యంలో జిడిపి అంచనాలను తగ్గిస్తున్నట్లు తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రపంచ దేశాలపై భారీగా సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఇది తీవ్ర మందగమనానికి దారి తీస్తుందని నిపుణులు హెచ్చరించడం, ట్రంప్ విధానాలపై సొంత దేశంలోనే తీవ్ర నిరసనలు నెలకొనడంతో పెంచిన టారిఫ్‌లను 90 రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

భారత్ సహా ఇతర దేశాల వృద్ధి అంచనాలను ఎస్అండ్‌పి వెల్లడించింది. అమెరికా, కెనడా, యూరప్, జర్మనీ, ఇటలీ, చైనా, జపాన్, బ్రిటన్ దేశాలపై టారిఫ్‌ల ప్రభావం ఉంటుందని పేర్కొంది. ఈ ఏడాది అమెరికా జిడిపి 60 బేసిస్ పాయింట్లు (0.60 శాతం) తగ్గి 1.5 శాతానికే పరిమితం కానుందని పేర్కొంది. వచ్చే ఏడాది 1.7 శాతంగా ఉండొచ్చని తెలిపింది. "అమెరికా దిగుమతి సుంకాల పెరుగుదల, వాణిజ్య ప్రతీకారం, కొనసాగుతున్న రాయితీలు, తదనంతరం మార్కెట్‌ల అల్లకల్లోలం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఆర్థిక వ్యవస్థలను ఆందోళనకు గురి చేస్తోన్నాయని ఎస్అండ్‌పి గ్లోబల్ రేటింగ్స్ గ్లోబల్ చీఫ్, ఎకనామిస్ట్ పాల్ గ్రుయెన్ వాల్డ్ పేర్కొన్నారు. అన్ని ప్రాంతాలలో వృద్ధి తగ్గుదలకు ప్రమాదం పెరిగినప్పటికీ, అలాగని భారీ మందగమనం ఉంటుందని భావించడం లేదన్నారు. అదే విధంగా ఈ సమయంలో అమెరికా మాంద్యాన్ని ఊహించలేమన్నారు.

భారత వృద్ధి రేటు అంచనాలకు ఇటీవల ప్రపంచ బ్యాంక్ కోత పెట్టింది. దేశంలో మూలధన వ్యయాల తగ్గుదలకు తోడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో బలహీనత, అమెరికా విధాన అనిశ్చితి నేపథ్యంలో భారత జిడిపి 0.4 శాతం తగ్గి 6.3 శాతానికి పరిమితం కావొచ్చని విశ్లేషించింది. ఇంతక్రితం ఈ అంచనా 6.7 శాతంగా ఉంది. భారత్‌లో ప్రయివేటు పెట్టుబడులు, ప్రభుత్వ మూలధన వ్యయాలు నెమ్మదించడం వల్ల గడిచిన 2024-25లోనూ వృద్ధి నిరాశపర్చిందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. ప్రస్తుత 2025-26లో వృద్ధి 6.2 శాతానికి పరిమితం కావొచ్చని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ అంచనా వేసింది. ఇంతక్రితం 6.5 శాతం అంచనాతో పోల్చితే 0.3 శాతం తగ్గనుందని ఐఎంఎఫ్ పేర్కొంది.

సమాజ మార్గదర్శకానికి వృద్ధులు చాలా అవసరం : రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ : సమాజానికి మార్గదర్శకం చేయడానికి వృద్ధులు చాలా అవసరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. జ్ఞానం, సంప్రదాయానికి వృద్ధులు మూల స్థంభాలని, దేశంలో వృద్ధుల గౌరవం, ఆనందం, శ్రేయస్సును కాపాడటం అందరి బాధ్యతని రాష్ట్రపతి స్పష్టం చేశారు. శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన 'ఏజింగ్ విత్ డిగ్నిటీ' కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందించడంలోనూ, భవిష్యత్ తరాలకు మార్గనిర్దేశం చేయడంలోనూ వృద్ధుల పాత్ర అమూల్యమైనదని తెలిపారు. తల్లిదండ్రులు చెబితే వినని చిన్నారులు, తమ తాతాఅవ్వలు చెబితే సంతోషంగా అంగీకరిస్తారని రాష్ట్రపతి తెలిపారు. కుటుంబానికి మానసిక మద్దతుగా వృద్ధులు నిలుస్తారని ఆమె చెప్పారు.

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
MANAPPURAM HOME FINANCE LTD.
గతంలో మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
సిఐఎన్: U65923K12010PIC039179, యూనిట్ నం.301-315, 3వ అంతస్తు, ఎ వింగ్, కనకీయ వాల్ స్ట్రీట్, అంధేరి-కుర్లా రోడ్డు, అంధేరి ఈస్ట్, ముంబై-400093.

డిమాండ్ నోటీసు

ఏదైతే, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇకపై "ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్"గా సూచించబడుతుంది) యొక్క అధీకృత అధికారి, IV/470A(పాతది)W/638A(కొత్తది) మణప్పురం హౌస్ వలపాడ్ త్రిస్సూర్, కేరళ 680567 వద్ద మా నమోదిత కార్యాలయం ఉంది మరియు వివిధ ప్రదేశాలలో దీని శాఖ కార్యాలయాలు ఉన్నాయి, కంపెనీల యాక్ట్ 1956 క్రింద నమోదు చేయబడిన కంపెనీ మరియు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 (ఇకపై యాక్ట్ గా సూచించబడుతుంది) యొక్క సెక్షన్ 2 యొక్క సబ్ సెక్షన్ (1) యొక్క క్లాజ్ (ఎమ్) యొక్క సబ్ క్లాజ్ (4) అర్థం ఆర్థిక సంస్థ నం.ఎస్.ఓ.3466 (ఇ) తో చదువుతూ నిర్మాణం మరియు/లేదా నివాస యూనిట్ల కొనుగోలు కోసం అడ్వాన్సింగ్ లోన్‌ల వ్యాపారాన్ని నిర్వహిస్తోంది మరియు దిగువ కాలమ్ నం. 2లో పేర్కొన్న విధంగా రుణగ్రహీత / సహ రుణగ్రహీతలు ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ నుండి రుణం పొందినట్లు పేర్కొన్న చార్ట్ తేది 18 డిసెంబర్, 2015న గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఆర్థిక సేవల విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ ద్వారా జారీ చేయబడింది మరియు ఏదైతే సెక్యూర్డ్ క్రెడిటార్ గా ఉన్న ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ సర్ఫేసీ యాక్ట్ క్రింద, సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 2తో చదువుతూ సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద అతనికి అందించిన అధికారాలను వినియోగించుకుంటూ నోటీసు తేది నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తంతో పాటు దానిపై తదుపరి వడ్డీతో చెల్లించమని రుణగ్రహీత/సహ రుణగ్రహీతలను పిలుస్తూ డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది. అయితే వివిధ కారణాల వల్ల కొందరికి నోటీసులు అందజేయలేదు. దానితో పాటు క్రింద పేర్కొనబడిన రుణగ్రహీతల సమాచారం యొక్క ప్రయోజనాల కొరకు ఈ పబ్లిక్ నోటీసు ద్వారా పేర్కొన్న రుణగ్రహీతలకు తెలియజేయబడుతోంది.

క్ర సం	రుణగ్రహీత/సహ-రుణగ్రహీతల పేరు/ఎల్ఎఎన్/శాఖ	సృష్టించబడిన వడ్డీ విషయంలో సెక్యూర్డ్ అస్సెట్ వివరణ	ఎన్‌పిఎ తేది	నోటీసు పంపిన తేది మరియు బకాయి మొత్తం
1	జుజ్జవరపు మేరీ నక్షత్రం, జుజ్జవరపు రుబీన్/ MHL00310015479/ విజయవాడ	మూల్యాంకనం నం.420, ఆర్.ఎస్.నం.162/5, డో.నం.2/420 పరిధి 114 చ.గ.లు. కొత్తూరు తాడేపల్లి గ్రామం, విజయవాడ రూరల్ మండలం, విజయవాడ (రూరల్), పి.ఓ. తాడేపల్లి, ఎన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్-520012. తూర్పు : బందెల ఏసు ఆస్తి, పడమర : నేషనల్ హైవే, దక్షినం : జుజ్జవరపు రాణి ఆస్తి, ఉత్తరం : యార్లగడ్డ వేణు ఆస్తి.	10-04-2025	15-04-2025 & Rs.644130/-
2	నాయని ఐశ్వర్య, నయిని శ్రీను, నయని శివ శ్రీను/ NHL003100 / విజయవాడ	మూల్యాంకనం నం.905, ఆర్.ఎస్.నం.107/3, డో.నం.6-22 విస్తీర్ణం 121 చ.గ.లు. ఆర్‌సిసి రూఫ్డ్ ఇల్లు, మంతాడ గ్రామం, మంతాడ గ్రామ పంచాయతీ ఏరియా, పమిడిముక్కల మండలం, ఆంగన్‌వాడి స్కూల్, పమిడిముక్కల, పి.ఓ. మంతాడ, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్ : 521256. తూర్పు : కలపరెడ్డి రాము ఆస్తి, పడమర : కలపరెడ్డి రామకోటయ్య ఆస్తి, దక్షిణం : పంచాయతీ రోడ్డు, ఉత్తరం : పిట్ట చిన్న ఆదినారాయణ ఆస్తి.	10-04-2025	15-04-2025 & Rs.532525/-

గమనిక, ఈ నోటీసును ప్రచురించిన 60 రోజులలోపు సంబంధిత రుణగ్రహీత / సహ-రుణగ్రహీతకు వ్యతిరేకంగా ఇక్కడ చూపిన మొత్తం బకాయి మొత్తాన్ని చెల్లించవలసిందిగా వారిని పిలుస్తూ పైన పేర్కొన్న విధంగా రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలకు నోటీసు ఇవ్వడమైనది. సంబంధిత రుణగ్రహీత/సహ-రుణగ్రహీత తదుపరి వడ్డీతో పాటు మొత్తం బకాయి మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైతే, పైన వివరించిన విధంగా చట్టం మరియు ఇక్కడ రూపొందించిన నియమాల క్రింద సూచించబడిన ఇతర పద్ధతులలో నోటీసు సర్వీస్ కొరకు ఆస్తులపై సెక్యూరిటీ ఇంట్రస్ట్ అమలు చేయడం కోసం ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ సెక్షన్13(4) ని తీసుకోవలసి ఉంటుంది. సర్ఫాసీ చట్టంలోని సెక్షన్ 13(8)లో వివరించిన విధంగా విక్రయం, పబ్లిక్ వేలం లేదా ప్రైవేట్ ఒప్పందం ద్వారా బదిలీ చేయడానికి నోటీసును ప్రచురించే తేదీకి ముందు ఏ సమయంలోనైనా ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ ద్వారా అయ్యే ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులతో పాటు చెల్లించాల్సిన మొత్తం మొత్తాన్ని చెల్లించిన తర్వాత పేర్కొన్న తనఖా రీడీమ్ చేయబడుతుందని మీరు గమనించాలి. సర్ఫాసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13 (13) ప్రకారం, మీరు సెక్యూర్డ్ అసెట్స్‌ను ఏ పద్ధతిలోనైనా అమ్మకం, లీజు లేదా మరే ఇతర పద్ధతిలో బదిలీ చేయకుండా మరియు/లేదా [illegible]

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్, తేది: 03.05.2025 — సం/- అధీకృత అధికారి, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

జాడలేని రూ.6,266 కోట్లు..!

రెండేళ్లయిన ఆర్‌బిఐకి చేరని రూ.2,000 నోట్లు

న్యూఢిల్లీ : పెద్ద నోట్ల రద్దు పేరుతో రాత్రికి రాత్రి రూ.500, రూ.1,000 నోట్లను పూర్తిగా రద్దు చేసి సామాన్యుడిని విలవిలలాడేలా చేసిన చేసిన మోడీ సర్కార్.. వెనక్కి తీసుకున్న రూ.2,000 నోట్ల మార్పిడికి మాత్రం ఏళ్ల తరబడి గడువు ఇస్తోంది. బడాబాబులు ఉపయోగించే ఈ అతిపెద్ద నోటు ఇంకా చెలామణిలో ఉందని రిజర్వ్ బ్యాంక్ పదే పదే ప్రకటించడం విశేషం. 2023 మే 19న రూ.2000 నోట్లను ఆర్‌బిఐ వెనక్కి తీసుకుంది. ఆ ప్రకటన నాటికి రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2,000 నోట్లు చెలామణిలో ఉన్నాయి. అయితే 2025 ఏప్రిల్ 30 నాటికి ఇంకా రూ.6,266 కోట్ల విలువైన రూ.2,000 నోట్లు మార్కెట్‌లో చెలామణిలో ఉన్నాయని శుక్రవారం ఆర్‌బిఐ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ పెద్ద నోట్లలో 98.24 శాతం తిరిగి వచ్చాయని ఆర్‌బిఐ తెలిపింది. ఇప్పటికీ దేశంలోని 19 ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయాల్లో మార్పిడికి స్వీకరిస్తున్నట్లు ఆర్‌బిఐ పేర్కొంది.

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్
వినియోగదారుల వ్యవహారాల, ఆహారం & ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ
(వినియోగదారుల వ్యవహారాల శాఖ), భారత ప్రభుత్వం
మనక్ భవన్, 9 బహదూర్ షా జాఫర్ మార్గ్, న్యూఢిల్లీ-110002
सत्यमेव जयते

సూచనాత్మక ప్రకటన

సైంటిస్ట్-బి పోస్ట్ కోసం భర్తీ
ప్రకటన నెం.02(ఎస్ఇబి)/2025/హెచ్ఆర్‌డి

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్), వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజాపంపిణీమంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం పరిధిలోని చట్టబద్ధమైన సంస్థ. భారతదేశ జాతీయ ప్రమాణాల సంస్థ. ఇది దేశంలో స్టాండర్డైజేషన్, ప్రోడక్ట్ అండ్ సిస్టమ్ సర్టిఫికేషన్, బంగార/వెండి ఆభరణాల హాల్‌మార్కింగ్, లాబొరేటరీ టెస్టింగ్ మొదలైన రంగంలో కార్యకలాపాలను చేపడుతుంది. అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణీకరణ మరియు ధృవీకరణకు కూడా బిఐఎస్ బాధ్యత వహిస్తుంది.

బిఐఎస్, నిర్దిష్ట విభాగాలు మరియు వర్గాలలో సైంటిస్ట్-'బి' పదవికి ప్రకాశవంతమైన, యువ డైనమిక్ వ్యక్తులకు అద్భుతమైన కెరీర్ అవకాశాలను అందిస్తుంది. ఈ పోస్టులు ఏడవ కేంద్ర వేతన సంఘం ప్రకారం పేలెవల్ 10లో ఉన్నాయి మరియు వర్తించే విధంగా అలవెన్సులు కూడా ఉన్నాయి. ఢిల్లీలో చేరే సమయంలో స్థూల జీతాలు ప్రస్తుతం సుమారు రూ.1,14,945/-గా ఉంటాయి.

1. పోస్టుల సంఖ్య: క్రింద ఇవ్వబడిన వివరాల ప్రకారం వివిధ విభాగాలలో మొత్తం ఖాళీల సంఖ్య **20**:

విభాగం	ఖాళీల సంఖ్య (బ్యాక్‌లాగ్ ఖాళీలతో సహా).						పిడబ్ల్యుబిడి కోసం హారిజెంటల్ రిజర్వేషన్ (బ్యాక్‌లాగ్ ఖాళీలతో సహా)
	మొత్తం	UR	OBC	SC	ST	EWS	
కెమిస్ట్రీ	02	01	01	-	-	-	-
సివిల్ ఇంజనీరింగ్	08	05	-	01	01	01	01VI
కంప్యూటర్ ఇంజనీరింగ్	04	03	-	01	-	-	01 ID & MI/MD
ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్	02	01	-	01	-	-	-
ఎలక్ట్రానిక్స్ మరియు టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్	02	02	-	-	-	-	-
ఎన్విరాన్మెంట్ ఇంజనీరింగ్	02	02	-	-	-	-	-
మొత్తం	20	14	01	03	01	01	02

సంక్షిప్తాలు:
యుఆర్-రిజర్వేషన్ లేనివారు; ఓబిసి- ఇతర వెనుకబడిన తరగతులు; ఎస్సీ- షెడ్యూల్డ్ కులాలు: ఎస్టీ- షెడ్యూల్డ్ తెగలు; ఇడబ్ల్యుఎస్- ఆర్థికంగా బలహీనమైన విభాగాలు; పిడబ్ల్యుబిడి-బెంచ్‌మార్క్ వైకల్యం ఉన్న వ్యక్తులు; ఐడి& ఎంఐ-ఆటిజం / మేధో వైకల్యం / నిర్దిష్ట అభ్యాస వైకల్యం / మానసిక అనారోగ్యం; ఎండి- బహుళ వైకల్యం; విఐ- దృష్టి లోపం

2. అవసరమైన క్వాలిఫికేషన్స్:

విభాగం	తప్పనిసరి ముఖ్యమైన అర్హత	సంబంధిత గేట్ పేపర్ మరియు దాని కోడ్ సివిల్
సివిల్ ఇంజనీరింగ్	1) ఇంజనీరింగ్ లేదా టెక్నాలజీలో బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమానం మొత్తం అరవై శాతం మార్కులతో (షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగలకు యాభై శాతం)రి 2) 2023/2024/2025 'చెల్లుబాటు అయ్యే గేట్‌లి స్కోరు కలిగి ఉండాలి.	ఇంజనీరింగ్ (సిఇ)
కంప్యూటర్ ఇంజనీరింగ్		కంప్యూటర్ సైన్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (సిఎస్)
ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్		ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ (ఇఇ)
ఎలక్ట్రానిక్స్ మరియు టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్		ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసి)
ఎన్విరాన్మెంట్ ఇంజనీరింగ్		ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ &ఇంజనీరింగ్ (ఈఎస్)
కెమిస్ట్రీ	1) సహజ శాస్త్రాలలో మాస్టర్స్ డిగ్రీ లేదా సమానమైన (కెమిస్ట్రీ విభాగంలో మాత్రమే) మొత్తం అరవై శాతం మార్కులతో (షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగలకు యాభై శాతం) 2) 2023/2024/2025 'చెల్లుబాటు అయ్యే గేట్‌లి స్కోరు కలిగి ఉండాలి.	కెమిస్ట్రీ (సివై)

*గేట్- గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్

3) వయోపరిమితి:
అభ్యర్థుల అర్హత కోసం గరిష్ట వయోపరిమితి దరఖాస్తు ముగింపు తేదీ నాటికి 30 సంవత్సరాలు. ఎస్సీ, ఎస్టీ, ఓబిసి బెంచ్‌మార్క్ వైకల్యాలున్న వ్యక్తులు, మాజీ సైనికులు మరియు బిఐఎస్ యొక్క డిపార్ట్‌మెంటల్ అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపు వర్తించే నిబంధనల ప్రకారం ఉంటుంది.

4) వివరణాత్మక ప్రకటన బిఐఎస్ వెబ్‌సైట్: www.bis.gov.inలో అందుబాటులో ఉంది. అభ్యర్థులు **03.05.2025** నుండి **23.05.2025** (చివరి తేదీ) వరకు బిఐఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను సమర్పించడానికి ఇతర మార్గాలు/విధానం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబడవు.

5) దరఖాస్తు రుసుము: లేదు.

ఎటువంటి కారణాలు చూపకుండానే ప్రక్రియను సవరించే/రీషెడ్యూల్ చేసే/రద్దు చేసే/సస్పెండ్ చేసే హక్కు బిఐఎస్‌కు ఉంది. బిఐఎస్ నిర్ణయం అంతిమమైనది మరియు ఈ విషయంలో ఎటువంటి అప్పీల్‌ను స్వీకరించరు.

తేదీ: 03.05.2025
ప్రదేశం: న్యూఢిల్లీ

హెడ్ (హెచ్ఆర్‌డి)
బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్

CBC 08103/12/0003/2526

IN THE DEBT RECOVERY TRIBUNAL, VISAKHAPATNAM

Ground & 1st Floor, 31-31-21, Sai Baba Street, Narayana Bhawan, Dabagardens, Visakhapatnam-530020
Case No.: O.A. 150/2025
Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules,
Between:
A Body corporate Constituted under The Small Industries Development Bank of India Act,1989 having its head office at SIDBI Tower, 15, Ashok Marg, Lucknow-226001. Having its Specialised Asset Recovery Branch (SARB) at 756L, Overseas Towers, Anna salai, Chennai-600002. Email sarb chennai@sidbi in Represented by its Assistant General Manager Shri Raman Sukumar .
Branch Office; Door No, 42-1-45/1/1, jeevan Samrudhi, 3rd Floor, LIC New Investment Building, Thikkana Road, Allipuram, Visakhapatnam-530004, Andhra Pradesh.
And
M/s Sainor Life Science Private Limited and others
To,
1. M/s Sainor Life Science Private Limited having registered office at 7-2-1813/5/A/1 Sanath Nagar, Hyderabad, Telangana-500018.
2. Smt. Kalagara Sridevi W/o. Shri Venkata Srinivasa Rao Hindu, aged about 61 years, residing at resident of Villa No.47, Green City, Vadlapudi, Visakhapatnam, Andhra Pradesh-530026. (PAN No.BIJPS181N), (Aadhaar No. 2505 4264 6096)
3. Shri Venkata Srinivasa Rao Sura S/o. S.Suryanaraya, Hindu aged about 60 years residing at resident of Villa No.47, Green City, Vadlapudi, Visakhapatnam, Andhra Pradesh-530026. (PAN No. AFVPS5892L) (Aadhaar No.3275 1468 5304)
4. Shri Rajeswara Rao Hanumanthu S/o. Shri Ranganayakulu Hanumanthu Hindu aged about 76 years residing at resident at D.No.59A, 8-5//7-4, Plot No.93, Maruthi Coop Colony, Patamata, Vijayawada, Andhra Pradesh-520008 (PAN No.AASPH0216R), (Aadhaar No.4338 6899 8218)

SUMMONS TO THE DEFENDANTS BY THE WAY OF PAPER PUBLICATION

WHEREAS, OA/150/2025 to be listed before Hon'ble Presiding Officer/Registrar on **20.05.2025**
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/ notice on the said Application under section 19(4) of the Act, OA-150/2025 filed against you for recovery of debts of (application along with copies of documents etc. annexed) In accordance with Sub-Section (4) of the Sec 19 of the Act you the defendant are directed as under.
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties:
you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to-account for the sale proceeds realised by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
(iv) You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer/Registrar on 2**0.05.2025 at 10:30 A.M**. failing the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this date 25.04.2025

Signature of the officer
Authorised to issue summons

హిందూజా లేలాండ్ ఫైనాన్స్
కార్పొరేట్ ఆఫీస్: 27 ఎ, డెవలప్డ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032. CIN: U65993MH2008PLC384221.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) మరియు 9(1) క్రింద రుణగ్రహీతల స్థిరాస్తి యొక్క తదుపరి అమ్మకపు ప్రకటన

[illegible]

11) ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి తనిఖీ కోసం టెండర్ అందిన చివరి రోజుకు ముందు ఏదైనా పనిరోజులలో ఉ.10:00 నుండి సా.06:00 గంటల మధ్య అధీకృత అధికారి శ్రీ సురేష్ కవాడి (మొబైల్-9177009932) / కలెక్షన్ మేనేజర్ శ్రీ.రిషి రాకేశ్ (మొబైల్-9966399722) వారిని సంప్రదించవచ్చు. ఈ అమ్మకపు నోటీసు వెబ్‌సైట్ (www.hindujaleylandfinance.com) లో కూడా అప్‌లోడ్ చేయబడింది /ప్రచురించబడింది.

తేది: 03-05-2025
ప్రదేశం: విజయవాడ

అధీకృత అధికారి
హిందూజా లేలాండ్ ఫైనాన్స్ లిమిటెడ్

IDFC FIRST Bank
సిఐఎన్ నం.: L65110TN2014PLC097792
నమోదిత కార్యాలయం : కెఆర్ఎం టవర్స్, 7వ అంతస్తు, హ్యారిగ్‌టన్ రోడ్, చెట్‌పట్, చెన్నై-600031.
టెలి : +91 44 4564 4000 ఫ్యాక్స్ : +91 44 4564 4022.

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడుతుంది)

అనుబంధం-IV-A (రూల్ 8 (6) మరియు 9(1) కు నిబంధన చూడండి)

స్థిరాస్తుల విక్రయం కొరకు అమ్మకం నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) మరియు 9(1)కు నిబంధనతో చదువుతూ, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు.

సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు నోటీసు ఇవ్వడమేమనగా కాలం (ii) ప్రకారం సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తనఖా పెట్టబడిన/చార్జ్ చేయబడిన దిగువ వివరించిన స్థిరాస్తిని కాలం (iii) ప్రకారం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది) దీని అధీకృత అధికారి ద్వారా స్వాధీనపరచుకొని, కాలం (i) ప్రకారం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ కి బకాయి ఉన్న రుణగ్రహీత(లు) మరియు సహ రుణగ్రహీత(లు) నుండి బకాయి మొత్తం తిరిగి రాబట్టుకునేందుకు "ఏది ఎక్కడ ఉందో" "ఆ పద్ధతి ప్రకారం" మరియు "ఏది ఏమైనా ఆ పద్ధతి ప్రకారంగా" విక్రయించడం జరుగుతుంది.
అమ్మకం యొక్క వివరణాత్మక షరతులు మరియు నియమముల కొరకు, దయచేసి ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ అందించిన వెబ్‌సైట్ లింకును www.idfcfirstbank.com చూడగలరు.

క్ర.సం.	(i) డిమాండ్ నోటీసు మొత్తం	(ii) ఒప్పందం ఐడి మరియు ఆస్తి సర్వే క్యూఆర్ కోడ్	(iii) రుణగ్రహీత(లు) మరియు సహ రుణగ్రహీత(లు) మరియు హామీదారుల పేరు	(iv) తనఖా ఆస్తి చిరునామా	(v) రిజర్వు ధర మొత్తం	(vi) ఇఎమ్‌డి మొత్తం	(vii) వేలం తేది మరియు మొత్తం	(viii) ఇఎమ్‌డి వేలం తేది మరియు సమయం	(ix) తనిఖీ తేది మరియు సమయం	(x) అధీకృత అధికారి పేరు మరియు సంప్రదించాల్సిన నంబరు
1.	రూ. 1,13,02,236.00/- డిమాండ్ నోటీసు తేది : 06-జూన్-2022	10041423082, 10041625545, 10056621010 & 10041493243	మెసెర్స్. అమరావతి ఫ్యాషన్ షాపింగ్ మాల్, మెసెర్స్.అమరావతి సూపర్ మార్కెట్, ముప్పాళ్ల అనిల్ కుమార్, ముప్పాళ్ల వేణుమాధవి, భావన స్వరూపరాణి మరియు భావన శ్రీనివాసరావు	**అంశం-1 :** ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, దుగ్గిరాల సబ్ రిజిస్ట్రీ, హాఫ్ పేట గ్రామ పంచాయతీ, కొలకూరు గ్రామం యొక్క మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ రెసిడెన్షియల్ స్థలం డో.నం.323 పరిధిలో ఎసి. 0.05 సెంట్లు లేదా 2420 చ.గ.లు. మరియు హద్దులు : తూర్పు : ఉమ్మడి పాసేజ్ మొదలైనవి., పడమర : వల్లూరు శ్రీనివాసరావు స్థలం మొదలైనవి, ఉత్తరం : సోమరోతు వీరయ్య స్థలం మొదలైనవి మరియు దక్షిణం : ఇరిగేషన్ కెనాల్. **అంశం-2 :** ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, దుగ్గిరాల సబ్ రిజిస్ట్రీ, హాఫ్ పేట గ్రామ పంచాయతీ, కొలకూరు గ్రామం యొక్క మొత్తం ముక్క మరియు పార్సిల్ రెసిడెన్షియల్ స్థలం డో.నం.323 పరిధిలో 115.5 చ.గ.లు. (96.57 చ.మీ.లు.) మరియు హద్దులు : తూర్పు : నల్లూరి భిక్షపతి స్థలం, పడమర : సోమరోతు వీరయ్య స్థలం, ఉత్తరం : గుంటూరు రోడ్డు మరియు దక్షిణం : భావన స్వరూపరాణి స్థలం.	INR 11644791.00/-	INR 1164479.10/-	20-May-2025 11.00 AM to 1.00 PM	19-May-2025 10.00 AM to 5.00 PM	14-May-2025 10:00 AM To 4:00 PM	పేరు : బొడ్డేపల్లి సతీష్, సంప్రదించాల్సిన నం.: 8099412347, పేరు : ఎన్.రాజేందర్, సంప్రదించాల్సిన నం.: 8093772119 / QR Codes of Property Location & Property Images
	రూ. 47,38,578.18/- డిమాండ్ నోటీసు తేది : 17-ఏప్రిల్-2023			**ఆస్తి-2 :** ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, మంగళగిరి డిఓ సబ్ రిజిస్ట్రీ యొక్క ఆర్.ఎస్.నం.256, భవనం మరియు షెడ్ బేరింగ్ డో.నం.7-379 తో పాటు రెసిడెన్షియల్ ఇల్లు మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ పరిధి 145.2 చ.గ.లు. (121.96 చ.మీ.లు.) మరియు హద్దులు : తూర్పు : కటారి సుబ్బారావు ఆస్తి, పడమర : కాళిదాసు ఆస్తి, ఉత్తరం : మున్సిపల్ బజారు మరియు దక్షిణం : మన్నెం తిరుపతమ్మ ఆస్తి.	INR 6642000.00/-	INR 664200.00/-				QR Codes of Property Location & Property Images

నిరాకరణ : పేర్కొన్న నోటీసు స్థిరాస్తిని విక్రయించడం కొరకు మాత్రమే జారీ చేయబడిందని మరియు ప్రస్తుత స్థిరాస్తి వద్ద చరాస్తులు ఏవైనా ఉంటే, ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌కి విక్రయించే హక్కులు లేదని దయచేసి గమనించగలరు.

తేది : 03.05.2025
ప్రదేశం : ఆంధ్రప్రదేశ్

సం/-
అధీకృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది)

3,549 ఆవాసాల్లో తాగునీటి ఎద్దడి

● కరువు మండలాలు, గిరిజన ప్రాంతాల్లోనూ సమస్య తీవ్రం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ప్రస్తుత వేసవి సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 3,549 గ్రామీణ ఆవాసాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ట్యాంకర్లతో అరకొరగా 2,219 ఆవాసాలకే నీటి సరఫరా అవుతోంది. ముఖ్యంగా ప్రభుత్వం గుర్తించిన 52 కరువు మండలాల్లో 1,017 ఆవాసాల్లో, ఇతర ప్రాంతాల్లో మరో 2,537 ఆవాసాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నట్లు సంబంధిత అధికారులు గుర్తించారు. ఈ ఆవాసాల్లో తాగునీటి కోసం గ్రామీణ ప్రాంత ప్రజలకు వెతలు తప్పడం లేదు. ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 469, చిత్తూరు జిల్లాలో 453, అన్నమయ్య జిల్లాలో 421, తిరుపతి జిల్లాలో 345 ఆవాసాలు ఉన్నాయని అధికారులు రూపొందించిన సమ్మర్ కంటింజెన్సీ ప్లాన్‌లో పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలో 230 ఆవాసాలను గుర్తించి అన్ని ఆవాసాల్లో నీటిని ట్యాంకర్లతో సరఫరా చేస్తుండగా, నెల్లూరు జిల్లాలో 469 ఆవాసాలకు కేవలం 53, ఏలూరు జిల్లాలో 141 ఆవాసాలకు 29, కర్నూలు జిల్లాలో 162 ఆవాసాలకు 70, నంద్యాల జిల్లాలో 126 ఆవాసాల్లో 56 ఆవాసాల్లోనే నీటిని ట్యాంకర్లతో అందిస్తున్నారు.

అనంతపురం జిల్లాలో 127 ఆవాసాల్లో తాగునీటి సమస్య నెలకొనగా, ట్యాంకర్లతో నీటిని అందిస్తున్నారు. అదేవిధంగా తిరుపతి జిల్లాలోని 345 ఆవాసాలను గుర్తించగా, నీటి సరఫరాకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయించలేదు. మరోవైపు గిరిజన ప్రాంతాల్లోనూ తాగునీటి సమస్య నెలకొంది. పార్వతీపురం మన్యం జిల్లాలో అధిక సంఖ్యలో 187 ఆవాసాల్లో తాగునీటి సమస్య ఉన్నట్లు ఆ జిల్లా అధికారులు వెల్లడించారు. గిరిజన ప్రాంతమైన ఎఎస్‌ఆర్ జిల్లా విఆర్‌పురం మండలంలోని రాజుపేట, మొద్దులూరు, తోటపల్లిలో గత రెండు వారాలుగా నీటి సరఫరా చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు.

కొన్నిచోట్ల నీటి వనరులు అందుబాటులో లేక, మరికొన్ని చోట్ల తాగునీటి సరఫరాకు అవసరమైన యంత్రాలు మరమ్మతులకు గురవడం వల్ల రోజుల తరబడి నీటిని సరఫరా చేయడం లేదు.

కోస్తాలోనూ తాగునీటికి కటకట

నీటి వనరులు పుష్కలంగా ఉన్న కోస్తా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య నెలకొంది. ముఖ్యంగా ఆక్వా కల్చర్ సాగుచేస్తున్న ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. చెరువుల వల్ల భూగర్భ నీటి వనరుల్లో నీరు ఉప్పుగా మారి తాగేందుకు వీలు లేకుండా ఉంది. దీంతో కిలోమీటర్ల కొద్ది ప్రయాణించి మంచి నీటి వనరుల వద్దకు వెళ్లి వాహనాలపై నీటిని తరలిస్తున్నారు. లేని పక్షంలో ఆర్‌ఓ ప్లాంట్లలో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి కృష్ణా, గుంటూరు, పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని ఆక్వా కల్చర్ సాగుచేస్తున్న వందల సంఖ్యలోని గ్రామాల్లో నెలకొంది.

స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటాం

● విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ



ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)
పోరాటాలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1541వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు గోపి, రామచంద్రరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్యాకేజీ కింద రూ.11440 కోట్లను ప్రకటించి అందులో రూ.8,423 కోట్లను బ్యాంకు రుణాలుగా చెల్లించాలని నిబంధన విధించిందని తెలిపారు. మిగిలిన రూ.3017 కోట్లను నాలుగు వాయిదాలుగా చెల్లిస్తామని చెప్పిందన్నారు. ఆ డబ్బులు రావాలంటే బ్లాస్ట్ ఫర్నేస్-3ని ప్రారంభించి 92.5 శాతం ఉత్పత్తి చేయాలని షరతులు పెట్టడం దుర్మార్గమన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ, ఉద్యోగులను తొలగిస్తూ నిరంకుశ వైఖరిని ప్రదర్శిస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వ కుట్రలను తిప్పికొడతామన్నారు.

పెట్టుబడులపై విశ్వాసం కలిగించింది

● ఎపి ఛాంబర్స్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ప్రధాని నరేంద్ర మోడీ రాజధాని అమరావతి పనులు పున:ప్రారంభం చేయడం జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులపై విశ్వాసం కలిగించిందని ఎపి ఛాంబర్స్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పొట్లూరి భాస్కరరావు, బి రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక కార్యకలాపాలకు ఎపి చోదక శక్తిగా ఉంటుందని, అన్ని రంగాల అభివృద్ధికి అవకాశం ఉంటుందని వివరించారు.

ఎపిఇఎపి సెట్ దరఖాస్తుకు గడువు పెంపు

ప్రజాశక్తి-కాకినాడ
ఎపిఇఎపి సెట్-2025కు దరఖాస్తు చేసుకునేందుకు రూ.10 వేల ఫైన్‌తో ఈ నెల 16 వరకూ గడువు పొడిగించినట్లు సెట్ ఛైర్మన్, జెఎన్‌టియుకె విసి ప్రొఫెసర్ సివిఆర్‌కె.ప్రసాద్ తెలిపారు. ఈ నెల 1వ తేదీకి గడువు ముగిసిందన్నారు. ప్రవేశ పరీక్షకు గురువారం వరకు 3,60,119 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. పరీక్షకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులు https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్థులు రూ.2000 అపరాధ రుసుంతో మే 7వ తేదీ వరకూ, రూ.4 వేల ఫైన్‌తో మే 12, రూ.10 వేల ఫైన్‌తో మే 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 46, హైదరాబాద్‌లోని రెండు రీజనల్ సెంటర్లు మొత్తం 48 రీజనల్ సెంటర్లలో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. దరఖాస్తుల్లో తప్పులు ఉంటే ఆన్‌లైన్‌లో మార్పు చేసేందుకు మే 8వ తేదీ వరకు విద్యార్థులకు అవకాశం కల్పిస్తామని ఆయన తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను మే 12వ తేదీ నుంచి సంబంధిత వెబ్‌సైట్‌తోపాటు, ప్రభుత్వం ప్రారంభించిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. విద్యార్థులకు ఎటువంటి సందేహాలు ఉన్నా 0884-2359599, 0884-2342499 ఫోన్ నెంబర్లు, helpdeskapeapcet@apsche.org మెయిల్ ఐడి ద్వారా గాని సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం యూటర్న్..!



టార్గెట్ పూర్తయ్యిందని చేతులెత్తేసిన పౌర సరఫరాల శాఖ

ఉంగుటూరు మండలం తిమ్మయ్యపాలెంలో రైతు వద్ద ఉండిపోయిన ధాన్యం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం యూటర్న్ తీసుకుంది. రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తామంటూ ఖరీఫ్‌లో ముందుకు సాగిన ప్రభుత్వం, రబీలో మాత్రం అందుకు విరుద్ధంగా 60 శాతం ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని భీష్మించుకుని కూర్చుంది. టార్గెట్ పూర్తయిపోయిందంటూ పలు రైతుసేవా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయడంతో రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగుతున్నారు. తాము అధికారంలోకి వస్తే ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులూ ఉండవని చెప్పిన కూటమి సర్కార్ అరకొరగా ధాన్యం కొనుగోలు చేపట్టడంపై అధికార పార్టీకి చెందిన టిడిపి, జనసేన నాయకులు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కుతున్నారు. ఏలూరు జిల్లాలో ధాన్యం ఎక్కువగా పండే ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మిగిలిన మండలాల్లోనూ ధాన్యం కొనుగోలులో తీవ్ర ఆటంకాలు కనిపిస్తున్నాయి. ఖరీఫ్‌లో ఏలూరు జిల్లావ్యాప్తంగా దాదాపు 80 వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. 3.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా 2.20 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ధాన్యం కొనుగోలు చేసేందుకు పౌరసరఫరాలశాఖ ప్రణాళికలు రూపొందించింది. అధికారులు ఇచ్చిన టార్గెట్ చాలా రైతుసేవా కేంద్రాల్లో పూర్తవ్వడంతో ధాన్యం కొనుగోలును నిలిపివేశారు. నిడమర్రు మండలం అడవికొలనులో లారీల్లోకి లోడ్ చేసిన ధాన్యం సైతం నిలిపివేసిన పరిస్థితి ఉంది. పెదనిండ్రకొలను గ్రామంలోనూ అదే పరిస్థితి. ఉంగుటూరు మండలం కాగుపాడు వంటి అనేక గ్రామాల్లో సంచుల్లో పెట్టిన ధాన్యం సైతం కళ్లాల్లోనే ఉండిపోయింది. రాత్రిపూట వర్షం కురుస్తుండటంతో ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు అవస్థలు వర్ణనాతీతం. ఉంగుటూరు మండలంలో ఎకరా పది వేల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా, 73 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. కాగుపాడు, దొంతవరం, కాకర్లమూడి, వియ్యపురం, తల్లాపురం వంటి గ్రామాల్లో ఇంకా మాసూళ్లు చేయాల్సిన పంట సైతం ఉంది. మిగిలిన మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మిగిలిన ధాన్యం రైతులు ఎవరికి అమ్ముకోవాలో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. వ్యాపారుల వద్దకు వెళ్తే 75 కిలోల బస్తాకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే రూ.వంద, రూ.150 తగ్గించి అడుగుతున్నారు. దీంతో రైతులకు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఆది నుంచి జిల్లాలోని పౌర సరఫరాల శాఖాధికారులు సరిగా వ్యవహరించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డిని సైతం పౌర సరఫరాల శాఖాధికారులు తప్పుదోవ పట్టించారనే చర్చ అధికార వర్గాల్లో సాగుతోంది. దిగుబడి అంచనాలు తక్కువగా చూపించారంటూ వ్యవసాయ శాఖను బూచిగా చూపించే ప్రయత్నం పౌరసరఫరాల శాఖాధికారులు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలపై భద్రతా మండలి ఆందోళన

● త్వరలో భేటీ అవుతామని వెల్లడి



ఐక్యరాజ్య సమితి : భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొనడంపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి (యుఎన్‌ఎస్‌సి) ఆందోళన వ్యక్తం చేసింది. ఇరు దేశాల మధ్య నెలకొన్న పరిస్థితులను చర్చించేందుకు, అభిప్రాయాలను తెలుసుకునేందుకు, ఉద్రిక్తతలను నివారించేందుకు సాయపడేందుకు ఇదొక అవకాశమని భద్రతా మండలి అధ్యక్షుడు ఎవంగెల్ సి.సెకెరిస్ తెలిపారు. ఇరుగుపొరుగు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. "సమావేశం జరపాలని అభ్యర్థన వస్తే... అప్పుడు ఈ సమావేశం జరగాలనుకుంటున్నాం. ఎందుకంటే మేం చెప్పినట్లుగా, అభిప్రాయాలు వ్యక్తం చేయడానికి, ఉద్రిక్తతలు తగ్గించడానికి ఇదొక అవకాశంగా వుంటుంది." అని ఆయన వ్యాఖ్యానించారు. పిటిఐ అడిగిన ప్రశ్నకు సమాధానంగా సెకెరిస్ పై విధంగా స్పందించారు. దీనిపై అందరం మాట్లాడుకుంటునే వున్నామని, చాలా త్వరలో సమావేశం జరగవచ్చని భావిస్తున్నామని, అందుకోసం సమాయత్తమవుతున్నామని చెప్పారు. ఐక్యరాజ్య సమితిలో గ్రీక్ రాయబారి అయిన సెకెరిస్ మే మాసానికి భద్రతా మండలి అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రీస్ అధ్యక్ష కాలంలో మండలి కార్యకలాపాల గురించి ఆయన చర్చించారు. ఈ అంశంపై మండలిలో సమావేశం లేదా చర్చలు జరపాలని ఎవరి దగ్గర నుండైనా అభ్యర్థన వచ్చిందా అని ప్రశ్నించగా ఆయన పై విధంగా వివరణ ఇచ్చారు. పాక్ నుండి జరుగుతున్న తీవ్రవాద కార్యకలాపాలకు భారత్ బాధితురాలవుతోందంటూ పిటిఐ విలేకరి ప్రశ్నించారు. దానిపై సెకెరిస్ మాట్లాడుతూ సూత్రప్రాయంగా తీవ్రవాద చర్యలేవైనా తాము తీవ్రంగా ఖండిస్తామన్నారు. ఈ హేయమైన ఉగ్రదాడిని తాము ఖండించామన్నారు. భారత్, నేపాల్ ప్రభుత్వాలకు, బాధిత కుటుంబాలకు తాము సానుభూతిని తెలియజేశామన్నారు. ఈ ప్రాంతంలో చెలరేగిన ఈ ఉద్రిక్తత పట్ల తాము తీవ్రంగా ఆందోళన చెందుతున్నామన్నారు. తక్షణమే పరిస్థితులు అదుపు తప్పకుండా ఉద్రిక్తతలు చల్లారాలని మేం కోరుకుంటున్నామన్నారు. గ్రీస్ అధ్యక్షురాలిగా వున్న సమయంలో గనక ఈ అభ్యర్థన వస్తే తప్పకుండా దాన్ని తాము అమలు చేస్తామని చెప్పారు.

జగన్ హెలికాప్టర్ కేసులో ముందుకు సాగని విచారణ

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి
మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో చోటు చేసుకున్న భద్రతా వైఫల్యంపై పోలీసు అధికారుల విచారణ కొనసాగుతోంది. శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం పాపిరెడ్డి పల్లి గ్రామ పర్యటనకు గత నెలలో జగన్మోహన్ రెడ్డి విచ్చేశారు. బెంగళూరు నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో ఇక్కడికి విచ్చేసిన సమయంలో పెద్ద ఎత్తున వైసిపి కార్యకర్తలు నాయకులు ఆయన దిగిన హెలికాప్టర్‌ను చుట్టుముట్టారు. ఈ సందర్భంగా కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో హెలికాప్టర్ విండ్ షీల్డ్ దెబ్బతింది. ఆయనను తిరుగు ప్రయాణంలో తీసుకెళ్లలేమని హెలికాప్టర్ సిబ్బంది తిరస్కరించారు. జగన్మోహన్ రెడ్డిని వెంట తీసుకెళ్లకుండానే హెలికాప్టర్ తిరిగి వెళ్లింది. దీంతో ఆయన రోడ్డు మార్గంలో బెంగళూరు వెళ్లారు. భద్రత వైఫల్యంతోనే హెలికాప్టర్ నష్టం జరిగిందని వైసిపి నాయకులు ఆరోపించారు. ఈ ఆరోపణ నేపథ్యంలో పోలీసులు దీనిపై సమగ్ర విచారణ చేపట్టారు. జగన్‌మోహన్ రెడ్డి పర్యటన రోజు హెలికాప్టర్‌కు ఎటువంటి ప్రమాదం జరిగిందన్న దానిపై ఆరా తీసే పని చేపట్టారు. గత నెల 16వ తేదీన విచారణ హాజరు కావాలని పైలట్, కో పైలట్లకు నోటీసులు ఇచ్చారు. విచారణకు 16వ తేదీన కోపైలట్ ఆయన న్యాయవాదితో కలిసి చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో హాజరై తమ వాదనలను వినిపించారు. మాండేటరీ లీవ్‌లో ఉన్నందున అనిల్ కుమార్ రాలేకపోయినట్టు ఆ రోజు పోలీస్ అధికారులకు తెలిపారు. మరో తేదీన హాజరుకావాలని పైలెట్ అనిల్ కుమార్‌కు సత్యసాయి జిల్లా పోలీసులు నోటీసు ఇచ్చారు. మే ఒకటి, రెండు తేదీల్లో హాజరై హెలికాప్టర్ సంబంధించిన ఇబ్బందులపై వివరణ ఇవాల్సి ఉంది. అయితే అనిల్ కుమార్ ఒకటి, రెండు తేదీల్లో కూడా విచారణకు హాజరవలేదు. ఆయన హాజరుకాని నేపథ్యంలో తదుపరి చర్యలకు పోలీసులు సమాయత్తమవుతున్నట్టు సమాచారం. పైలెట్ అనిల్ కుమార్ వివరణతోనే జగన్మోహన్ రెడ్డి పర్యటనలో ఏం జరిగిందన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. కో పైలెట్ ఇచ్చిన వివరణలో హెలికాప్టర్ విండ్ షీల్డ్ దెబ్బతిన్న టేక్ ఆఫ్ చెయ్యొచ్చు అన్న నిర్ణయం తీసుకోగలిగేది పైలెట్ చేతిలోనే ఉంటుందని చెప్పినట్టు సమాచారం. పైలెట్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిని హెలికాప్టర్లో తీసుకెళ్లడానికి నిరాకరించి తర్వాత ఏ రకంగా టేక్ ఆఫ్ చేసుకుని వెళ్లారన్నది తేలాల్సి ఉంది. ఇప్పటికీ పోలీసులు అటు హెలికాప్టర్ సంస్థకు దానిని బుక్ చేసిన ట్రావెల్ ఏజెన్సీకి నోటీసులు ఇచ్చారు. వీరందరి వివరణ తర్వాత ఆరోజు పర్యటనలో ఎవరి లోపాలున్నాయని తేలనుంది.

వైసిపిని వెంటాడుతున్న కేసులు

వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా హెలికాప్టర్ వద్ద జరిగిన విషయంలో నిర్వాహకులైన రాప్తాడు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిపై కేసు నమోదు అయ్యింది. గత నెల పదవ తేదీన ఆయనపై కేసు నమోదు చేశారు.

ఒకవైపు హెలికాప్టర్ సిబ్బందిపై విచారణ చేపడుతూనే మరోవైపు ఈ కార్యక్రమం నిర్వాహకులు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ విషయంలో ముందస్తు బెయిల్ కోసం ప్రకాష్ రెడ్డి ముమ్మరంగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. బెయిల్ లభించకపోవడంతో ఆయన అజ్ఞాతంలో వెళ్లారు. ఇదే సమయంలో ప్రకాష్‌రెడ్డిని అరెస్టు చేసేందుకు పోలీసులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

పత్రికా స్వేచ్ఛా సూచికలో భారత్‌కు 151వ స్థానం

- నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్ కంటే దిగువే..!
- మొదటి మూడు స్థానాల్లో నార్వే, ఎస్టోనియా, నెదర్లాండ్స్
- రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ : ఎప్పటిలాగే ఈ సారి కూడా ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచీలో భారత్ వెనకబడిపోయింది. ప్రపంచవ్యాప్తంగా 180 దేశాలలో భారత్ 151వ స్థానంలో ఉన్నది. ఇది పొరుగు దేశాలైన నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్, మాల్దీవుల కంటే దిగువ స్థానంలో ఉండటం గమనార్హం. మీడియా వాచ్‌డాగ్ రిపోర్టర్స్ సాన్స్ ఫ్రాంటియర్స్ ఈ విషయాన్ని తెలిపింది. రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ అని పిలవబడే ప్రభుత్వేతర సంస్థ 2002 నుంచి ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచికను ప్రచురిస్తోంది. రాజకీయ, ఆర్థిక, శాసన, సామాజిక, భద్రత అనే ఐదు సూచికల ఆధారంగా ఆయా దేశాలలో పత్రికా స్వేచ్ఛను అంచనా వేస్తుంది. దీని ప్రకారం.. 2024లో భారత ర్యాంకు 159గా, 2023లో 161గా ఉన్నది. ఈ సారి ర్యాంకు కాస్త మెరుగుపడినా.. అది ఆశించినంత స్థాయి కాదనేది విశ్లేషకుల అభిప్రాయం. పత్రికా స్వేచ్ఛా సూచీలో భారత ప్రదర్శన 'చాలా తీవ్రమైన' వర్గంలోనే ఉన్నదని రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ వివరించింది. రాజకీయ దిగ్గజాల చేతుల్లో మీడియా యాజమాన్యం కేంద్రీకృతమై ఉన్న కారణంగా మీడియా బహుళత్వానికి ముప్పు వాటిల్లుతున్న దేశాల జాబితాలో భారత్ కూడా ఉన్నది. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ స్థితిని మొదటిసారిగా క్లిష్ట పరిస్థితిలో ఉన్నట్టు సూచిక వర్గీకరించింది. ఆర్థిక ఒత్తిడే మీడియా బలహీనపడటానికి దోహదపడే ప్రధాన అంశమని సదరు సంస్థ వివరించింది. భారత్‌కు పొరుగున్న ఉన్న దేశాలు పత్రికా స్వేచ్ఛలో మనకంటే మంచి స్థానాల్లోనే ఉండటం గమనార్హం. నేపాల్ (90వ స్థానం), మాల్దీవులు (104), శ్రీలంక (139), బంగ్లాదేశ్ (149)ల కంటే భారత్ దిగువ స్థానంలో ఉన్నది. భూటాన్ (152), పాకిస్తాన్ (158), మయన్మార్ (169), ఆఫ్ఘనిస్తాన్ (175)లు భారత్ కంటే వెనుకబడి ఉన్నాయి. పత్రికా స్వేచ్ఛ విషయంలో నార్వే, ఎస్టోనియా, నెదర్లాండ్స్ దేశాలు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

సముద్ర జల రవాణాలో సరికొత్త అధ్యాయం

- విళింజం సీ పోర్ట్‌ను ప్రారంభించిన ప్రధాని మోడీ

కేరళ కలల ప్రాజెక్టు విళింజమ్: సిఎం పినరయి విజయన్



విళింజమ్ అంతర్జాతీయ సీ పోర్ట్ ప్రారంభసభలో ప్రధాని నరేంద్ర మోడీ, కేరళ సిఎం పినరయి విజయన్, గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ తదితరులు

తిరువనంతపురం : తిరువనంతపురం సమీపంలోని విళింజమ్ అంతర్జాతీయ సీ పోర్ట్ మొదటి దశను ప్రధాని నరేంద్ర మోడీ అధికారికంగా ప్రారంభించారు. రూ.8,867 కోట్ల వ్యయంతో శుక్రవారం ప్రారంభించిన ఈ ప్రాజెక్టు ఆర్థిక సుస్థిరతకు 'కొత్త శకం చిహ్నం' గా ప్రధాని అభివర్ణించారు. కేరళ అభివృద్ధి ద్వారా భారతదేశం పురోగమిస్తుందని వ్యాఖ్యానించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్, అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదాని, ఎంపి శశి థరూర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశానికి సంబంధించి 75శాతం షిప్‌మెంట్‌లు విదేశీ పోర్టుల ద్వారా జరుగుతున్నాయని అన్నారు. విళింజమ్ పోర్టును ప్రారంభించడం, దేశీయ ఓడరేవుల మౌలిక వసతులను బలోపేతం చేయడంతో విదేశాలకు తరలిపోతున్న ఆదాయం ఇకపై భారత్‌కే తిరిగి వస్తుందన్నారు. విళింజం పోర్టు ప్రాజెక్టుతో గణనీయమైన ఉపాధి అవకాశాలు సృష్టించబడతాయన్నారు. కేరళ ప్రజల నిబద్ధత, అంకిత భావంతో అంతర్జాతీయ సముద్ర జల రవాణాలో భారత్ అగ్రగామిగా కొనసాగుతుందన్నారు. అందరం కలిసి అభివృద్ధి చెందిన, సంపద్వంతమైన కేరళను నిర్మించగలమన్నారు.

అభివృద్ధి అవకాశాలకు గేట్ వే
కేరళ సిఎం పినరయి విజయన్

విళింజమ్ పోర్ట్‌ను కేరళ రాష్ట్ర కలల ప్రాజెక్టుగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అభివర్ణించారు. ఇది కేవలం పోర్ట్ గేట్ ప్రారంభం కాదు, మూడవ సహస్రాబ్ది అభివృద్ధి అవకాశాలను ఒడిసి పట్టేందుకు భారత్‌కు మహత్తరమైన గేట్‌వే వంటిదని అభివర్ణించారు. భారతదేశాన్ని అంతర్జాతీయ సముద్ర వాణిజ్య లాజిస్టిక్స్ మ్యాప్‌తో అనుసంధానించే గొప్ప ప్రయత్నమని అన్నారు. దేశ చరిత్రలో మరుగున పడిన విళింజమ్‌ను తిరిగి వెలుగులోకి తెచ్చి, అభివృద్ధిపరిచి అంతర్జాతీయ ఓడరేవుగా మార్చాలన్నది కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. భారతదేశంలోనే ఒక రాష్ట్రం చొరవ తీసుకుని అతిపెద్ద ఓడరేవును నిర్మించడం ఇదే మొదటిసారని అన్నారు. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.8,686 కోట్లలో రూ.5,370.86 కోట్లు కేరళ రాష్ట్రానివేనని అన్నారు. మిగిలిన రూ.2,497 కోట్లు అదానీ విళింజమ్ పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ఖర్చు చేస్తోందన్నారు. వయబిలిటీ గ్యాప్ ఫండ్ రూ.818 కోట్లను కేంద్రం అందజేస్తోందన్నారు. ఏటా జాతీయ స్థాయిలో సంభవించే 22కోట్ల డాలర్ల మేర నష్టం ఈ ఓడరేవుతో భర్తీ కావడం ప్రారంభమవుతుందన్నారు. దేశానికి సంభవించే నష్టాలను చాలా పెద్ద మొత్తంలోనే కేరళ పరిష్కరించగలగడం కేరళ ప్రజలందరికీ గర్వకారణమని వ్యాఖ్యానించారు. 'ఒప్పందం ప్రకారం, 2045కల్లా ఇది పూర్తి కావాల్సి వున్నా వేచి చూడలేదు. వాణిజ్య కార్యకలాపాలు 2024లోనే ప్రారంభమయ్యాయి. మిగిలిన అన్ని దశలు 2028కల్లా పూర్తవుతాయని' విజయన్ చెప్పారు. తీవ్రస్థాయిలో వరదలు, ఇతర జాతీయ విపత్తులు, కొవిడ్ మహమ్మారి ఇవన్నీ ఆర్థిక వ్యవస్థను అల్లకల్లోలం చేసినా కేరళ ఆగిపోలేదన్నారు. రూ.120 కోట్ల వ్యయంతో తీర ప్రాంత పునరావాసం, జీవనోపాధి అంశాలను కూడా పరిష్కరించామని తెలిపారు. క్రేన్ల నిర్వహణసహా పలు ఉద్యోగాలు స్థానిక యువతులకు ఇచ్చామ న్నారు. మహిళలకు నైపుణ్య కేంద్రం ప్రారంభించామన్నారు. ఐదు వేల కంటే ఎక్కువ ఉద్యోగాలు లభిస్తున్నాయని అన్నారు.

మద్యం కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లోని మద్యం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి వేసిన పిటిషన్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. మద్యం కేసులో తనకు సిఆర్‌పిసి 160 నోటీస్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును కెసిరెడ్డి ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్థీవాలా, జస్టిస్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. తెలంగాణలో నివసిస్తున్న తనకు ఎపి సిఐడి పోలీసులు నోటీసులిచ్చే పరిధి లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజ్ కెసిరెడ్డి తరపున న్యాయవాది శ్రీహర్ష వాదనలు వినిపించారు. విచారణ జరిపిన కోర్టు రాజ్ కెసిరెడ్డి పిటిషన్‌పై ఎపి ప్రభుత్వంతోపాటు సిట్, ముఖేష్ కుమార్ మీనాకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మే 13కు వాయిదా వేసింది. అదేరోజు ఇదే కేసులో వైసిపి ఎంపి మిథున్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ జరగనుంది. దీంతో ఈ రెండు పిటిషన్లను కలిపి విచారిస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది.

రామదాస్ శివానందన్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

- తక్షణమే రీసెర్చ్‌స్కాలర్‌గా పరిగణించాలని టిఐఎస్ఎస్‌కు సుప్రీంకోర్టు ఆదేశం
- తీర్పును స్వాగతించిన ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దళిత రీసెర్చ్ స్కాలర్ రామదాస్ ప్రిని శివానందన్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని, ఆయనను తక్షణమే స్కాలర్‌గా పరిగణించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిఐఎస్ఎస్)ని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. రామదాస్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారిస్తున్న సందర్భంగా కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. కేరళలోని వయనాడ్‌కు చెందిన రామదాస్ టిఐఎస్ఎస్ ముంబయిలో డెవలప్‌మెంట్ స్టడీస్‌లో పరిశోధన స్కాలర్‌గా ఉన్నారు. రామదాస్‌ను 2024 ఏప్రిల్‌లో విద్యార్థి సమస్యలపై గొంతెత్తినందుకు టిఐఎస్ఎస్ యాజమాన్యం సస్పెండ్ చేసింది. ఎంపవర్డ్ కమిటీ కనుగొన్న విషయాలను ఉటంకిస్తూ, టిఐఎస్ఎస్ ముంబయి, తుల్జాపూర్, గౌహతి, హైదరాబాద్‌లోని దాని నాలుగు క్యాంపస్‌ల నుండి కూడా రామదాస్‌ను నిషేధించింది. ఈ చర్య ఏకపక్షమని, తన వివరణను పరిగణనలోకి తీసుకోకుండా ఈ నిర్ణయం తీసుకున్నారని రామదాస్ వాదించారు. ప్రజా పోరాటం చూస్తూనే, న్యాయ పోరాటం చేశారు. తీర్పుపై స్పందిస్తూ.. 'హైకోర్టును సంప్రదించినప్పటి నుండి 366వ రోజులు చట్టపరమైన చర్యల కోసం పోరాటం చేశాను. నేను అధికారికంగా మళ్లీ విద్యార్థిని. 380 రోజులపాటు నాకు విద్యను నిరాకరించింది' అని పేర్కొన్నారు. 'ఏ విద్యార్థికీ విద్య నిరాకరించడమనేది కేవలం ఒక వ్యక్తిని మాత్రమే ప్రభావితం చేయదు' అని రామదాస్ పేర్కొన్నారు. విద్యార్థుల ప్రాథమిక హక్కులు, ఉన్నత విద్యలో క్యాంపస్ ప్రజాస్వామ్య స్థితి గురించి తన పోరాటమని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థి ఉద్యమాలకు తన చట్టపరమైన విజయాన్ని అంకితం చేస్తున్నానని చెప్పారు. ఢిల్లీ అంబేద్కర్ విశ్వవిద్యాలయం, జామియా మిలియా ఇస్లామియా, జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయం సంస్థాగత అణచివేతను ప్రతిఘటించిన విద్యార్థులకు రామదాస్ సంఘీభావం తెలిపారు. తనకు మద్దతుగా నిలిచిన స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ), ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫోరం (పిఎస్ఎఫ్) విద్యార్థి సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. 'అందరికీ విద్య, ఉపాధి కోసం అధ్యయనం, పోరాటం తప్పకుండా కొనసాగుతుంది' అని ఆయన పేర్కొన్నారు. టిఐఎస్ఎస్ ముంబయిలో పిఎస్ఎఫ్ మాజీ ప్రధాన కార్యదర్శి అయిన రామదాస్ ప్రస్తుతం ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడిగా, ఎస్ఎఫ్ఐ మహారాష్ట్ర యూనిట్‌కు సహాయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పును ఎస్ఎఫ్ఐ స్వాగతించింది. ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల గొంతు అణచివేసేందుకు, విద్యార్థి హక్కులను కాలరాసేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సానూ, మయూక్ బిశ్వాస్ అన్నారు. ఈ కుట్రలను ఛేదించేందుకు పోరాటమే మార్గమని పేర్కొన్నారు.

కుల గణనకు మోడల్‌గా తెలంగాణ

- కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ సిడబ్ల్యూసి ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా చేపట్టబోయే కుల గణనలో తెలంగాణను మోడల్‌గా కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యూసి) ఏకగ్రీవ తీర్మానం చేసింది. శుక్రవారం నాడిక్కడ అక్బర్ రోడ్‌లోని ఎఐసిసి ఓల్డ్ ఆఫీస్‌లో పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో సిడబ్ల్యూసి భేటీ జరిగింది. ఈ సమావేశంలో అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీతోపాటు ఎఐసిసి శాశ్వత, ప్రత్యేక ఆహ్వానితులు హాజరయ్యారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, హిమాచల్‌ప్రదేశ్ సిఎం సుఖ్వీందర్ సింగ్, తెలంగాణ నుంచి సిడబ్ల్యూసిలో సభ్యులుగా ఉన్న మంత్రి దామోదర రాజనరసింహ, మాజీ ఎమ్మెల్యే వంశీ చందర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్ రఘువీరారెడ్డి పాల్గొన్నారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన ఈ భేటీ సుమారు రెండు గంటల వరకు సాగింది. ఈ భేటీలో... పహల్గాం ఉగ్రదాడికి కారణమైన పాకిస్తాన్‌కు బలమైన రిప్లే ఇవ్వడం, ఒబిసి కుల గణన, రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం క్యాప్‌ను ఎత్తి వేయాలనే అంశంపై ప్రధానంగా చర్చించారు. ఈ దిశలో పలు తీర్మానాలు చేశారు. ఉగ్రవాదులకు అండగా నిలుస్తోన్న పాకిస్తాన్‌పై ఏ చర్య తీసుకున్నా అందుకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా ఉంటుందని సిడబ్ల్యూసిలో తీర్మానం చేశారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా చేపట్టిన కుల గణనను కేంద్రం పరిగణనలోకి తీసుకొని... దేశ వ్యాప్త కుల గణన చేపట్టాలని మరో తీర్మానం చేశారు. వీటితోపాటు రిజర్వేషన్లపై ఉన్న క్యాప్‌ను 50 శాతానికి పరిమితం చేయకుండా, జనాభా ప్రాతిపాదికన రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించారు.

అన్నదాతలకు అప్పుల తిప్పలు

(మొదటిపేజీ తరువాయి)

గత నెల ఒకటో తేదీన కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. పంట కూడా చేతికి రాని పరిస్థితి ఆయా మండలాల్లో ఉంది. కరువు మండలాలుగా ప్రకటించని ప్రాంతాల్లోనూ దిగుబడులు ఆశాజనంగా లేవు. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

అప్పు చేసి బ్యాంకుకు కట్టాను



పంట సాగు ఖర్చుల కోసం పాలకొండ డిసిసిబి నుంచి రూ.90 వేలు రుణం తీసుకున్నాను. వడ్డీ రూ.6,800 అయిందని, అసలు సొమ్ము రూ.90 వేలు కలిపి రూ.96,800 చెల్లించమన్నారు. నేను వడ్డీ డబ్బులే పట్టుకుని వెళ్లాను. వడ్డీ, అసలు కూడా కలిపి కట్టాలని తేల్చిచెప్పారు. దీంతో, మా గ్రామంలో వడ్డీ వ్యాపారి దగ్గర నూటికి రూ.3 అప్పు తీసుకుని బ్యాంకుకు చెల్లించాను.

- చిన్ని నారాయణరావు, లక్కుపురం

నిబంధనల ప్రకారమే చేస్తున్నాం

రుణాలపై ఆర్‌బిఐ నిబంధనలకు అనుగుణంగానే చేస్తున్నాం. పంట రుణాలు, బంగారం తాకట్టుపై తీసుకున్న రుణాలకు అసలు, వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకోవాలి. ఒక రోజు క్రెడిట్‌లో ఉంటేనే రెన్యువల్ అవుతుంది. ఆధార్, పాన్‌కార్డు ఉండాలి. చెక్‌బుక్ లేకపోయినా ఫారం-16లో వివరాలు నింపి రుణాలు మంజూరు చేస్తున్నాం.

- సూర్యకిరణ్, లీడ్ బ్యాంకు మేనేజర్, శ్రీకాకుళం జిల్లా

ఆర్థిక సాయం ఊసెత్తని ప్రధాని

(మొదటిపేజీ తరువాయి)

ఈ పదేళ్లల్లో రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఎంతో సాయం చేసిందని మోడీ చెప్పుకొచ్చారు. తిరిగి చంద్రబాబు సిఎం అయ్యాక రాజధాని పనులు వేగవంతం అయ్యాయని, కేంద్రం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. ఇంకా ప్రధాని ఏమన్నారంటే.. అమరావతి రాజధాని మాత్రమే కాదు. ఒక శక్తి. అదొక స్వప్నం. ఆధునీకరణకు స్ఫూర్తి. నాడు ఇంద్రుడి రాజధాని ఆ అమరావతి అయితే ఇప్పుడు స్వర్ణాంధ్రకు శుభ సూచిక. యువతకు ఆశా కిరణం. ఐటి, ఎఐలకు కేంద్రం కావాలి. వికసిత భారత్‌కు అమరావతి గ్రోత్ ఇంజన్ అవుతుంది. మూడేళ్లల్లో అమరావతిని పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారు. నైపుణ్యం, వేగం, ఆధునీకరణలో చంద్రబాబును మించిన వారు దేశంలో ఎవ్వరూ లేరు. నన్ను టెక్నాలజీకి ఐకాన్ అని ఇప్పుడు చంద్రబాబు అంటున్నారు నేనొక రహస్యం చెబుతాను. నేను గుజరాత్‌కు కొత్తగా సిఎం అయినప్పుడు చంద్రబాబు నేతృత్వంలో హైదరాబాద్‌లో ఐటి డెవలప్‌మెంట్‌పై అధికారులను పంపి అధ్యయనం చేయించి తెలుసుకున్నాను. అమరావతి పూర్తయ్యాక ఆంధ్రప్రదేశ్ జిడిపి ఇప్పటి కంటే ఎన్నో రెట్లు పెరుగుతుంది. దేశాభివృద్ధిలో కీలకంగా మారుతుంది. యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు వస్తాయి. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించింది. ఇది ఎపికి కూడా ఉపయోగపడుతుంది. రైల్వే బడ్జెట్‌ను యుపిఎ-2 హయాంలో కంటే ఎన్నో రెట్లు రాష్ట్రానికి పెంచాం. ఇప్పుడు ప్రారంభించిన పనులన్నీ మౌలిక వసతుల అభివృద్ధికి దోహద పడతాయి. జిల్లాలు, రాష్ట్రాల మధ్య కనెక్టివిటీ పెరుగుతుంది. రవాణా రంగం అభివృద్ధి చెందితే రైతులు తమ పంటలను ఎక్కడికైనా తీసుకొని పోగలుగుతారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక పోలవరం పనులు వేగవంతమయ్యాయి. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసేందుకు కలసి మెలిసి పని చేస్తాం. పదేళ్లల్లో రాష్ట్ర రైతులకు పిఎంకిసాన్ కింద రూ.17,500 జమ చేశాం. విపత్తు నష్ట పరిహారం కింద రూ.5,500 కోట్లు ఇచ్చాం. ఒక్క ఆయుధాలతోనే దేశ ఐక్యత రాదు. ప్రజల మధ్య ఐక్యతతోనే సిద్ధిస్తుంది...

సెంటిమెంట్ ప్రేరేపితం

2015లో అమరావతి శంకుస్థాపన సందర్భంగా చెంబులో యమునా నది నీళ్లు, పార్లమెంట్ ఆవరణలోని గుప్పెడు మట్టి తీసుకొచ్చి నాడు సెంటిమెంట్‌ను పండించిన ప్రధాని మోడీ, ప్రస్తుతం స్థానిక సెంటిమెంట్‌ను ప్రేరేపించేందుకు ప్రయత్నించారు. 'మీ అందరినీ కలవడం ఆనందంగా ఉంది' అని తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించారు... ఆంధ్రప్రదేశ్ పుణ్యభూమి. అమరావతి భారతీయ వారసత్వ, సంప్రదాయ, సాంస్కృతిక ప్రదేశం. వీరభద్రుడు, అమరలింగేశ్వరస్వామి, తిరుపతి వెంకటేశ్వరస్వామి పాదాలకు నమస్కరిస్తున్నాను. నాయుడుపేట-రేణిగుంట హైవే పూర్తయితే తిరుమల వెంకటేశ్వరస్వామిని భక్తులు త్వరగా దర్శించుకోవచ్చు. తెలుగుసీమ ఎప్పుడో షార్ కేంద్రం ఏర్పాటు ద్వారా అంతరిక్ష పరీక్షలకు కేంద్రంగా ఉంది. జూన్ 21 విశాఖలో అంతర్జాతీయ యోగా దినంలో పాల్గొనాలని చంద్రబాబు నన్ను ఆహ్వానించారు. నేను తప్పకుండా వస్తాను. యోగా వైపు, యోగా ఈవెంట్‌ను నిర్వహిస్తున్న ఎపి వైపు దేశం, ప్రపంచం చూసేలా చేయాలి. యోగాపై ఊరూ వాడా ప్రచారం చేయాలి... అని మోడీ సూచించారు. పలుమార్లు వందే మాతరం, భారత్ మాతాకి జై అని సభికులతో అనిపించారు.

టన్నెల్‌లో కార్మికుల ఆచూకీ ప్రయత్నాలు ముగిసినట్టే..

- చివరి 43 మీటర్ల ప్రాంతంలో పనుల నిలిపివేత
- డేంజర్ జోన్‌గా ప్రకటించిన రెస్క్యూ టీం
- బాధిత కుటుంబాలకు పరిహారం అందజేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్ఎల్‌బిసి సొరంగంలో కార్మికుల ఆచూకీ ఇప్పట్లో తెలిసేలా లేదు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పిన దాన్నిబట్టి వారి మృతదేహాల వెలికితీత ప్రయత్నాలకు ఫుల్‌స్టాప్ పెట్టినట్టు అర్థమవుతోంది. టన్నెల్‌లో కార్మికులు చిక్కుకుపోయిన ప్రాంతం అత్యంత ప్రమాదకరమని తెలిసినా.. వారి ఆచూకీ కోసం ప్రాణాలకు తెగించి రెస్క్యూ టీం 24 గంటలు రెండు నెలలు కృషి చేసింది. మైనింగ్, ఆర్మీ, హైడ్రాతోపాటు 12 శాఖలకు సంబంధించి సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద ప్రాంతంలో రోబోలను ఉపయోగించారు. కేరళ కడావర్ డాగ్స్‌ను రప్పించారు. చిన్న యంత్రాలతో పనులు చేశారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. రెండు నెలల కాలంలో ఇద్దరు ఇంజనీయర్ల మృతదేహాలను మాత్రమే వెలికి తీశారు. ఇంకా ఆరుగురికి ఆచూకీ తెలియలేదు. సహాయక పనులు ముందుకు సాగడం లేదు. ఉబికి వస్తున్న నీరు, మట్టి తీవ్రతతో ఆ ప్రాంతం ప్రమాదకరంగా ఉంది. చివరకు టిబిఎంకు ముందు భాగాన ఉన్న 43 మీటర్లు అత్యంత ప్రమాదకరమని, అక్కడ పనిచేసే వారు రిస్క్‌లో పడే అవకాశాలున్నాయని ఉన్నతాధికారులు తెలిపారు. దాంతో చివరి ప్రాంతంలో ఇప్పట్లో పనులు చేయడానికి వీలు కాదని ఇనుప కంచె వేశారు.

మృతదేహాలు బయటపడిన ఇద్దరు ఇంజనీర్ల కుటుంబాలతోపాటు మిగతా ఆరు కుటుంబాలకు కూడా ప్రభుత్వం రూ.25 లక్షల చొప్పున అందజేసింది. కార్మికుల కుటుంబాలు తమ బిడ్డల ఆచూకీ చూపాలని అడుగుతుంటే ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చేతిలో పెట్టింది. అంటే ఇక ఎస్ఎల్‌బిసిలో ఇరుక్కున కార్మికుల కథ ముగిసినట్లేనని తెలుస్తోంది. హై టెక్నాలజీని ఉపయోగించి కార్మికులను బయటకు తెస్తామని మంత్రి ఉత్తమ్ చెబుతున్నా.. ఇప్పట్లో అది జరిగే పనికాదని తెలుస్తోంది. సొరంగం చివరి 43 మీటర్ల ప్రాంతంలో పనులను నిషేధించారు. అక్కడ ఇనుప కంచె ఏర్పాటు చేశారు. పై నుంచి వస్తున్న నీరు, మట్టి కూలి ప్రమాదకరంగా మారింది. అందుకే ఇక హైటెక్నాలజీని వాడతామని మంత్రి చెప్పారు. కానీ ఎప్పటిలోగా తిరిగి పనులు పునరుద్ధరణ చేస్తారో చెప్పడం లేదు. ఎస్ఎల్‌బీసీ దోమలపెంట దగ్గర పనులు ఇలా ఉంటే.. మన్నెవారిపల్లిలో పరిస్థితి మరోలా ఉంది. ఇక్కడ టీబీఎం మిషన్ చెడిపోయింది. దాన్ని మరమ్మతు చేసి తిరిగి ఇక్కడి నుంచి కూడా పనులు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది.

సురేష్ ప్రొడక్షన్స్‌కు లభించని ఊరట

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో: సురేష్ ప్రొడక్షన్స్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించలేదు. విశాఖ రామానాయుడు స్టూడియో భూముల వ్యవహారంపై శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఫిల్మ్ సిటీ కోసం కేటాయించిన భూములను ఇతర అవసరాలకు వాడుకోవచ్చని గతంలో వైసిపి ప్రభుత్వం అనుమతించిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వ నిర్ణయాన్ని ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలని ప్రస్తుత ఎపి ప్రభుత్వం షోకాజ్ నోటీసు ఇచ్చింది. ప్రభుత్వ షోకాజ్ నోటీసును సుప్రీంకోర్టులో సురేష్ ప్రొడక్షన్స్ సవాల్ చేసింది. ఈ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. అయితే పిటిషన్ విషయంలో జోక్యం చేసుకునేందుకు ధర్మాసనం నిరాకరించింది. మధ్యంతర ఉపశమనం కుదరదని స్పష్టం చేసింది. అవసరం అనుకుంటే ప్రభుత్వ షోకాజ్ నోటీసుపై సంబంధిత కోర్టును ఆశ్రయించాలని జస్టిస్ అభయ్ ఓకా సూచించారు. పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని సురేష్ ప్రొడక్షన్స్ తెలుపగా.. అందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం అనుమతించింది.

శ్రీలంకలో స్ఫూర్తినింపిన మేడే ర్యాలీ



కొలంబో : అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా శ్రీలంక అరుణ వర్ణాన్ని సంతరించుకుంది. నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) ఆధ్వర్యాన లక్షలాదిమంది కార్మికులు, ప్రజలు హాజరైన ప్రధాన ర్యాలీ గాలె ఫేస్ గ్రీన్‌లో జరిగింది. అరుణ సంద్రాన్ని తలపించిన ఈ ర్యాలీని ఉద్దేశించి శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే ప్రసంగించారు. దేశ రాజధాని కొలంబోలోనే వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యాన 15 భారీ ర్యాలీలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో భారీ ర్యాలీలు, బహిరంగ సభలు జరిగాయి.

ఐద్వా నేత సి అరుణ ఇకలేరు

- సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సహా పలువురి నివాళి
- బివి రాఘవులు, తమ్మినేని సంతాపం
- నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు



నివాళులర్పిస్తున్న సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, పలువురు నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సీనియర్ నాయకులు సి అరుణ కన్నుమూశారు. గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆమె భర్త సి సాంబిరెడ్డి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టీగా పని చేశారు. వారి కుమారుడు సి అంజిరెడ్డి డాక్టర్‌గా సేవలందిస్తున్నారు. ఆమె అంత్యక్రియలు శనివారం ఉదయం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ సభ్యులుగా అరుణ పనిచేశారు. ఐద్వా హైదరాబాద్ నగర అధ్యక్షులుగా, కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా సేవలందించారు. ఐద్వా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌కు కన్వీనర్‌గా 20 యేళ్లపాటు సేవలందించారు. ఐద్వా నగర ఉద్యమంలో, బాగ్‌లింగంపల్లి చుట్టుపక్కల మహిళా ఉద్యమాన్ని నిర్మించడంలో కీలకపాత్ర పోషించారు. ఆమె నిరాడంబర జీవితం గడిపారు. మహిళల హక్కుల సాధన, వారిని చైతన్యం చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేశారు.

జాన్‌వెస్లీ సహా పలువురి నివాళి

సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య, టి జ్యోతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి నాగయ్య, పాలడుగు భాస్కర్, పి ప్రభాకర్, బండారు రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు జె బాబురావు, సీనియర్ నాయకులు డిజి నరసింహారావు, జి రాములు, ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్, సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం వెంకటేశ్, మాజీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ తదితరులు అరుణ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అరుణ మరణం పట్ల సంతాపం తెలిపారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, ఎపి కార్యదర్శి వి శ్రీనివాసరావు సాంబిరెడ్డికి ఫోన్ చేసి పరామర్శించారు. అరుణ మరణం పట్ల సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. అరుణ మరణం పట్ల సిపిఎం ఆంధ్రప్రదేశ్ మాజీ కార్యదర్శి పెనుమల్లి మధు సంతాపం తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం గచ్చిబౌలి కార్యదర్శి, నవతెలంగాణ సిజిఎం పి ప్రభాకర్ సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఆమె మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు, మహిళా ఉద్యమాలకు తీరనిలోటని తెలిపారు.

అరుణ మృతి పట్ల ఐద్వా సంతాపం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యులు, ఐద్వా సీనియర్ నాయకులు సి అరుణ మృతి పట్ల ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్ పుణ్యవతి, ఐద్వా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి సంతాపం తెలిపారు. ఎక్కడున్నా అరుణ మహిళా ఉద్యమంతోనే కొనసాగారని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం చుట్టుపక్కల మహిళా ఉద్యమాన్ని నిర్మించడంలో విశేష కృషి చేశారని తెలిపారు. అరుణ కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు.

మన్యం బంద్ సక్సెస్

(మొదటిపేజీ తరువాయి)

పార్వతీపురం తదితర ప్రాంతాల్లో బంద్ జరిగింది. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట గ్రామాల్లో వర్తక వాణిజ్య సముదాయాలు, హోటళ్లు మూతబడ్డాయి. ఆర్‌టిసి బస్సులను బంద్ నిర్వాహకులు అడ్డుకున్నారు. ఆటోలు ట్రక్కర్లు, ఇతర గూడ్స్ వాహన డ్రైవర్ల మధ్యాహ్నం వరకూ తమ వాహనాలను నిలిపివేసి బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించారు. రిక్షా, కళాసీ కార్మికులు బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. బంద్ కారణంగా జనసంచారం లేకపోవడంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. బంద్‌లో భాగంగా పార్వతీపురంలో కలెక్టరేట్ వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. బంద్‌కు మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర మద్దతు ప్రకటించారు.

'పశ్చిమ' ఏజెన్సీలో బంద్ సంపూర్ణం

ఏలూరు జిల్లాలోని ఐదు ఏజెన్సీ మండలాల్లో బంద్ సంపూర్ణంగా జరిగింది. నేతలు ముందుగానే విస్తృత ప్రచారం చేయడంతో వ్యాపారులు స్వచ్ఛందంగా తమ దుకాణాలు మూసివేసి బంద్ పాటించారు. పోలవరంలో ఏటిగట్టు సెంటర్ వద్ద మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. వేలేరుపాడు మండలంలో వేలేరుపాడు నుండి భూదేవిపేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మడివి దుర్గారావు అధ్యక్షతన జరిగిన సభలో గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్, ఎఎస్‌పి మండలాధ్యక్షులు ఊకె ముత్యాలరావు మాట్లాడారు. కుక్కునూరు మండలంలో బంద్ విజయవంతమైంది. బుట్టాయగూడెంలో జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.నాగమణి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ పాల్గొని మద్దతు తెలిపి మాట్లాడారు. జీలుగుమిల్లి సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.రామకృష్ణ మాట్లాడారు.

సిరియా అధ్యక్ష భవనం సమీపంలో ఇజ్రాయిల్ దాడులు

డమాస్కస్ : సిరియా అధ్యక్ష భవనం సమీపంలో ఇజ్రాయిల్ బలగాలు దాడులకు తెగబడ్డాయి. డమాస్కస్‌లో అధ్యక్ష భవన సమీపంలో యుద్ధ విమానాలు శుక్రవారం తెల్లవారుజామున దాడి చేశాయని ఇజ్రాయిల్ సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఇజ్రాయిల్ దాడిని సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్ షరా కార్యాలయం తీవ్రంగా ఖండించింది. దేశాన్ని అస్థిరపరచడానికి జరిపిన దాడిగా పేర్కొంది.

వేసవి విడిది

బాలికల విద్య







ఒక ఊరిలో లక్ష్మి, రాము అనే దంపతులు నివసిస్తున్నారు. వాళ్లకు సీత, సోను అనే కూతురు, కొడుకు ఉన్నారు. వాళ్ల ఇద్దరికీ బడికి పోయే వయసు వచ్చింది. అయితే వాళ్లు సోనుని మాత్రమే బడికి పంపించారు. కూతురిని వాళ్లతో పాటు వ్యవసాయ పనులకు తీసుకెళ్లారు.

ఒకరోజు సీత ఇంటి బయట దిగాలుగా కూర్చుని బడికి పోయి వచ్చే పిల్లలని చూస్తున్నది. ఆ పిల్లలలో వాళ్ళ తమ్ముడు సోను కూడా ఉన్నాడు. సోను వాళ్ళ అక్క దగ్గరికి వచ్చి 'ఏమైంది అక్క' అని అడిగాడు. 'సోనూ మన నాన్న నిన్ను మాత్రం బడికి పంపుతున్నాడు. నన్ను వాళ్లతో పనికి తీసుకెళ్తున్నారు. నాకేమో చదువుకోవాలని ఉంది' అని బాధగా అన్నది. అప్పుడు సోను 'అక్క నువ్వు రంధి పడకు. నేను నాన్నతో చెప్పి నిన్ను బడికి పంపేలా చేస్తాను' అని అన్నాడు.




ఆ రోజు సాయంత్రం వాళ్ళ నాన్న పని నుండి ఇంటికి వచ్చాడు. నాన్న ఇంట్లోకి రాగానే 'నాన్న అక్కను బడికి పంపించు' అన్నాడు సోను. 'పెద్ద పెద్ద మాటలు మాట్లాడకురా' అని నాన్న, సోనును కోపంగా చూసి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. కొంత సమయం తర్వాత వాళ్ళ అమ్మ వచ్చింది. మళ్లీ సోను వాళ్ళ అమ్మ దగ్గరికి వెళ్లి 'అమ్మ నా తోని అక్కను బడికి పంపించమ'ని అడిగాడు. అమ్మ ఏం మాట్లాడకుండా నెమ్మదిగా ఉంది. అప్పుడు మళ్లీ ఇలా అన్నాడు. 'అమ్మా మా సార్లు బడిలో ఒక మంచి విషయం చెప్పారు. అమ్మాయి చదువు అవనికి వెలుగు అంట. మన ఇంట్లో ఏమో నేను ఒక్కడినే స్కూలుకి వెళ్తున్నాను. అక్కని కూడా పంపించండి' అని ఏడుస్తూ అడిగాడు.

ఆ తరువాతి రోజు పొలం పనుల నుండి ఇంటికి వస్తూ లక్ష్మి, రాముతో సోను చెప్పిన విషయాన్ని చెప్పింది. సీతని బడికి పంపుదామని బతిమాలింది. రాము ఒప్పుకున్నాడు. మరుసటి రోజు నుంచి సీత బడికి వెళ్లింది. తన చదువుకి తమ్ముడే కారణమని సోనుని గట్టిగా హత్తుకుంది. ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం సంపాదించుకున్నది. తల్లిదండ్రులకి మంచి పేరు తెచ్చింది. బాలికల విద్య ప్రగతికి సోపానం అని ఆ కుటుంబాన్ని చూసి అందరూ అనుకున్నారు.

నీతి : బాలికల చదువు
బంగారు భవితకు వెలుగు

- సాత్విక
7వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బెజ్జంకి మండలం, సిద్ధిపేట జిల్లా. 96033 89441.



ఇష్టం

మా అమ్మకు నేను అంటే ఇష్టం
మా నాన్నకు బజ్జి అంటే ఇష్టం
మా అక్కకు ఇడ్లీ అంటే ఇష్టం
మా చెల్లెలికి పువ్వులు అంటే ఇష్టం
మా తమ్ముడికి ఆటలు అంటే ఇష్టం
మా అన్నకు లడ్డు అంటే ఇష్టం
మా పెద్దమ్మకు గాజులు అంటే ఇష్టం
మా పెద్ద నాన్నకు చేపలు అంటే ఇష్టం
మా పిన్నికి కుందేలు అంటే ఇష్టం
మా చిన్న నాన్నకి గిచ్చడం అంటే ఇష్టం
మా తాతయ్యకు వార్తాపత్రిక అంటే ఇష్టం
మా నాయనమ్మకు కొబ్బరి నీళ్ళు అంటే ఇష్టం
నాకు చదువు అంటే ఇష్టం...

- ఎం. రోహిత,
3వ తరగతి, ప్రాథమిక పాఠశాల, నర్సింహులపల్లి, పెద్దపల్లి జిల్లా.



బొమ్మల కొలువు





ఎం.అఖిల్,
6వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోతారెడ్డిపేట, సిద్ధిపేట జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com వాట్సాప్ : 83329 25496

JEEVANA
జీవన the family

జీవన సౌరభం

శ్రమని గౌరవించాలి.
శ్రమని గుర్తించాలి.
శ్రమనే ఆయుధంగా మలుచుకోవాలి.

సిద్ధప్ప సివిల్స్ సాధించాడు..


'ఏ కలా పెద్దది కాద'ని నిరూపించడం అంత సులభం కాదు. అదీ పెద్దగా నేపథ్యం లేని కుటుంబాలలోని వ్యక్తులకు అది నెరవేరడం నిజంగా కలే.. ఇటీవల సివిల్స్ పరీక్షల్లో 551వ ర్యాంకు సాధించిన బ్రిదేవ్ సిద్ధప్ప ధోనె(27) ఇప్పుడు సరిగ్గా అదే పరిస్థితుల్లో ఉన్నారు. మహారాష్ట్ర కొల్హాపూర్‌లోని ఓ కుగ్రామం ఆయన స్వస్థలం. గొర్రెలను మేపే కుటుంబంలో పుట్టి పెరిగారు. ఊళ్లు తిరుగుతూ సంచారం చేసే తెగ వారిది. ఇటువంటి సామాజిక తరగతికి చెందిన వ్యక్తి చదువుకోవడమే కష్టం. అలాంటిది ధోనె బ్యూరోక్రసీలో ఉద్యోగం సాధించారు. అందుకే 'ఈ విజయం ధోనె ఒక్కర్దే కాదని, మా కుటుంబాలకు దక్కిన గౌరవమ'ని ఆ కుటుంబాలు సంబరాలు చేసుకున్నారు.





యుపిఎస్‌సి ఫలితాలు వెలువడే సమయానికి ధోనె వాళ్ల మామయ్య ఊరు కర్నాటక బెలగాంలో గొర్రెలు కాస్తూ ఉన్నారు. పంచె, ధోవతి, భుజంపై గొంగలి వేసుకుని సాంప్రదాయ పద్ధతిలో గొర్రెలు కాస్తున్న అతని ప్రపంచాన్ని ఈ సివిల్ ర్యాంకు పూర్తిగా మార్చేసింది. ఈ సంతోషానికి ఉబ్బితబ్బిబ్బయిన అతని మేన మామయ్య అప్పటికప్పుడు గౌరవ సూచకంగా పసుపు రాసిన తెల్లని వస్త్రంతో ధోనెకి తలపాగా చుట్టారు. అక్కడున్నది నలుగురే. అయినా ఎంతో సంబరంగా ఈ వేడుక నిర్వహించారు. ఈ మొత్తం సంఘటనని ఎవరో వీడియో తీసి వైరల్ చేశారు. అప్పటివరకు గొర్రెల కాపరి సిద్ధప్ప ధోనె సాధించిన విజయం ప్రపంచానికి తెలియలేదు. ఆ వీడియోలో సాధారణ గుడారం, గొర్రెలు, గడ్డి, నీటితొట్టె వంటివన్నీ కనిపిస్తున్నాయి. సివిల్ ర్యాంకు సాధించిన ధోని కుటుంబ పరిస్థితులు ప్రత్యక్షంగా చూసిన లక్షలాది వీక్షకులు ఈ విజయం అతని కృషికి, పట్టుదలకి దక్కిన గౌరవంగా అభివర్ణించారు.

అమ్మానాన్న, ఓ అన్న ఉన్న సిద్ధప్ప కుటుంబానికి గొర్రెలు, మేకలు కాయడమే ప్రధానవృత్తి. అన్న నాయక్ ఇండియన్ ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నారు. ఇప్పుడు సిద్ధప్ప సివిల్స్‌లో ర్యాంకు సాధించారు. తన విద్యాభ్యాసం గురించి సిద్ధప్ప ఓ ఇంటర్వ్యూలో ఇలా చెప్పారు. 'నా ప్రాథమిక విద్య జిల్లా పరిషత్ స్కూల్లోనే జరిగింది. సీనియర్ సెకండరీ విద్య జై మహారాష్ట్ర హైస్కూల్‌లో చదివాను. పూణె ఇంజినీరింగ్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశాను. సివిల్స్ రాయాలని ఉండేది. అయినా పలు పోటీపరీక్షలు రాసేవాడ్ని. చదువు పూర్తవ్వడంతోనే పోస్ట్‌మ్యాన్ ఉద్యోగం వచ్చింది. ఏడాదిపాటు విధులు నిర్వర్తించాను. కానీ నా కల నన్ను నిద్రపోనివ్వలేదు. సివిల్స్ చదవడం ఆర్థికంగా నాకు చాలా భారం. అయినా అంత పెద్ద కల కన్నాను. సాధించాను' అని ధోనె వివరించారు.



స్నేహితులు, కుటుంబ సభ్యులు ఇచ్చిన మద్దతు, ఆర్థికసాయంతో ధోనె తన కల నెరవేర్చుకునేందుకు ఉద్యోగానికి రాజీనామ చేసి ఢిల్లీ వెళ్లారు. ఆ రోజులను ఆయన ఇలా గుర్తు చేసుకున్నారు. 'నా కుటుంబం, పరిస్థితులు, నేను సివిల్స్ సాధించడం అసాధ్యం అనేలా ఉండేవి. ఉద్యోగం వదిలి రావడం నాలాంటి వారికి ఆర్థికంగా చాలా భారం. అయితే 'అవన్నీ నాకు తెలుసు. వాటిని మార్చాలనే నా ప్రయత్నం' అని మనసుకు చెప్పుకుని ప్రయత్నించాను' అని చెప్పారు.

పౌరసంబంధాలు అంతగా లేని సంచార కుటుంబాలకు చెందిన ధోని సాధించిన ఈ విజయం ఇప్పుడు ఆ వర్గాల్లోని ప్రజలకు ఎక్కడలేని గుర్తింపు, గౌరవాన్ని తీసుకొచ్చింది. మొదటి రెండు ప్రయత్నాలు విఫలమైనా మూడో ప్రయత్నంలో ధోనె ఈ విజయం సాధించారు. త్వరలో ఐపిఎస్ కేడర్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు. 'ఒక అధికారిగా ప్రజలు చెప్పేది నేను వినాలనుకుంటున్నాను. అలాగే వాళ్లు చెప్పేది వినబడేలా నన్ను నేను సిద్ధం చేసుకోవాలనుకుంటున్నాను' అంటున్న సిద్ధప్ప ధోనె ర్యాంకు సాధించిన కొన్ని రోజులకు గాని ఆయన స్వగ్రామం చేరుకోలేదు.

ఆ రోజు ధోనికి ఆ గ్రామం ఘన స్వాగతాలు పలికింది. పెద్ద ఎత్తున డప్పులు మోగించారు. పూలదండలతో ముంచెత్తారు. గ్రామ శివారు నుండి ఆయన ఇంటి వరకు ప్రజలంతా ర్యాలీగా నడిచివెళ్లారు. పట్టలేని సంతోషంతో ఆ గుంపులో చాలామందికి కన్నీళ్లు ధారాళంగా వచ్చాయి. ఒక వ్యక్తి విజయం మొత్తం సామాజిక వర్గాన్నే ప్రభావితం చేసిందనడానికి ఇంతకంటే నిదర్శనం మరొకటి ఉండదు.

సిద్ధప్ప ధోనె సాధించిన ఈ విజయం ర్యాంకు, అర్హతకి మించినది. తరతరాలుగా అణచివేతకి గురౌతున్న తనవారిని పైకి తీసుకురావలన్న తపన అందులో దాగుంది. తన దారిలో మరింతమంది యువకులను నడిచేలా చేసిన గెలుపు ఇది. సరైన మద్దతు, అవకాశాలు లభిస్తే ప్రతిభ ఎక్కడి నుండైనా ప్రజ్వరిల్లుతుంది. సిద్ధప్ప ధోనె ప్రయాణమే అందుకు నిదర్శనం.



హిట్ 3కీ పైరసీ భూతం


హిట్ 3 మూవీని పైరసీ భూతం వెంటాడింది. గతంలో రామ్‌చరణ్ నటించిన గేమ్‌ఛేంజర్, నాగచైతన్య-సాయిపల్లవి నటించిన తండేల్ సినిమాలు పైరసీ బారిన పడ్డాయి. ఇదే బాటలో హిట్ 3 విడుదలైన గురువారం కొన్ని గంటల్లోనే హెచ్‌డి ప్రింట్ కాపీ ఆన్‌లైన్‌లో చక్కర్లు కొట్టింది. పైరసీ కాపీ రావటంతో బాక్సాఫీస్ వద్ద వసూళ్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని నిర్మాతలు ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణా ఫిల్మ్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ దిల్‌రాజు కూడా షాక్‌కు గురయ్యారు. పైరసీ కేవలం ఆర్థిక నష్టాన్ని మాత్రమే కాక, సినిమా నిర్మాణంలో పాల్గొన్న వేలాదిమంది కళాకారులు, సాంకేతిక నిపుణుల కృషిని దెబ్బతీస్తోంది. ఈ పైరసీ బూతానికి అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని పరిశ్రమ నిపుణులు సూచిస్తున్నారు.




ప్రవీణ్ 'బకాసుర...' ఫస్ట్ లుక్

హాస్య నటుడు ప్రవీణ్ ప్రధాన పాత్రలో 'బకాసుర రెస్టారెంట్' అనే చిత్రం రాబోతోంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. ఎన్నో విజయవంతమైన చిత్రాలతో మంచి నటుడిగా, కమెడియన్‌గా అందరికి సుపరిచితుడైన ప్రవీణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. కృష్ణభగవాన్, షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్, ఇతర ముఖ్య పాత్రలు చేస్తున్నారు. ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'హంగర్ కామెడీ ఎంటంటైనర్‌గా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. పూర్తి వినోదాత్మకంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నేటి యువతరంతో పాటు అన్ని వర్గాలు అలరించే అంశాలున్నాయి. ప్రతి సన్నివేశం అందరికి ఎంతో థ్రిల్‌ను పంచుతుంది. ప్రవీణ్ కెరీర్‌లో గుర్తుండి పోయే సినిమాగా ఇది ఉండబోతుంది. నటుడిగా ఆయనలోని మరో కోణాన్ని ఈ చిత్రంలో చూడబోతున్నారు. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు మా చిత్రం తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది' అన్నారు.

యాక్సిడెంటల్ హీరోని



కోలీవుడ్ స్టార్ హీరో, పద్మ భూషణ్ అజిత్ కుమార్ తాజాగా ఆంగ్ల మీడియాకి ఓ ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో ఆయన తన జీవిత ప్రయాణం గురించి అనేక విషయాలు మాట్లాడారు. 'నేను ఎప్పుడు నటన నుండి వైదొలుగుతానో తెలియదు. బలవంతంగా వీడాల్సి రావచ్చు. నేను ఏ విషయాన్నైన కూడా తేలికగా తీసుకోకూడదు అనుకుంటున్నా. ప్రేక్షకులు నా నటన గురించి ఫిర్యాదు చేస్తారేమో, అప్పుడు వైదొగలగక తప్పదు. ఒకవేళ నన్ను అంతా ఆదరిస్తున్నప్పుడే తప్పుకుంటానేమో. జీవితం చాలా విలువైనది. నేను నా కెరీర్‌లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాను. నా స్నేహితులు క్యాన్సర్‌తో పోరాడుతున్నారు. అలాంటి వారిని చూసినప్పుడు జీవితం విలువ ఏంటో అర్థమవుతుంది. సమయాన్ని వృథా చేయకుండా నా లైఫ్‌లోని ప్రతిక్షణాన్ని ఆస్వాదించాలని అనుకుంటున్నా. 'నటనపై నేను ఎప్పుడూ దృష్టి పెట్టలేదు. యాక్సిడెంటల్ స్టార్‌ని నేను. స్కూల్ చదువుల తర్వాత ఆటోమొబైల్ రంగంలో పని చేసాను. 18 ఏళ్లు ఉన్నపుడు రేసింగ్ స్టార్ట్ చేశాను. రేసింగ్ ఖర్చుతో కూడుకున్న పని అవ్వటంతో మా అమ్మానాన్నలు ఆర్థికంగా నాకు అంతగా సపోర్ట్ చేయలేకపోయారు. అయినా నేను వెనక్కి తగ్గలేదు. రేసింగ్ కోసం డబ్బులు వస్తాయి కాబట్టి మోడలింగ్ చేశాను. మా కుటుంబానికి సినిమాలతో అస్సలు సంబంధం లేదు. వారికి నచ్చజెప్పి సినిమాల్లోకి వెళ్లా. వ్యాపారంలో బాగా దెబ్బతినటం వల్ల నేను సినిమాల్లోకి వచ్చాను.. నా యాస కారణంగా చాలా విమర్శలు ఎదుర్కొన్నాను. పట్టుదలతో అన్నిటిపై పట్టు సాధించాను. సినిమాల విషయంలో ఎంతో నిజాయితీగా ఉన్నాను' అని అజిత్ ఆ ఇంటర్వ్యూలో ఎన్నో విషయాలు ముచ్చటించారు.



రెండు నెలల్లో 'స్పిరిట్' సెట్స్‌పైకి

మారుతి దర్శకత్వంలో కథానాయకుడు ప్రభాస్ నటిస్తున్న చిత్రం 'రాజాసాబ్'. ఈ సినిమా షూటింగ్ పూర్తికాగానే తరువాత సినిమా ఏది చేస్తారనే విషయమై సామాజిక మాధ్యమాల్లో జోరుగా ఊహానాగాలు వస్తున్నాయి. స్పిరిట్ కంటే ముందే 'యానిమల్' సీక్వెల్‌ను సందీప్‌రెడ్డి చేయబోతున్నారనేది దీని సారాంశం. గతంలో అనుకున్న ప్రకారం రాజాసాబ్ పూర్తికాగానే 'స్పిరిట్' సినిమా సెట్స్‌పైకి రావాల్సివుంది. దీనికోసం ఇప్పటికే దర్శకుడు సందీప్‌రెడ్డి పనులు కూడా ప్రారంభించారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పెడుతూ సందీప్‌రెడ్డి వంగా ఒక ట్వీట్ కూడా చేశారు. స్పిరిట్ పూర్తయిన తర్వాతే యానిమల్ సీక్వెల్ చేస్తారని క్లారిటీ ఇచ్చారు. మరో రెండు మూడు నెలల్లో 'స్పిరిట్' షూటింగ్ కూడా ప్రారంభం కానుందని తెలిపారు. 2027లో ఈ చిత్రం విడుదల చేస్తామని కూడా ప్రకటించారు. స్పిరిట్ కోసం ప్రభాస్ 65 రోజుల కాల్షీట్లు కూడా ఇచ్చారని సమాచారం. ఆ మూవీ తర్వాత హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజీ' (ప్రచారంలో ఉన్న టైటిల్) షూటింగ్‌లో కూడా పాల్గొనే అవకాశం ఉంది. ప్రభాస్ చేతిలో ప్రస్తుతం స్పిరిట్, ఫౌజీతోపాటు ప్రశాంత్ వర్మ సినిమా కూడా ఉంది. ప్రశాంత్‌నీల్‌తో సలార్ 2, నాగ్ అశ్విన్‌తో కల్కి 2 చేయాల్సివుంది.

ప్లే-ఆఫ్స్ రేసునుంచి సన్‌రైజర్స్ ఔట్

- గుజరాత్ చేతిలో 38 పరుగుల తేడాతో ఓటమి
- గిల్, బట్లర్ అర్థ శతకాలు
- అభిషేక్ పోరాటం వృథా

అహ్మదాబాద్: ప్లే-ఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓటమి పాలైంది. 2024 సీజన్ రన్నరప్ అయిన సన్‌రైజర్స్ జట్టు గుజరాత్ టైటాన్ నిర్దేశించిన 225 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 6వికెట్లు కోల్పోయి 186పరుగులే చేయగల్గింది. అభిషేక్ శర్మ(74) అర్ధసెంచరీ మినహా మరో బ్యాటర్ రాణించలేకపోయాడు. గుజరాత్ బౌలర్లు సిరాజ్, ప్రసిధ్‌కు రెండేసి, ఇషాంత్, కోర్జేకు ఒక్కో వికెట్ దక్కాయి. ఈ గెలుపుతో గుజరాత్ ప్లే-ఆఫ్స్‌కు చేరువ కాగా.. సన్‌రైజర్స్ మరో మూడు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే ప్లే-ఆఫ్స్ రేసునుంచి నిష్క్రమించింది. అంతకుముందు గుజరాత్ ఓపెనర్ సాయి సుదర్శన్ తృటిలో అర్ధ సెంచరీని మిస్ చేసుకోగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(76) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్(64) కూడా అర్ధ శతకం బాదడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై గుజరాత్ జట్టు 6వికెట్ల నష్టానికి 224 పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. అర్ధసెంచరీకి చేరువైన సాయి సుదర్శన్‌ను యువ స్పిన్నర్ జీషన్ అన్సారీ ఔట్ చేసి తొలి బ్రేక్ అందించాడు. కట్ షాట్ ఆడబోయిన సాయి వికెట్ కీపర్ క్లాసెన్ చేతికి చిక్కాడు. దాంతో 87 పరుగుల వద్ద గుజరాత్ తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత జోస్ బట్లర్, శుభ్‌మన్ గిల్‌లు ధాటిగా ఆడుతూ స్కోర్ 100 దాటించారు. షమీ వేసిన 10వ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన గిల్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 10 ఓవర్ల ముగిసేసరికి గుజరాత్ జట్టు వికెట్ నష్టపోయి 120 పరుగులు చేసింది. సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్ ఓపెనర్లు సాయి సుదర్శన్(48), శుభ్‌మన్ గిల్(52 నాటౌట్)లు దంచికొట్టారు. గుజరాత్ జట్టు పవర్ ప్లే 6ఓవర్లు ముగిసేసరికి వికెట్ కోల్పోకుండా 82 పరుగులు చేసింది. ఐపిఎల్ చరిత్రలో గుజరాత్‌కు తొలి ఆరు ఓవర్లలో ఇదే అత్యధిక స్కోర్ కావడం విశేషం. ఇంతకుముందు 78/0 అత్యుత్తమంగా ఉండేది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జట్టు ఆరంభం నుంచే గుజరాత్ బ్యాటర్లు దూకుడు ప్రదర్శించారు. ముఖ్యంగా సాయి సుదర్శన్ కేవలం 23 బంతుల్లోనే 9 ఫోర్ల సహాయంతో 48 పరుగులు చేసి జట్టుకు వేగవంతమైన ఆరంభాన్ని అందించాడు. జీషన్ అన్సారీ బౌలింగ్‌లో కీపర్ క్లాసెన్‌కు క్యాచ్ ఇచ్చి సుదర్శన్ పెవిలియన్ చేరాడు. మరో ఎండ్ లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా విజృంభించి ఆడాడు. గిల్ కేవలం 38 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో 76 పరుగులు సాధించి జట్టు స్కోరును పరుగులు పెట్టించాడు. ఉనద్కట్ ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో సుందర్, తెవాటియా, రషీద్ ఖాన్ (0) వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు.



తొలి వికెట్‌కు 87 పరుగులు జతచేసిన సాయి కిషోర్-శుభ్‌మన్

స్కోర్‌బోర్డు...

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి)క్లాసెన్ 9బి)అన్సారి 48, శుభ్‌మన్ గిల్ (రనౌట్)హర్షల్ పటేల్/క్లాసెన్ 76, బట్లర్ (సి)అభిషేక్ శర్మ (బి)కమిన్స్ 64, సుందర్ (సి)నితీశ్ రెడ్డి (బి)ఉనాద్కట్ 21, షారుక్ ఖాన్ (నాటౌట్) 6, తెవాటియా (సి)అనికేత్ (బి)కమిన్స్ 6, రషీద్ ఖాన్ (సి అండ్ బి)ఉనాద్కట్ 0, అదనం 3. (20ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 224 పరుగులు. **వికెట్ల పతనం:** 1/87, 2/149, 3/212, 4/218, 5/224, 6/224 **బౌలింగ్:** షమీ 3-0-48-0, ఉనాద్కట్ 4-0-35-3, కమిన్స్ 4-0-40-1, హర్షల్ పటేల్ 3-0-41-0, అన్సారి 4-0-42-1, కమిందు మెండీస్ 2-0-18-0.

సన్‌రైజర్స్ హైదరాబాద్: హెడ్ (సి)రషీద్ ఖాన్ (బి)ప్రసిధ్ 20, అభిషేక్ శర్మ (సి)సిరాజ్ (బి)ఇషాంత్ 74, ఇషాన్ కిషన్ (సి)ప్రసిధ్ (బి)కోర్జే 13, క్లాసెన్ (సి)బట్లర్ (బి)ప్రసిధ్ 23, అంకిత్ వర్మ (సి)షారుక్ ఖాన్ (బి)సిరాజ్ 3, నితీశ్ రెడ్డి (నాటౌట్) 21. కమిందు మెండీస్ (సి)బట్లర్ (బి)సిరాజ్ 0, కమిన్స్ (నాటౌట్) 19, అదనం 13. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 186పరుగులు. **వికెట్ల పతనం:** 1/49, 2/82, 3/139, 4/141, 5/145, 6/145

బౌలింగ్: సిరాజ్ 4-0-33-2, ఇషాంత్ 3.2-0-35-1, ప్రసిధ్ 4-0-19-2, కోర్జే 4-0-36-1, సుందర్ 1-0-6-0, రషీద్ ఖాన్ 3-0-50-0. సాయి కిషోర్ 0.4-0-2-0.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
ముంబయి	11	7	4	0	14	+1.27
గుజరాత్	10	7	3	0	14	+0.86
బెంగళూరు	10	7	3	0	14	+0.52
పంజాబ్	10	6	3	1	13	+0.27
ఢిల్లీ	10	6	4	0	12	+0.36
లక్నో	10	5	5	0	10	-0.32
కోల్‌కతా	10	4	5	1	9	+0.27
రాజస్తాన్	11	3	8	0	6	-0.78
సన్‌రైజర్స్	10	3	7	0	6	-1.19
చెన్నై	10	2	8	0	4	-1.21

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

ఐపిఎల్‌లో నేడు

బెంగళూరు x చెన్నై సూపర్‌కింగ్స్
వేదిక: బెంగళూరు; రాత్రి 7.30గంIIలకు

రాణించిన హర్షిత

- దక్షిణాఫ్రికాపై శ్రీలంక గెలుపు
- మహిళల ముక్కోణపు సిరీస్

కొలంబో: మహిళల ముక్కోణపు సిరీస్‌లో ఆతిథ్య శ్రీలంక జట్టు శుభారంభం చేసింది. ప్రేమదాస స్టేడియంలో దక్షిణాఫ్రికా మహిళలతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక జట్టు ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాను శ్రీలంక బౌలర్లు మల్కీ మధరా(4/50), విహంగ(3/41) రాణించారు. దీంతో దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 235పరుగులే చేసింది. లారా గుడైల్(46), ట్రయాన్(35), లూస్(31)కి తోడు డెర్కెసన్(61) అర్ధసెంచరీతో ఆదుకున్నారు. ఆ లక్ష్యాన్ని శ్రీలంక మహిళల 46.3ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించారు. ఓపెనర్, కెప్టెన్ ఆటపట్టు(6) నిరాశపరిచినా.. పెరీరా(42), గుణరత్నే(29) ఆదుకున్నారు. వీరిద్దరికి తోడు హర్షిత(77), కవిషా దిల్హారి(61) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. దీంతో శ్రీలంక జట్టు 46.3ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 237పరుగులు చేసి విజయం సాధించింది. దక్షిణాఫ్రికా బౌలర్లు మాబాకు రెండు, క్లాస్, క్లార్క్, లూస్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హర్షితకు దక్కింది. ఆదివారం భారత్-శ్రీలంక జట్ల మధ్య రెండో లీగ్ మ్యాచ్ జరగనుంది.

ఇంగ్లండ్ టెస్ట్ కెప్టెన్‌గా స్టోక్స్



లండన్: జింబాబ్వేతో జరిగే ఏకైక టెస్టుకు ఇంగ్లండ్-వేల్స్ క్రికెట్ బోర్డు జట్టును ప్రకటించింది. 13 మంది ఆటగాళ్లతో కూడిన జట్టును ఇసిబి శుక్రవారం ప్రకటించగా.. సీనియర్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్‌కు పగ్గాలు అప్పగించింది. 27 ఏళ్ల పేసర్ సామ్ కుక్‌కు తొలిసారి జాతీయ జట్టులో చోటు కల్పించింది. కుక్‌తో పాటు జోర్డాన్ కాక్స్‌ను కూడా ఈ మ్యాచ్‌కు ఎంపిక చేసిన సెలక్టర్లు.. జోష్ టంగ్‌కు కూడా తిరిగి పిలుపునిచ్చారు. స్వదేశంలో జింబాబ్వేతో టెస్టుతో కెప్టెన్ బెన్ స్టోక్స్ తిరిగి ఆటలో అడుగుపెట్టనున్నాడు. మే 22-25 వరకు సొంతగడ్డపై ఇంగ్లండ్ జింబాబ్వేతో నాలుగు రోజుల టెస్టు మ్యాచ్ ఆడనుంది.

జట్టు: స్టోక్స్ (కెప్టెన్), క్రాలే, డకెట్, పోప్, రూట్, బ్రూక్, స్మిత్, జోర్డాన్ కాక్స్ (వికెట్ కీపర్), సామ్ కుక్, అట్కిన్సన్, బషీర్, పాట్స్, టంగ్.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68